ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడు అన్నట్లు తయారైంది ఎస్సీ కార్పొరేషన్ పరిస్థితి. కొందరు ఉద్యోగులు ఆడింది ఆట పాడిందే పాటగా అక్కడ సాగుతోంది. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మరీ వసూలు చేసిన సొమ్మును ప్రభుత్వ ఖాతాకు జమ చేయకుండా వారే దిగమింగేస్తున్నారు. ఇలా ప్రభుత్వానికి జమ చేయకపోవటంతో కార్పొరేషన్ నుంచి రుణం తీసుకున్న లబ్ధిదారులు రుణం ఏమీ తీర్చనట్లుగానే సంస్థ లెక్కల్లో కనిపిస్తోంది. దీంతో బకాయి కట్టాలంటూ లబ్ధిదారులకు నోటీసులు, ఫోన్ కాల్స్‌తో హెచ్చరికలు, వారి యూనిట్లు మూసి వేస్తామంటూ బెదిరింపులు నిత్యకృత్యమయ్యాయి. కొంతమంది లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్‌కు వచ్చి తమ వద్ద గతంలో ఏ ఉద్యోగి ఎంతమేర రికవరీ చేశారో తెలియజేస్తూ తమకు న్యాయం చేయాలంటూ అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నారు. అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం.. ముందు ఎంతో కొంత కట్టాలని అడుగుతుండటంతో లబ్ధిదారులు విస్తుపోతున్నారు.



ఎస్సీ కార్పొరేషన్‌లో
ఇంటి దొంగలు

రుణాల రికవరీ సొమ్ము జేబుల్లోకి..

- బకాయిలు చెల్లించాలని లబ్ధిదారులపై ఒత్తిడి
- ఎవరెంత కట్టారో 'లెక్క'లేనితనం
- బోగస్ రసీదులతో రూ.లక్షల్లో స్వాహా
- నోటీసులతో బాధితులు లబోదిబో..
- ఉన్నతాధికారుల ఉదాసీనతే కారణమంటూ ఆరోపణలు

ఒంగోలు నగరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంటి దొంగలెవరో ఆ శాఖ అధికారులకు తెలిసి కూడా వారి గురించి పెద్దగా పట్టించుకోవటం మానేశారు. లబ్ధిదారుల నుంచి రికవరీ పేరుతో వసూలు చేసిన సొమ్ము కార్పొరేషన్‌లోని కొద్దిమంది ఉద్యోగులు తమ సొంతజేబుల్లో వేసుకుని సొంతానికి వాడేసుకుంటున్న తమకెందుకులే అన్నట్లుగా ఆ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. కార్పొరేషన్‌లో వివిధ పథకాల కింద రుణాలు పొందిన వారు తిరిగి చెల్లించాల్సిన బకాయిలు రూ.27కోట్లు ఉన్నాయి. గత వైసీపీ పాలనలో కార్పొరేషన్ నుంచి ఎస్సీలకు ఒక్క రూపాయి కూడా రుణంగా ఇవ్వలేదు. 2019 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం కోట్లాది రూపాయలు రుణాలుగా ఎస్సీలకు ఇచ్చేసింది. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కెఎఫ్‌డీ, ఇన్నోవా కార్లు, ఇతియోస్ కార్లను ఎస్సీ యువతకు అందజేసింది. అనంతరం వైసీపీ అధికారంలోకి రావటంతో కొత్తగా రుణాలు ఇవ్వకపోగా గత తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన రుణాలను తిరిగి వసూలు చేసేందుకే అధిక ప్రాధాన్యత ఇచ్చింది. రుణాల రికవరీలో కార్పొరేషన్ సిబ్బంది దక్షిణకాడికి దోచేసుకున్నారు.

ఎన్ఎంఆర్ ఉద్యోగికి రికవరీ బాధ్యతలు

ఎస్సీ కార్పొరేషన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎస్సీ కార్పొరేషన్‌లో రుణాల రికవరీల దందా కొనసాగింది. కార్పొరేషన్ ఈడీలకు అనుకూలంగా ఉన్న ఉద్యోగులకు రుణాల రికవరీ బాధ్యతలను అప్పగించేశారు. కార్పొరేషన్‌లో ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్న చిరుద్యోగికి అప్పటి ఈడీ రికవరీ బాధ్యతలు

మిగతా 6లో...



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరణలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఉగ్ర, ముత్తుముల, దర్శి, వైపాలెం నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు డాక్టర్ లక్ష్మి, ఎరిక్షన్‌బాబు

ఏ ఎన్నికల్లోనైనా వైసీపీ భయపడేలా తీర్పుండాలి

- స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం
- సార్వత్రిక ఎన్నికల్లో వై.పాలెంలో టీడీపీ జెండా ఎగరేద్దాం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఐ.టి వరం (త్రిపురాంతకం), జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు జరిగినా వైసీపీ నాయకులు భయపడేలా మీరిచ్చే తీర్పు ఉండాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పుల్లలచెరువు మండలంలోని ఐటీవరం గ్రామంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో రూ.3 కోట్ల 80లక్షలతో నిర్మిస్తున్న 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ఆవిష్కరించి అనంతరం ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. గత ఎన్నికల్లో 11 సీట్లకు వైసీపీని పరిమితం చేయటంతో జగన్ ఇప్పుడు రోడ్ల వెంట తిరుగుతున్నాడని, రాబోయే రోజుల్లో వైసీపీని జీరోకు పరిమితం చేయాలని అన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరేయాలనే లక్ష్యంతో పార్టీ కార్యకర్తలు నాయకులు పని చేయాలని, అందుకు రానున్న స్థానిక ఎన్నికల్లో మీరిచ్చే తీర్పు నిదర్శనం కావాలన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో విద్యుత్ ఇవ్వటానికి అటవీ అనుమతులు అడ్డంకిగా ఉంటే అక్కడ వారికి సోలార్ వెలుగులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పుల్లలచెరువు మండలంలో రంగన్నపాలెం వద్ద 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు నిధులు ఇవ్వకుండా గత పాలకులు శంకుస్థాపన చేశారని, దానిని తాము మళ్లీ శంకుస్థాపన చేయటం లేదని పూర్తి చేసి చూపిస్తామని అన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించుకోవటం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజల హృదయాల్లో రామారావు పాలనతో చెరగని ముద్ర వేసిన విషయాన్ని గుర్తు చేశారు. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ మంచి ప్రభుత్వానికి మద్దతుగా ఉండి మీకోసం స్థానికంగా ఉండి సేవలందిస్తున్న ఎరిక్షన్‌బాబును రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. వైసీపీ చేసిన గత పాలనలోని విధ్వంసాలను,

మిగతా 6లో...

- టీచర్లు, ఉద్యోగుల ఎదురుచూపులు
- బదిలీల ప్రక్రియ నేపథ్యంలో ఆలస్యం

జీతాల బిల్లుల్లో జాప్యం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాల చెల్లింపులో జాప్యం నెలకొంది. గత నెలలో బదిలీలు జిల్లావ్యాప్తంగా భారీగా జరిగాయి. మరోవైపు ఉద్యోగుల జీతాల బిల్లులు పెట్టే డ్రాయింగ్ ఆఫీసర్లు కూడా అధికసంఖ్యలో మారడం, సకాలంలో వచ్చి విధుల్లో చేరకపోవడం వంటి కారణాలతో జీతాల బిల్లులు సకాలంలో ట్రెజరీలకు చేరలేదు. దీంతో జూలై నెలలో ఇవ్వాల్సిన జీతాలు వారి అకౌంట్లలో జమ కాని పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాల బిల్లులను సాధారణంగా 20 నుంచి 25వ తేదీ వరకు ట్రెజరీ కార్యాలయాల్లో ఇవ్వాల్సి ఉంది. అలా బిల్లులు ఇస్తే ప్రతినెల 1వతేదీన ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాలను ప్రభుత్వం వారివారి అకౌంట్లలో జమచేస్తోంది. అయితే గత నెలలో భారీగా బదిలీలు జరిగాయి. అలా బదిలీలు జరిగిన తర్వాత ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం నుంచి మరొక చోటకు మారారు. ఆయన పనిచేస్తున్న స్థానం నుంచి బదిలీ అయిన స్థానంలో ఉద్యోగి చేరిన తర్వాత ముందు పనిచేసిన కార్యాలయం నుంచి లాస్టు పే సర్టిఫికెట్(ఎల్‌పీసీ)ను కొత్త స్థానానికి పంపాల్సి ఉంటుంది. అలా ఆ ఎల్‌పీసీ సర్టిఫికెట్ పంపిన తర్వాత కొత్త స్థానంలో

మిగతా 6లో...



ఏడీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన పొదుపు మహిళలు

మెప్మాలో మళ్లీ 'బోగస్' రచ్చ!

- ఆర్పీ చేతివాటంతో రోడ్డెక్కిన బాధితులు
- పరస్పరం వాగ్వాదం
- న్యాయం చేయాలని మహిళల ఆవేదన

మెప్మాలో బోగస్ గ్రూపుల బాగోతం బయటపడుతోంది. సంఘ సభ్యుల పేరుతో కొందరు ఆర్పీలు నకిలీ గ్రూపులు సృష్టించి రూ.లక్షలు దోచుకోవడంతో బాధితులైన పొదుపు సంఘాలు బోరుమంటున్నాయి. ఆ లోన్ తీర్చాలంటూ బ్యాంకర్లు పొదుపు సభ్యులను ఒత్తిడి చేయడంతో వారు కంగుతింటున్నారు. ఇప్పటికే అనేక బోగస్ గ్రూపులు తయారు చేసి, బ్యాంకర్లను నమ్మించి కాజేసిన సొమ్ము రికవరీ కాకపోగా, తాజాగా మరో బోగస్ గ్రూపు వెలుగులోకి వచ్చింది.

మిగతా 6లో...



మల్లవరంలో మరియమ్మ కుటుంబంతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- తక్షణమే ఇల్లు మంజూరు చేస్తున్నా
- నిర్మాణానికి అదనపు సాయం చేస్తా
- షాపు ఏర్పాటు చేసుకునేందుకు సాయం అందిస్తా

మల్లవరంలో దళితురాలైన గొల్లపాటి మరియమ్మ కుటుంబాన్ని పరామర్శించిన జేసీ గోపాలకృష్ణ



కంభం పోలీసుస్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న లింగోజీపల్లి గ్రామస్థులు

ఇంత దారుణమా?

- లింగోజీపల్లిలో అడవి ఎక్కడుందో చూపాలి
- ఆహారం, నీరు లేకనే లక్షిత్ మరణించాడని పోలీసులు ఎలా చెబుతారు?
- దారి తెలియక మరణించాడని ఎలా నిర్ధారిస్తారు?
- కంభం పోలీసుస్టేషన్ ఎదుట గ్రామస్థుల నిరసన



లక్షిత్ (ఫైల్)

కంభం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 'పోలీసు ఉన్నతాధికారులు లింగోజీపల్లి గ్రామం రావాలి. అడవి ఎక్కడో చూపాలి. బాలుడు లక్షిత్ రెండు రోజులు అడవిలో చిక్కుకుని ఆహారం, నీరు లేక మరణించాడని పోలీసు అధికారులు ఏ ఆధారాలతో నిర్ధారణకు వచ్చారో తెలపాలి' అంటూ కంభం మండల లింగోజీపల్లి గ్రామస్థులు శుక్రవారం కంభం పోలీసు స్టేషన్ ముందు బైటాయించి ఆందోళన చేశారు. మంగళవారం లింగోజీపల్లి గ్రామంలో అంగన్‌వాడీ స్కూలు నుంచి బయటకు వచ్చి కనిపించకుండా పోయిన లక్షిత్ అనే బాలుడు రెండు రోజుల తరువాత గురువారం ఉదయం పొలంలో అనుమానాస్పద స్థితిలో మరణించి ఉండడం జిల్లాలో సంచలనం రేపిన విషయం పాఠకులకు విదితమే. మంగళవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయిన లక్షిత్ కోసం గ్రామస్థులు, పోలీసులు డ్రోన్ల సహాయంతో 10 కిలోమీటర్ల మేర జల్లెడపట్టినా బాలుడు ఆచూకీ లభించకపోవడం, గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో నల్లవాగు సమీపంలో చిల్ల కంప వద్ద బాలుడి

మిగతా 6లో...

లంచమిస్తేనే రిజిస్ట్రేషన్

- లేకుంటే కొర్రీల కొరడా
- ఎనీవేర్‌తో ఎక్కడివైనా చేసేస్తారు..
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో షరామామూలే
- గిద్దలూరులో గత మంగళవారమే రెక్కీ

గిద్దలూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఎన్.క్రిష్ణమోహన్‌రావు బరితెగించి వ్యవహరించడంతో కేసు ఏసీబీకి చేరింది. చివరకు రూ.35వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడి ఊచలు లెక్కిస్తున్నారు. గత నవంబరులో బదిలీపై గిద్దలూరుకు వచ్చిన ఆయన అప్పటి నుంచి ఇప్పటివరకు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తూ లంచాలలో మునిగి తేలారు. ఏ చిన్న రిజిస్ట్రేషన్‌కు వెళ్లినా వేలల్లో డిమాండ్ చేస్తూ, ఇవ్వకపోతే రిజిస్ట్రేషన్లు చేయకుండా ఏదో ఒక సాకు చెప్పి వాయిదా వేస్తున్నారు. జనం విధిలేక అడిగినంత కాకపోయినా ఎంతో కొంత మాట్లాడుకుని గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు.



గిద్దలూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గిద్దలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌రావు అక్రమాలకు అంతులేకుండా పోతోంది. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ జీవోను అడ్డం పెట్టుకుని మార్కాపురానికి చెందిన ఒక స్థలం రిజిస్ట్రేషన్‌ను ఇటీవలే గిద్దలూరులో చేసి రూ.10లక్షలకుపైగా లంచం తీసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సక్రమమైన రిజిస్ట్రేషన్ అయితే మార్కాపురంలోనే జరిగేది కదా అని, ఇంత పెద్ద మొత్తం లంచం ఇచ్చారంటే ఆ రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలంలో ఏదో ఒక లొసుగు ఉండి ఉంటుందని ఏసీబీ అధికారులు తాజాగా చేసిన తనిఖీలో గుర్తించినట్లు తెలిసింది. పట్టణంలోని పలు స్థలాలు, బిల్డింగ్‌ల రిజిస్ట్రేషన్‌లో కూడా భారీ ఎత్తున డబ్బు గుంజినట్లు తెలిసింది. గిద్దలూరు పట్టణంలోని దాదాపు అన్ని ప్రాంతాలలో పాత ఇళ్ళు, స్థలాలకు రిజిస్ట్రేషన్లు ఉన్నప్పటికీ అప్పట్లో సర్వే నెంబరు వేసేవారు కాదు. ప్రస్తుతం సర్వే నెంబరు

మిగతా 6లో...



వైభవంగా శాకాంబరి వేడుకలు



కూరగాయల అలంకారంలో అమ్మవారు

గిద్దలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం శాకాంబరి వేడుకలు వైభవంగా జరిగాయి. అమ్మవారి మూలవిరాట్‌ను, ఉత్సవ విగ్రహాన్ని, ఆలయం మొత్తాన్ని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు శాకాంబరి వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగ సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొమరోలులో...

కొమరోలు, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం శాకాంబరీ దేవి అలంకరణలో ప్రజలకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పలురకాల కూరగాయలు, పండ్లతో అందంగా అలంకరించారు. సాయంత్రం ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్‌ఎస్సైగా తిరుపతి స్వామికి ఉద్యోగోన్నతి

ఒంగోలు క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : ఆర్మ్‌డ్ రిజర్వుడు విభాగంలో ఏఆర్‌ఎస్సైగా పనిచేస్తున్న వి.తిరుపతిస్వామికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజీ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు తిరుపతిస్వామి మర్యాదపూర్వకంగా శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి పూల బొకే అందజేశారు.

బైకు ఢీకొని వృద్ధుడి మృతి



వెంకటేశ్వర్లు

కలిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కలిగిరి-సంగం మార్గంలో వెలగపాడు గ్రామ సమీపంలో బైకు ఢీకొనడంతో వెంకటేశ్వర్లు(75) మృతి చెందాడు. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా దర్శి సమీపంలోని కురిచేడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు వెలగపాడు వద్ద ఉన్న ఓ వెంచర్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి వెంచర్‌లో నుంచి వెలుపలకు వచ్చి రోడ్డు మార్జిన్‌లో నడుచుకొంటూ వెళుతుండగా పాతనాపురం నుంచి కలిగిరి వైపు వస్తున్న బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడుని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడని మృతుడి బంధువులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలు బుద్ధి చెప్పినా మారని వైసీపీ నేతలు

- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి
- ఆత్మీయ సమావేశం పేరుతో నాయకులు అబద్ధాలాడటం సిగ్గుచేటని విమర్శ

టంగుటూరు (కొండపి), జూలై11 (ఆంధ్రజ్యోతి): ఆత్మీయ సమావేశం పేరుతో శుక్రవారం కొండపిలో వైసీపీ కార్యకర్తల సమావేశంలో నాయకులు మాట్లాడిన అసత్యాలపై రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తూర్పు నాయుడుపాలెంలోని తన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ నాయకుల అవాకులు, చెవాకులపై స్వామి నిప్పులు చెరిగారు. ప్రజలు 11 సీట్లిచ్చి బుద్ధి చెప్పినా వారికి బుద్ధి రాలేదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరగని సంక్షేమం, అభివృద్ధిని ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చేసి చూపిందని స్వామి తెలిపారు. తల్లికి వందనం పథకంలో చదువుకునే పిల్లలు ఎందరున్నా వారందరికీ డబ్బులు తల్లుల ఖాతాలో వేసినా సిగ్గు లేకుండా వైసీపీ నాయకులు తాము



మంత్రి స్వామి

ఇచ్చినంత మందికి కూటమి ప్రభుత్వం ఇవ్వలేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2029 తర్వాత వైసీపీ రాష్ట్రంలో కనుమరుగవుతుందని స్వామి అన్నారు. మూడు నియోజకవర్గాలు మారిన మాజీ మంత్రి సురేష్ గతంలో ఒకసారి చొక్కా విప్పుకుని, తర్వాత ప్రజలతో చొక్కా విప్పించుకున్నాడని స్వామి విమర్శించారు. ఓటమి పాలైన సురేష్ పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నాడని స్వామి మండి పడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డిని మించిన నటుడు ఎవరూ లేరని, కోడికత్తి, బాబాయి గొడ్డలి లాంటి పనులు చేసి బాగా నటించాడని విమర్శించారు. వైసీపీ పాలనలో మహిళలపై జరిగినన్ని అఘాయిత్యాలు ఏరాష్ట్రంలో జరగలేదని, దళితులపై దాడులు జరుగుతుంటే సురేష్ నోరు మెదపలేదు ఎందుకు? అని స్వామి పేర్కొన్నారు. రప్పారప్పా అంటూ పిచ్చి మాటలు మాట్లాడితే వైసీపీ రాజకీయాలకి, రౌడీ మూకలకీ కొండపి నియోజకవర్గంలో స్థానం లేదన్నారు. వైసీపీ రాబోయే రోజుల్లో అధికారంలోకి రావడం కల్ల మాత్రమేనని, ఎన్ని పగటి కలలు కన్నా మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వమేనని స్వామి పేర్కొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌లో ఇంటి దొంగలు

(5వపేజీ తరువాయి)

అప్పగించారు. ఆ ఉద్యోగి సొంతంగా బిల్లు పుస్తకాలు ముద్రించుకుని కార్లో జిల్లా అంతటా తిరుగుతూ లబ్ధిదారులను కలిసి రికవరీ పేరుతో భారీగా వసూలు చేసేకున్నారు. తాను తీసుకున్న డబ్బులకు కార్పొరేషన్ పేరుతో రసీదులు ఇస్తూ లక్షలాది రూపాయలు వసూలు చేసుకుని కార్పొరేషన్ ఖాతాకు జమ చేయలేదు. ఈ ఉద్యోగి రికవరీ దందా బట్టబయలు కావటంతో అతడిని రెండేళ్ల క్రితం ఉద్యోగం నుంచి తొలగించారు. అయితే ఆ ఉద్యోగి ఎంత మంది నుంచి ఎంత వసూలు చేశారనే వివరాలు గానీ, లెక్కలు గానీ ఇంతవరకు నిగ్గుతేల్చలేదు. దీంతో ఇప్పుడు రుణాల రికవరీకి వెళుతుంటే తాము ఆ ఉద్యోగికి చెల్లించాం అంటూ లబ్ధిదారులు తెగేసి చెబుతున్నారు.

- **రికవరీ మేళాలో చెల్లించిన సొమ్ము కూడా నొక్కేశారు**

ఒకరో ఇద్దరో ఉద్యోగులు కాదు.. ఎస్సీ కార్పొరేషన్‌లో రికవరీ సొమ్మును కార్పొరేషన్ ఖాతాకు జమ చేయకుండా సొంతానికి వాడేసుకున్న వారిలో కార్పొరేషన్‌లో ఎక్కువ మందే ఉన్నారు. రుణాలు మంజూరు చేసే సమయంలో లబ్ధిదారుల నుంచి వేల రూపాయలు లంచాలుగా మింగిన ఆ ఉద్యోగులే రుణాల రికవరీలో కూడా బరితెగించి దిగమింగేశారు. ఏడాదిన్నర క్రితం అప్పటి ఈడీగా ఉన్న క్రిష్టవేణి లబ్ధిదారుల నుంచి రుణాల రికవరీ చేసేందుకు ప్రత్యేకంగా రికవరీ మేళాను నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ఉన్న ప్రగతి భవన్‌కు సమీపంలోని పాత జిల్లా పరిషత్ సమావేశం హాలులో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అనేక మంది లబ్ధిదారులు రుణాల కిస్తీలను చెల్లించారు. ఆ ఒక్కరోజే రూ.10లక్షల దాకా చెల్లించి రసీదులు కూడా తీసుకున్నారు. తీరా ఇప్పుడు లెక్కలు తీస్తే కార్పొరేషన్ ఖాతాకు రికవరీ మేళాలో వచ్చిన సొమ్ము పూర్తిస్థాయిలో జమ చేయలేదు. సగానికి సగం ఉద్యోగులు సొంతానికి వాడేసుకున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పుడు కార్పొరేషన్ కార్యాలయం నుంచి 'మీరు ఇంతవరకు ఏమీ చెల్లించలేదు.. వెంటనే చెల్లించండి' అంటూ ఫోన్లు చేస్తుండటంతో లబ్ధిదారులు విస్తుపోతున్నారు.

లెక్కలు తేల్చకుండా రికవరీ ఎలా...

ఎస్సీ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా రుణాల రికవరీలో నేలవిడిచి సాము చేస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారు. రుణాల పొందిన ఎస్సీలు ఎంతో కొంత తిరిగి కార్పొరేషన్‌కు చెల్లిస్తున్న డబ్బు ఎటు పోతుందో కూడా లెక్కలు లేకుండా ఇంకా రావాల్సిన బకాయిలను వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. తాము ముందు చెల్లించిన డబ్బును లెక్కలో వేయండి అంటూ లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నా కార్పొరేషన్ అధికారులు సమాధానం చెప్పకుండా 'తర్వాత చూద్దాం. ఇప్పుడు కట్టండి' అంటూ ఒత్తిడి తెస్తున్నారు. రుణాల రికవరీలో అక్రమాలకు పాల్పడ్డాడని ఒక ఎన్ఎంఆర్ ఉద్యోగిని ఉద్యోగం నుంచి తొలగించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఇంకా కొంతమంది రికవరీలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నా వారి గురించి పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించటం లేదు. లబ్ధిదారులు తిరిగి చెల్లిస్తున్న బకాయిలు లెక్కల్లో పడతాయో లేక ఉద్యోగుల జేబుల్లోకి పోతాయో తెలియని పరిస్థితుల్లో ఎస్సీ కార్పొరేషన్ రుణాల పొందినవారు ఉన్నారు. ఇంటి దొంగల అంతుచూడకుండా రుణాల రికవరీ అంటూ లబ్ధిదారులపైన ఒత్తిడి తేవటంపై కార్పొరేషన్ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లంచమిస్తేనే రిజిస్ట్రేషన్

(5వపేజీ తరువాయి)

లేనిది రిజిస్ట్రేషన్ జరగడం లేదు. దానికితోడు చాలా మందికి వారి స్థలాలు, ఇళ్లు సొంతమే అయినప్పటికీ డాక్యుమెంట్లు ఉండవు. వీటిని అడ్డం పెట్టుకుని వీఆర్వోలతో పొజిషన్ సర్టిఫికేట్లు తీసుకుని లక్షలు ఇస్తే తప్ప రిజిస్ట్రేషన్లు జరుపని పరిస్థితి కనిపిస్తోంది.

ఇష్టారీతిన బరితెగింపు

ఎవరైనా లంచం తీసుకునేటపుడు గుట్టుచప్పుడు కాకుండా, మూడో కంటికి తెలియకుండా వీలుంటే మధ్యవర్తి సహాయంతో ప్రభుత్వ కార్యాలయంలో కాకుండా బయట ఎక్కడో తీసుకుంటారు. కానీ ఈ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ క్రిష్ణమోహన్‌రావు మాత్రం డాక్యుమెంట్ రైటర్లు వద్దు, మధ్యవర్తి వద్దు, నేరుగా మీరే రండి, లంచం మాట్లాడుకోండి, ఇచ్చిపోండి అంటూ కార్యాలయంలో బహిరంగంగానే చెబుతుంటారు. కార్యాలయం వెనకకు వెళ్లి అక్కడ ఉన్న చెట్టు వద్ద మూత్రవిసర్జన చేసి సిగరెట్ కాలుస్తూ అక్కడే లంచాలు అందరూ చూస్తుండగానే తీసుకుని జేబులో పెట్టుకుని వెళుతుండడం విశేషం. లక్షలాది రూపాయల లంచాలకు ఆ చెట్టే సాక్ష్యంగా ఉన్నట్లు గుసగుసలు ఆడుకుంటున్నారు. ఇంకా బరితెగించిన విషయమేమంటే ఎవరైనా లంచాలను డబ్బు రూపంలోనే తీసుకుంటారు. కానీ ఈయన మాత్రం బ్యాంక్ అకౌంట్‌లో వేసినా, ఫోన్‌పే చేసినా ఒకే అని చెప్పడం ఏసీబీ అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏసీబీ రైడ్‌లో క్రిష్ణమోహన్‌రావు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన నేపథ్యంలో అతని బ్యాంక్ అకౌంట్, ఫోన్‌పేలను పరిశీలించగా అందులో ఉన్న ఎంట్రీలు చూసి నివ్వెర పోయినట్లు తెలిసింది. ఐదారు మంది డాక్యుమెంట్ రైటర్ల నుంచి లంచాలు నగదు రూపంలో కాకుండా ఎక్కువ భాగం ఫోన్‌పేల ద్వారా, అకౌంట్ ద్వారా సబ్ రిజిస్ట్రార్ వేసుకున్నట్లు గుర్తించి ఏసీబీ అధికారులే నోరెల్లబెట్టారు. గిద్దలూరులో పని చేసిన ఈ 8 నెలల కాలంలో ఇలా ఫోన్‌పేల ద్వారా జరిపిన ఎంట్రీలు సుమారు 60 పేజీలు ఉన్నాయంటే ఎంత బరితెగింపో ఇట్టే అర్థమవుతుంది. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే అదే రోజు సాయంత్రం 5 గంటలలోగా లంచం డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ డాక్యుమెంట్ రైటర్లపై ఒత్తిడి తెచ్చి డబ్బు తీసుకునే వాడని తెలిసింది. పార్టీ అకౌంట్‌లో వేశారు, డ్రా చేసి మరుసటి రోజు ఇస్తామంటే కూడా అవసరం లేదు, నా అకౌంట్‌లోకి కొట్టండి అంటూ సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వెళ్ళేలోగా లంచం సొమ్ము తీసుకునే వెళ్ళేవాడని తెలుస్తోంది.

మ్యారేజ్ సర్టిఫికెట్‌కు రూ.5వేలు

ప్రస్తుత రోజుల్లో మారిన నిబంధనల ప్రకారం మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి అయింది. మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం వస్తే ధనిక, పేద తేడా లేకుండా 5వేల రూపాయలు లంచం ఇస్తే తప్ప సర్టిఫికెట్ జారీ చేయని పరిస్థితి నెలకొంది. పాత రోజుల్లో మ్యారేజ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్‌కు వెయ్యి రూపాయల లంచం తీసుకునేవారు. కానీ ఈయన మాత్రం పెళ్లిళ్లకు లక్షలు ఖర్చు పెడతారు, లక్షలు కట్నంగా ఇచ్చుకుంటారు, మాకు 5వేలు ఇవ్వరా అంటూ ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇదేమని ప్రశ్నిస్తే తల్లి, తండ్రి, అత్త, మామ, పూజారులు, సాక్షులు అందరిని తీసుకురా అప్పుడు చూద్దామంటూ చెబుతుండడంతో చేసేది ఏమీ లేక అడిగినంత ఇస్తున్నట్లు తెలిసింది.

మంగళవారమే రెక్కీ

తల్లి ఆస్తిని తన పేరు మీద గిఫ్ట్‌డీడ్ చేసుకునేందుకు కార్పెంటర్‌గా పని చేస్తున్న ఖాదర్ బాషా సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించారు. రూ.50వేలు లంచం డిమాండ్ చేయగా రూ.35వేలకు బేరం కుదిరింది. తన ఆస్తిని తనకు రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇంత మొత్తం లంచం ఇవ్వడం ఇష్టంలేని ఖాదర్ బాషా ఏసీబీ అధికారులను సంప్రదించాడు. అన్ని ఆధారాలు సేకరించుకుని నిజమే అని నిర్ధారణ చేసుకున్న ఏసీబీ అధికారులు గత మంగళవారమే గిద్దలూరు చేరుకున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయం తెలిసి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ క్రిష్ణమోహన్‌రావు మంగళవారం ఆఫీసుకు కూడా రాకుండా సెలవుపై వెళ్లిపోయారు. దాంతో చేసేదేమీ లేక ఏసీబీ అధికారులు వెళ్లిపోయినట్లు తెలిసింది. తిరిగి గురువారం డ్యూటీలో జాయిన్ కాగా హుటాహుటిన కర్నూలు, ఒంగోలు నుంచి ఏసీబీ అధికారులు గిద్దలూరు చేరుకుని వల పన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం గమనార్హం.

ఇంత దారుణమా?

(5వపేజీ తరువాయి)

చెప్పులు దొరకడంతో ఎవరో కిడ్నాప్ చేశారని నిర్ధారణకు వచ్చారు. డీఎస్పీ నాగరాజు 10 పోలీసు బృందాలను జిల్లా నలుమూలలకు పంపారు. మరుసటి రోజు ఉదయం బుధవారం నుంచి గ్రామస్థులు, పోలీసులు చుట్టుపక్కల 5 కిలోమీటర్ల మేర గాలించినా బాలుడి ఆచూకీ కానరాలేదు. గురువారం ఉదయం గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో సూరేపల్లి గ్రామ వ్యవసాయ పొలాల్లో పుల్లలు ఏరుకునేందుకు వచ్చిన మహిళకు బాలుడు బోర్లాపడి ఉండడాన్ని గమనించి పోలీసులకు తెలియచేశారు. ఈనేపథ్యంలో బాలుడు ఎలా మరణించాడనే నిర్ధారణ కోసం ఒంగోలు నుంచి వచ్చిన వైద్య బృందం పోస్టుమార్టం నిర్వహించింది. సీఐ మల్లికార్జున బాలుడు ఎలా మరణించాడు? ఎవరైనా చంపి పడవేసి వెళ్ళారా? మరే కారణంతో మృతి చెందాడో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. అయితే శుక్రవారం ఓ దినపత్రిక (ఆంధ్రజ్యోతి కాదు)లో అమరావతి నుంచి వచ్చిన వార్తలో లక్షిత్ మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచారణ వ్యక్తం చేయడం, జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడినపుడు బాలుడు గ్రామసమీపంలో అడవిలో తప్పిపోయి రెండు రోజులు ఆహారం లేక మరణించాడని చెప్పడంతో లక్షిత్ కుటుంబసభ్యులు, గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులు బాలుడు కోసం గ్రామం చుట్టుపక్కల గాలించినా దొరకని బాలుడు ఏ అడవిలో దారి తప్పి రెండు రోజులుగా ఆహారం, నీరు లేక మరణించాడని జిల్లా అధికారులు ఎలా పేపర్ ప్రకటన ఇస్తారని, పైగా సీఎం చంద్రబాబును కూడా తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులను, ముఖ్యమంత్రిని తప్పుదోవ పట్టించిన వారు ఎవరో తమకు తెలపాలని పట్టుబట్టారు. జిల్లా అధికారులు వచ్చి మా గ్రామంలో అడవి ఎక్కడ ఉందో చూపించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు ఇక్కడే బైటాయిస్తామన్నారు. పోస్టుమార్టం రిపోర్టు రాకమునుపే ఆహారం లేక మృతిచెంది ఉంటాడని ఎలా నిర్ధారిస్తారని పోలీసులను నిలదీశారు. దీనిపై స్పందించిన కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావులు మాట్లాడుతూ జిల్లా అధికారుల మాటలు ఫైనల్ కాదని, మేము కూడా 3 రోజుల నుంచి అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం రిపోర్టు 10 రోజుల్లో వస్తుందని, అప్పుడు ఈ కేసు చిక్కుముడి వీడుతుందని చెప్పడంతో గ్రామస్థులు శాంతించి వెనుతిరిగి పోయారు.

జీతాల బిల్లుల్లో జాప్యం

(5వపేజీ తరువాయి)

జీతాల కోసం బిల్లులు పెట్టుకోవాల్సిన ఉంటుంది. ఉద్యోగ, ఉపాధ్యాయుల బదిలీలు జరిగాక ఉత్తర్వులు తీసుకున్న తర్వాత కొంత సమయం తీసుకొని బదిలీ అయిన స్థానంలో చేరుతారు. కొత్తగా చేరిన స్థానాల్లో డ్రాయింగ్ ఆఫీసర్ బదిలీ జరిగి ఉంటే కొత్తవారు వచ్చి చేరేసరికి కొన్నిచోట్ల కొంత జాప్యమైంది. ఇలా అనేక కారణాల వల్ల ట్రెజరీలకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు పదివేల మంది వరకు జీతాలు పడలేదు. జీతాల బిల్లుల కోసం ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు పెట్టుకునేందుకు అవకాశం ఉండటంతో ట్రెజరీ కార్యాలయాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులతో నిండిపోతున్నాయి. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో డ్రాయింగ్ ఆఫీసర్లు విధుల్లో చేరకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతినెలా 1వ తేదీ నుంచి 5వ తేదీలోపు ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలను వారి ఖాతాల్లో జమ చేస్తుంది. ఎక్కువమంది ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు పడుతుండగా మిగిలిన వారికి రెండు, మూడు రోజుల్లో పడేవి. అయితే ప్రస్తుతం ఉద్యోగ, ఉపాధ్యాయ బదిలీల్లో జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున మార్పులు జరగడంతో సకాలంలో ట్రెజరీ కార్యాలయాలకు బిల్లులు పెట్టకపోవడం వల్ల ఈనెలలో ఇంకా జీతాలు పడని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు జీతాల బిల్లులు పెట్టిన ఉద్యోగులకు 15 తర్వాత జీతాలు పడే అవకాశం ఉంటుందని ట్రెజరీ అధికారులు చెప్తున్నారు.

ఓటర్ల జాబితా నిర్వహణపై శిక్షణ

రాచర్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : శిక్షణ ద్వారా బీఎల్‌వోలు ఎలా విధులు నిర్వహించాలో తెలుసుకోవాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం. వెంకటశివరామిరెడ్డి అన్నారు. రాచర్లలో బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఓటర్ల జాబితా నిర్వహణ (ఎలక్ట్రోరల్ మేనేజ్‌మెంట్)పై శుక్రవారం శిక్షణ జరిగింది. ముఖ్యంగా బీఎల్‌వోలు విధులు ఎలా నిర్వర్తించాలి ఫామ్ ఎలా ఫిల్ చేయాలి, హౌస్ టు హౌస్ వెరిఫికేషన్ చేసి చనిపోయిన వారి ఓట్లు డబుల్ ఎంట్రీ పర్మినెంట్ షిఫ్ట్ ఓటర్లు ఒక ఫ్యామిలీకి సంబంధించిన ఓట్లు ఒకే బూత్‌లో వచ్చేలా చూడడంవంటి కార్యక్రమాలు నిర్వహించాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారి ఎల్.వెంకటేశ్వర్లు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ షేక్ ఇబ్రహీం ఖలీల్ పాల్గొన్నారు.

మద్దిపాడు ఏఎంసీ చైర్మన్‌గా రాజేశ్వరి

అవీఇవీ

- 20మంది కమిటీతో ప్రభుత్వం ఉత్తర్వులు



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రసాద్, రాజేశ్వరి

చీమకుర్తి, జూలై11(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు వ్యవసాయ కమిటీ చైర్మన్‌గా చీమకుర్తికి చెందిన ప్రముఖ టీడీపీ నాయకుడు సతీమణి మన్నం రాజేశ్వరిని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వరి, ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్‌కి ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా 20మంది సభ్యులతో కూడిన ఎంపిక జాబితాను ఉన్నతాధికారుల విడుదల చేశారు. వీరందరూ త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా రాజేశ్వరి ఎంపిక పట్ల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

మెప్మాలో మళ్లీ 'బోగస్' రచ్చ

(5వపేజీ తరువాయి)

ఒంగోలు కార్పొరేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పేర్నమిట్ట (దామచర్ల జనార్దన్ కాలనీ)కి చెందిన పలు పొదుపు సంఘాల సభ్యులు శుక్రవారం మెప్మా కార్యాలయానికి చేరుకున్నారు. తమ గ్రూపుల బాధ్యతలు నిర్వర్తించే పార్వతి అనే ఆర్పీ తమను ఘోరంగా మోసం చేసిందని వాపోయారు. తమ ఆధార్ కార్డులు తీసుకుని బోగస్ గ్రూపులు తయారు చేసి, ఒక్కో గ్రూపు నుంచి రూ.20లక్షల చొప్పున సుమారు ఏడు గ్రూపులు నకిలీవి తయారుచేసినట్లు వారు వెల్లడిస్తున్నారు. ఒక్కో సభ్యురాలి పేరుతో రూ.2లక్షలు, మొత్తం పది మంది సభ్యులకు రూ.20లక్షలు రుణం తీసుకుని తమకు రూ.20వేలు రుణం ఇచ్చారంటూ ఆర్పీ పార్వతి తమ చేతికి ఇచ్చిందని తెలిపారు. అందుకు తాము తీసుకున్న రూ.20వేలకు ప్రతినెలా రూ.1000 చెల్లిస్తున్నామని, అయితే వాటిని కూడా బ్యాంకులకు చెల్లించకపోవడం దారుణమన్నారు. వారంరోజుల నుంచి ఒంగోలు కర్నూలు రోడ్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు రుణం తాలూకా డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, తాము అంత పెద్ద మొత్తంలో తీసుకోలేదని చెప్పినా వినలేదన్నారు. అయితే బ్యాంకర్లు తమ ఆధార్ కార్డులు, గ్రూపుల పేర్లు చూపించడంతో ఆర్పీ చేతిలో మోసపోయామని తెలిపారు. దీంతో పీడీ శ్రీహరికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన బాధిత సంఘాలు తమకు న్యాయం చేయాలని కోరారు. గతంలో బోగస్ గ్రూపులు తయారు చేసి రూ.కోట్లు దోచుకున్నవారు సైతం నేటికీ అదే పంథా కొనసాగిస్తుండగా, అదే బాటలో మరికొందరు ఆర్పీలు పేద మహిళల పేరుతో భారీగా బొక్కేస్తున్నారు. అదేమని ప్రశ్నించిన వారిపై అవినీతిపరులు దౌర్జన్యానికి పాల్పడటంతో బిక్కమొహం వేస్తున్న బాధితులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

సంఘ సభ్యులపై ఆర్పీ తిట్ల పురాణం

ఆర్పీ పార్వతి చేతిలో మోసపోయామని గుర్తించిన పొదుపు సంఘాల సభ్యులు పీడీకి ఫిర్యాదు చేసేందుకు మెప్మా కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయానికి అక్కడే ఉన్న ఆర్పీని నిలదీశారు. దీంతో రెచ్చిపోయినా పార్వతి పొదుపు మహిళలపై కార్యాలయంలోనే కస్సెబ్రు చేసింది. తిట్ల పురాణం అందుకుని 'దిక్కున్నచోట చెప్పుకోండి. ఏం చేసుకుంటారో చేసుకోండి.. అసలు అడగడానికి మీరెవరు?' అని బెదిరింపులకు పాల్పడటంతో కార్యాలయ సిబ్బంది, పొదుపు మహిళలు సైతం అవాక్కయ్యారు. అనంతరం ఆర్పీ పార్వతి, పొదుపు సంఘాల మధ్య వాగ్వాదం, నిలదీతలు.. పెద్ద స్థాయిలోనే మాటల యుద్ధం జరగడంతో గందరగోళ పరిస్థితి ఎదురైంది. తమను మోసం చేసిన ఆర్పీని విధుల నుంచి తొలగించాలని, తమ పేరుతో తీసుకున్న రుణం బ్యాంకులకు ఆమె చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, బాధితులు కోరుతున్నారు. ఇదే విషయమై సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వారు వివరించారు.

అవాక్కయిన మెప్మా సిబ్బంది

తమ ఒరిజినల్ గ్రూపుల వివరాలు, తీర్మానం పుస్తకాలతోపాటు, తమ పేరుతో నకిలీ గ్రూపు తయారుచేసిన ఆధారాలను ఆయా సంఘాల మహిళలు మెప్మా అధికారులకు చూపించారు. దీంతో బ్యాంకు పాస్ పుస్తకాలు, గ్రూపు తయారు అన్నీ బోగస్ అని అక్కడే గుర్తించిన సిబ్బంది ఆర్పీ చేతివాటంపై అవాక్కయ్యారు. దీంతో బోగస్ గ్రూపుల బాగోతం తేల్చేందుకు సమగ్ర విచారణకు అధికారులు సిద్ధమయ్యారు.

సభ్యుల ఫిర్యాదుపై విచారణ చేస్తాం

దామచర్ల జనార్దన్ కాలనీకి చెందిన పలు పొదుపు సంఘాల సభ్యులు ఆర్పీ పార్వతిపై ఫిర్యాదును పరిశీలిస్తున్నాం. వారు అందించిన వివరాల మేరకు ఎన్ని బోగస్ గ్రూపులు ఉన్నాయి? ఆ ఆర్పీ ఎన్ని బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు? అనే అంశాలపై సమగ్ర విచారణ చేపడతాం. ఇప్పటికే పొదుపు సభ్యులను మోసం చేసి, డబ్బులు కాజేసిన వారిని విధుల నుంచి తొలగించాం. విచారణలో వాస్తవాలు వెల్లడి అయితే శాఖపరంగా చర్యలు తీసుకుంటాం.

\- పి.శ్రీహరి, మెప్మా పీడీ

ఏ ఎన్నికల్లోనైనా వైసీపీ భయపడేలా తీర్పుండాలి

(5వపేజీ తరువాయి)

సృష్టించిన అల్లర్లను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రజలకు వివరించి కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని గుర్తించాలన్నారు. దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ మహిళలను గౌరవించే పార్టీ టీడీపీ అని, ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకాన్ని కూడా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు ఉగ్ర, ముత్తుముల కలిసి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు ఈ ప్రభుత్వంలో జరిగిన లబ్ధిని వారి ద్వారా అడిగి తెలుసుకున్నారు. సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మండలంలోని పలుచోట్ల చేపట్టబోయే పనులకు ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి శంకుస్థాపన చేశారు. వేదికపై ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఎర్రగొండపాలెం-పుల్లలచెరువు తారురోడ్డుకు రూ.2 కోట్ల 85 లక్షలు, ఎర్రగొండపాలెం- గంజివారిపల్లి రోడ్డుకు రూ.2 కోట్ల 5 లక్షలు, ఎర్రగొండపాలెం- త్రిపురాంతకం రోడ్డుకు రూ.2కోట్లు, చాపలమడుగు-దొనకొండ రోడ్డుకు రూ.కోటీ 20లక్షలు నాబార్డ్ ఆర్ఐడీఎఫ్ నిధులు మంజూరు కాగా ఈ పనులకు శంకుస్థాపన చేశారు. పుల్లలచెరువు మండలం కవలకుంట్ల గ్రామంలో రూ.80 లక్షలతో నిర్మించే సిమెంట్ కాంక్రీట్ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఐటీవరం గ్రామంలో నిర్మించే 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఐదు నెలల్లోనే పూర్తి చేస్తామని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు. సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్, వైపాలెం నియోజకవర్గ పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మం చౌదరి, ఎంపీపీ కందుల వెంకటయ్య, ఎంపీటీసీ పోట్ల పద్మావతి, కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, పార్టీ నాయకులు బివి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఖచ్చితమైన ఈ క్రాప్ నమోదు చేయాలి

మార్కాపురం రూరల్, జూలై11 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలకు ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని తహసీల్దార్ చిరంజీవి కోరారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయ సమీపంలోని విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో శుక్రవారం వీఆర్వోలు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో ఈ క్రాప్ నమోదు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో బుజ్జిబాయి, ఉద్యాన శాఖ అధికారి రమేష్, డీటీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేయాలి

పెద్ద దోర్నాల రైతులు సాగు చేసిన ప్రతి భూమిని ఈ పంటలో నమోదు చేయాలని తహసీల్దారు అశోక్ కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఖరీఫ్ - 2025 ఈ పంట డిజిటల్ క్రాప్ సర్వేపై శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు.సెప్టెంబరు నెల 15వ తేదీకి ఈ పంట నమోదు పూర్తి చేయాలని వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ అన్నారు. డిప్యూటీ తహసీల్దారు సాలమ్మ పాల్గొన్నారు.




రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు

మాదక ద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు: ఎస్పీ

ఒంగోలులో మాదక ద్రవ్యాలు రవాణా, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇటీవల కాలంలో అనుమానిత ప్రాంతాల్లో తరచూ తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం కూడా పోలీసులు, ఈగల్ టీమ్, ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులతో కలిసి ఒంగోలు రైల్వేస్టేషన్ పరిసరాలతో పాటు పలు రైళ్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ ఈ తనిఖీలలో పాల్గొన్నాయి. ఆ మేరకు గంజాయి తదితర మాదక ద్రవ్యాలు తెచ్చినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు మత్తు పదార్థాల రవాణా, విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. అదేవిధంగా కళాశాలలో యువతకు అవగాహన కలిగించేందుకు కార్యక్రమాలను రూపొందించినట్లు చెప్పారు. గంజాయి, మాదక ద్రవ్యాల సమాచారం తెలిస్తే 1972,112,9121102266 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీలలో సీఐలు సుధాకర్, మేడా శ్రీనివాసరావు, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ మౌలా షరీఫ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కొండయ్య పాల్గొన్నారు.

-ఒంగోలు క్రైం, ఆంధ్రజ్యోతి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రోజా, బూచేపల్లి, ఆదిమూలపు, బైరెడ్డి

రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం లేదు

అధికారంలోకి జగనన్న వస్తే రప్పారప్పా..

కొండపి నియోజకవర్గ వైసీపీ సమావేశంలో నేతల హెచ్చరికలు

కొండపి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని వైసీపీ నాయకులు చెప్పుకొచ్చారు. కొండపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో శుక్రవారం కొండపిలోని కామేపల్లి రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన వైసీపీ రాష్ట్ర నాయకురాలు రోజా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం దుర్మార్గపు పాలన నడుస్తోందన్నారు. మద్యం ఏరులై పారుతోందని, ఈవీఎంలలో తప్పుడు టెక్నాలజీ వాడి అధికారంలోకి వచ్చారని, ఇకపై కార్యకర్తలు అలా జరగకుండా చూసుకోవాలని చెప్పారు. వైసీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ ఈసారి జగన్ అధికారంలోకి వస్తే రప్పా..రప్పా ఆడిస్తామని, పోలీసులు తమ కార్యకర్తల జోలికి వస్తే సహించేదిలేదని హెచ్చరించారు. వైసీపీ మరో నాయకుడు కారుమూరి నాగేశ్వరరావు, సతీష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలను మోసం చేసి గెలిచారన్నారు. మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ వైసీపీలో అధికారాన్ని అన్నివిధాలా అనుభవించి పార్టీ మారిన నాయకుడొకరు జిల్లా పరిషత్ పీఠాన్ని కదిలిస్తాడంటా.. టచ్‌చేస్తే తెలుస్తుంది.. ఏమిజరుగుతుందోనని బాలినేని శ్రీనివాసరెడ్డిని ఉద్దేశించి విమర్శలు చేశారు. సమావేశంలో బాబు ష్యూరిటీ, లేదు గ్యారెంటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, తూమాటి మాధవరావు, మాదాశి వెంకయ్య పాల్గొన్నారు. ఈ సమావేశానికి రోజా వస్తున్నట్లు ప్రచారం చేయడంతో యువకులు పోటెత్తారు. రోజా వేదిక వద్దకు వచ్చింది మొదలు మాట్లాడాలని పదేపదే గోలగోల చేశారు. ఎవరు మాట్లాడబోయినా అడ్డుతగిలారు. చివరకు ఆ గోల భరించలేక రోజా డ్రస్సింగ్ రూమ్‌లోకి వెళ్లారు. ఆమె చివరలో బయటకు వచ్చి ప్రసంగించారు. కల్యాణ మండపం సామర్థ్యం మించి జనం రావడంతో గాలి ఆడక, ఊపిరి అందక అల్లాడిపోయారు.

ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం



రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్‌లు

వేటపాలెం/చీరాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలో అక్రమ ఇసుక రవాణా ఆగడం లేదు. అక్రమార్కులు ఏదో సమయంలో మాటు వేసి మరీ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇటీవల మండల పరిధిలో వాన్‌పిక్ భూముల్లో ఇష్టారీతిగా ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పెద్ద ఎత్తునే తవ్వకాలు జరిగినట్లు గుర్తించారు. ఈక్రమంలోనే కొన్నిరోజులు రవాణాకు అడ్డుకట్ట వేశారు. అదును చూసి అక్రమార్కులు రవాణా సాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం పందిళ్లపల్లి నుంచి చీరాల వైపు వెళుతున్న మూడు ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ గోపీకృష్ణ ఆదేశాల మేరకు వీఆర్వో పురుషోత్తం అడ్డుకున్నారు. మూడు ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

ఏడాదిలో ప్రతి ఇంటికీ సంక్షేమం

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి



పథకాలపై ప్రజలకు వివరిస్తున్న మంత్రి గొట్టిపాటి, పక్కన ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వ పాలనలో పలు పథకాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందిస్తున్నామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. మున్సిపాల్టీ పరిధిలోని 7వ వార్డు కొత్తూరులో ఏడాది సుపరిపాలన కార్యక్రమం ప్రచారంలో భాగంగా శుక్రవారం మంత్రి ఇంటింటినీ సందర్శించారు. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలో అందిన సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ పేద కుటుంబాలు తమ పిల్లలందరికీ ఉన్నత చదువులు చదివించుకోవాలనే ఆశను సీఎం చంద్రబాబు నెరవేర్చారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌రెడ్డి వైఖరితో రాష్ట్రం దివాళా దిశగా చేరుకుందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి రాష్ట్ర ఖజానాను తన సొంత జేబులోకి వేసుకుని పబ్బం గడుపుకున్నారని ధ్వజమెత్తారు. అయినప్పటికీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేదిశగా సీఎం చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సొమ్మును పెంచి అందజేస్తున్నామని చెప్పారు. ప్రతి కుటుంబానికి మూడు సిలిండర్లను అందజేస్తున్నట్లు తెలిపారు. కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చొరవతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, డీఈ ఉమాకాంత్ పాల్గొన్నారు.

● నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. శుక్రవారం కనిగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏటా విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతున్నప్పటికీ తదనుగుణంగా చర్యలు చేపడుతున్నామన్నారు. హామీమేరకు సీఎం చంద్రబాబు ఇప్పటికే పవర్‌లూమ్స్, చేనేత రంగాల అభివృద్ధికి ఉచిత విద్యుత్‌ను అంజేస్తున్నట్లు చెప్పారు. సెలూన్ షాపులకు కూడా 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామన్నారు. సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ ఉమాకాంత్, ఏఈ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

● రైతులకు డ్రోన్‌లు పంపిణీ చేసిన మంత్రి, ఎమ్మెల్యే

కనిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రైతులు సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. శుక్రవారం కొత్తూరు గ్రామంలో కనిగిరి, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాలకు చెందిన రైతులకు రూ.30 లక్షలు విలువ చేసే మూడు డ్రోన్‌లను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు విడతల వారీగా వ్యవసాయరంగంలో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన వివిధ రకాల పనిముట్లను సబ్సిడీపై అందజేస్తోందన్నారు. ఇప్పటికే ట్రాక్టర్‌లు, స్ప్రేయర్‌లు, వివిధరకాల వ్యవసాయ పనిముట్లు అందించినట్లు చెప్పారు. డ్రోన్ సాయంతో తుంపర సేద్యం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రైతులు డ్రోన్ పరిమాణాన్ని బట్టి సాగులోని పంటకు ఎలాంటి మందు అవసరమో తగిన మోతాదులో నింపుకుని డ్రోన్‌ను వినియోగించాలని చెప్పారు. వ్యవసాయ అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లలేకుండా డ్రోన్ వ్యవసాయం, వాటివల్ల చేకూరే లాభాలను ఎప్పటికప్పుడు సమీక్షించి పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఏ జైనులాబ్దిన్ పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

అమ్మనబ్రోలు గురుకుల పాఠశాల, ఎస్సీ వసతి గృహం తనిఖీ చేసిన ఇన్‌చార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణ



వంటగదిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణ

నాగులుప్పలపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాలలోని సిబ్బంది విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ హెచ్చరించారు. అమ్మనబ్రోలు గ్రామంలోని గురుకుల పాఠశాల, ఎస్సీ వసతి గృహాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఎస్సీ బాలుర వసతి గృహంలో వసతులను పరిశీలించారు. హాజరు, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో రిజిస్టర్ ప్రకారం సరుకులు లేకపోవడం, నిల్వలలో తేడా ఉండటం గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని వార్డెన్‌ను ఆదేశించారు. వసతిగృహంలోని కిటికీలకు దోమతెర మెష్‌లను ఏర్పాటు, మరుగుదొడ్ల మరమ్మతులు చేయించాలని, ఫిర్యాదుల పెట్టె, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించారు. పాఠ్యాంశాల సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. కొన్ని విషయాలను ప్రిన్సిపాల్ మాధవిని అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలను చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతులను కల్పనకు నిధులు అందిస్తున్నట్లు చెప్పారు. అదే స్ఫూర్తితో ఉపాధ్యాయులు పనిచేయాలని చెప్పారు. విద్యార్థినులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ స్వయంగా భోజనం వడ్డించి రుచి చూశారు. సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిణి నిర్మలాజ్యోతి, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

● అధైర్యపడొద్దు.. అండగా ఉంటా...

మద్దిపాడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): పేదరికంలో ఉన్న కుటుంబానికి అండగా ఉంటానని ముందుకు వచ్చారు జేసీ గోపాలకృష్ణ భరోసా ఇచ్చారు. సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం పేదలకు, పైస్థాయిలో సంపన్నులుగా ఉన్న 10 శాతం ప్రజలు అండగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పీ4 పథకం, ముఖ్యమంత్రి ఆశయ సాధనలో భాగంగా వ్యక్తిగతంగా తాను కూడా పేదలకు అండగా నిలుస్తానంటూ జేసీ ముందుకు వచ్చారు. శుక్రవారం మద్దిపాడు మండలం మల్లవరం గ్రామంలో దళితురాలైన గొల్లపాటి మరియమ్మ కుటుంబాన్ని జేసీ సందర్శించారు. తన భర్త చనిపోయారని, కుమార్తె, కుమారుడు ఉన్నారని, కూలి పనులు చేసుకునే తమకు సొంతిల్లు కూడా లేకపోవడంతో తల్లిదండ్రుల వద్ద ఉంటున్నట్లు మరియమ్మ జేసీకి వివరించారు. వారసత్వంగా వచ్చిన స్థలంలో కట్టుకోవడానికి తక్షణమే ఇల్లు మంజూరు చేస్తున్నట్లు జేసీ ప్రకటించారు. ఇంటి నిర్మాణానికి అదనపు సహాయం కూడా చేస్తానని చెప్పారు. ఆసక్తి ఉంటే ఏదైనా షాపు ఏర్పాటు చేసుకునేందుకు సహాయం చేస్తానని జేసీ హామీ ఇచ్చారు. పదో తరగతి చదువుతున్న ఆమె కుమారుడికి అండగా ఉంటానన్నారు. అనంతరం నెలరోజులకు సరిపోయేలా కిరాణా సరుకులు, బియ్యం, కూరగాయలను జేసీ అందించారు. గ్రామంలో శ్మశాన వాటిక సమస్య ఉన్నదని, మురుగు కాలువ లేవని స్థానికులు ఈ సందర్భంగా జేసీ దృష్టికి తీసుకువచ్చారు. శ్మశాన వాటిక సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ ఆదిలక్ష్మిని ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, గ్రామ సర్పంచి సుబ్బారెడ్డి ఉన్నారు.

శ్రీశైలంలో మంత్రి గొట్టిపాటి ప్రత్యేక పూజలు

అద్దంకి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం మల్లికార్జునస్వామిని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు గురువారం రాత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజారులు మంత్రి రవికుమార్, ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డిలను సత్కరించి ఆశీర్వదించారు. అద్దంకి మున్సిపల్ కౌన్సిలర్ రంగిశెట్టి సుభాషిణి లహరి దంపతులు తదితరులు ఉన్నారు.

15న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఉపాధి కార్యాలయంలో ఈనెల 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కార్యాలయ అధికారి కే రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో పలు కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. పది, ఐటీఐ, ఇంటర్మీడియెట్, డిప్లొమా, ఏదైనా డిగ్రీ చదువులు పూర్తి చేసుకొని 18నుంచి 30 ఏళ్లలోపు మధ్య గల నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యోగాల్లో ఎంపికైన అభ్యర్థులకు జీతం నెలకు రూ.12వేల నుంచి రూ.28వేల వరకు ఉండటంతో పాటు పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 08592-281776 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మధ్యవర్తిత్వం ద్వారా సమస్యల పరిష్కారం



అవగాహన స్టాల్‌ను ప్రారంభిస్తున్న న్యాయాధికారి భారతి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని న్యాయస్థానాల్లో నిర్వహిస్తున్న మధ్యవర్తిత్వం ద్వారా సమస్యల పరిష్కారంపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఏ భారతి చెప్పారు. స్థానిక జిల్లా న్యాయస్థానంలో ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయాధికారి భారతి మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు తమ వ్యాజ్యాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. జిల్లాలో జరుగుతున్న ఈకార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారుల సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు, సీనియర్ న్యాయవాదులు పైనీడి సుబ్బారావు, నెల్లూరు సత్య శ్రీనివాసులు, సిరిగిరి సరళ, గ్రేస్‌కుమారి, న్యాయ సేవ సహాయకులు పి. సతీష్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న డీఎస్పీ మొయిన్

వేటపాలెం/చీరాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రజల రక్షణ కోసం నిరంతరం పాటుపడే పోలీసులు అన్ని సమస్యలను సమపాళ్లలో బేరీజు చేసుకోవాలని డీఎస్పీ ఎండీ మొయిన్ చెప్పారు. ఇటీవల వేటపాలేనికి చెందిన బిల్లా రమేష్ ఉమ్మడి ప్రకాశం జిల్లా 2009 బ్యాచ్‌కు సంబంధించి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఈ క్రమంలోనే చీరాల, పర్చూరు ప్రాంతాల్లో పనిచేసి మంచిపేరు సంపాదించుకున్నాడు. అనుకోని రీతిలో కుటుంబ సమస్యల కారణంగా ఇటీవల బలవన్మరణం చెందాడు. ఈక్రమంలో అతని బ్యాచ్‌కు సంబంధించిన పోలీసులు రూ.1.58.500 ఆర్థిక సాయాన్ని డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. కుటుంబానికి మనోధైర్యాన్ని నింపారు.

గాంధీ పార్కు అభివృద్ధికి చర్యలు : కమిషనర్


వాకర్స్‌తో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీ పార్కు అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక గాంధీపార్కును పరిశీలించడంతోపాటు, వాకర్స్‌తో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాకర్స్ పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా వాకింగ్ ట్రాక్‌పై తాగునీరు, విశ్రాంతి కోసం సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయలని కోరగా, వాటిని వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. అలాగే పిల్లల పార్కు అభివృద్ధి, పార్కులో గ్రీనరీ తదితర అంశాలపై దృష్టి సారించినట్లు ఆయన చెప్పారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం


కృష్ణమూర్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎన్

నాగులుప్పలపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఈదుమూడిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమై కట్టు బట్టలతో మిగిలిన పూసపాటి కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. జరిగిన సంఘటనపై ఆయన విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.35వేల నగదును అందజేశారు. అనంతరం గుండెపోటుతో మృతి చెందిన గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ వైస్ ఎంపీపీ కొండ్రగుంట రంగరావు మృతదేహానికి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పార్టీ పట్ల నిబద్ధత కలిగిన మంచి నాయకుడిని కోల్పోయామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి గుమ్మడి సాయిబాబా, గ్రామ అధ్యక్షులు కుర్రా వీరాంజనేయులు, ఆళ్ల ప్రేమ్‌చంద్, లంబు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

హెపటైటీస్‌పై అవగాహన కలిగి ఉండాలి


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నాగులుప్పలపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హెపటైటీస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ.సాగర్ సూచించారు. శుక్రవారం బి.నిడమానూరు గ్రామంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో హైరిస్క్ వ్యక్తులను గుర్తించి వారికి హెపటైటీస్ బి, సి నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. వ్యాధిపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజరు కోటేశ్వరరావు, ఎన్ఎం రాధమ్మ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘడియపూడిలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'


కరపత్రాలను అందజేస్తున్న సుబ్బారావు

మద్దిపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లిలోని ఘడియపూడి కాలనీలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అన్నమనేని సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కరిచేటి రమేష్‌బాబు, చలపతి, విజయరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టుకు గాయాలైన ఘటన గ్రోత్ సెంటర్ సమీపంలో శుక్రవారం జరిగింది. ఒంగోలు వైపు నుంచి మార్టూరుకు చెందిన పి.దేవదానం మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా కారు అదుపుతప్పి వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పి.దేవదానికి గాయాలయ్యాయి. అదేకారులో గుంటూరు వైద్యశాలకు తరలించారు.

ఘనంగా 'బొమ్మినేని' జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న రామాంజనేయులు

సంతనూతలపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత బొమ్మినేని రామాంజనేయులు జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి ఒంగోలులో ఓ ఫంక్షన్‌హాల్‌లో నాయకులు, కార్యకర్తల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రామాంజనేయులు కేక్ కట్ చేశారు. పలువురు నాయకులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, ప్రధానకార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, ఈదర విష్ణువర్ధన్, ముప్పరాజు శ్రీను, ఆళ్ల అవినాష్, బి.శంకర్, సీహెచ్.శ్రీను, ఎం.రామారావు, అనిల్ పాల్గొన్నారు.

హరిహరక్షేత్రంలో ఆషాడమాస వేడుకలు


పూజలో పాల్గొన్న శిద్దా కుటుంబసభ్యులు

చీమకుర్తి, జూలై11 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని హరిహర క్షేత్రంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి శుక్రవారం ఆషాడం శారీ వేడుకలను ఘనంగా జరిపారు. గోరింటాకు పండగను నిర్వహించారు. అమ్మవారిని శాకంబరి అలంకారంలో అలంకరించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, సతీమణి లక్ష్మీపద్మావతి కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలో విశేషపూజలు జరిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బాధ్యతలు నిర్వర్తించాలి

మద్దిపాడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోలు ప్రజలతో బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించాలని డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో 47మంది బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరకుమార్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ఎన్నికల జాబితా నిర్వహణ బాధ్యతలను జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎన్నికల డీటీ పి.అరుణ, నాగచంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగును ఈ-పంటలో నమోదు చేయాలి

కొత్తపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలో పంటలు సాగు చేసిన రైతులు ఈ-పంటలో నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కె.శాంతి కోరారు. శుక్రవారం కొత్తపట్నంలో గ్రామ రెవెన్యూ అధికారులకు, వ్యవసాయ సహాయకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేస్తేనే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పొందేందుకు అర్హత కలిగి ఉంటారన్నారు. లేకుంటే పంట నష్టపరిహారం, పీఎం కిసాన్ వంటి ఇతర పథకాలు కూడా దూరం అవుతాయని చెప్పారు. ఈ-పంట డిజిటల్ సర్వేలో వీఆర్వోలు వ్యవసాయ గ్రామ సహాయకులకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమ సారథి చంద్రబాబు

మారిటైం బోర్డు చైర్మన్ సత్య ● పి-4తో పేదరికం నిర్మూలనకు ప్రణాళికలు ● నిప్పట్లపాడులో ఎమ్మెల్యే బీఎన్ పర్యటన


దావగూడూరులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న సత్య


నిప్పట్లపాడులో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

జరుగుమల్లి/కొండపి, జూలై11 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం వినూత్న పథకాలతో చంద్రబాబు ముందుకు వెళ్తున్నారని ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని దావగూడూరు గ్రామంలో ఆయన సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటి ప్రచారాన్ని ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. పింఛన్ డబ్బుల పెంపు, ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం, తల్లికి వందనం డబ్బులు చదువుకునే ప్రతి ఒక్కరికి పడ్డాయా? అని ఆరాతీశారు. చంద్రబాబు స్వర్ణాంధ్ర -2047, పి-4 పథకాల కార్యాచరణపై ప్రజలకు అవగాహన కలిగించారు. పి-4 పథకంలో పేదరికంలో ఉన్న కుటుంబాలను ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకురావడంతోపాటు, ఆయా కుటుంబాల్లోని వ్యక్తుల నైపుణ్యాల ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. గ్రామంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారికి కూడా లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సత్య హామీనిచ్చారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, పార్టీ నాయకులు పోటు శ్రీనివాసమురళి, ఏలూరి రాంబాబు, నరాల సోమయ్య, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, నలమోతు వెంకటేశ్వర్లు, దావగూడూరు గ్రామ మాజీ సర్పంచ్ చదలవాడ బ్రహ్మేంద్రం, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు బాసటగా ప్రభుత్వం - ఎమ్మెల్యే బీఎన్

చీమకుర్తి: పేద ప్రజల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిప్పట్లపాడు గ్రామంలోని క్రిస్టియన్‌పాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఇంటింటికి తిరుగుతూ ఏడాది పాలనలో చేపట్టిన కార్యక్రమాలను తెలిపే కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ షాపుల నిర్వహణలో నిబంధనలు పాటించాలి

● ఆర్ఎం సత్యనారాయణ


వ్యాపారులతో మాట్లాడుతున్న ఆర్ఎం సత్యనారాయణ

ఒంగోలు కార్పొరేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆర్టీసి డిపోల ప్రాంగణములలో నిర్వహించే దుకాణాల్లో నిబంధనల ప్రకారం, వ్యాపారాలు సక్రమంగా నిర్వహించాలని రీజియన్ మేనేజర్ జి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని ఆర్ఎం చాంబర్‌లో షాపుల లీజుదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుకాణాల లైసెన్సులు సకాలంలో రెన్యువల్ చేయించుకోవాలని చెప్పారు. అలాగే నెలవారీ అద్దెలు చెల్లింపులు బకాయిలు లేకుండా క్రమంగా చెల్లించాలన్నారు. ఆర్టీసీ కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేయాలని, ఎలాంటి ఆక్రమణలు చేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్టీసీ ఆవరణంలోని షాపుల్లో అధిక ధరలకు విక్రయాలు చేయకూడదని, ప్రయాణికులకు తెలిసేలా ఎమ్మార్పీ రేట్లను అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే లైసెన్సు రద్దు చేస్తామని చెప్పారు. త్వరలోనే పామూరు, గిద్దలూరు, టంగుటూరు, పొదిలి డిపోల పరిధిలో గుర్తించిన ఖాళీ స్థలాలను లీజుకు ఇవ్వడానికి టెండర్లు ఆహ్వానించినట్లు తెలిపారు. ముఖ్యంగా స్టాల్స్‌లో ప్లాస్టిక్ క్రయ, విక్రయాలు నిరోధించాలన్నారు. బస్టాండ్ ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆర్ఎం ఆదేశించారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటియూసి) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్మికులు పనిచేస్తూ చనిపోయినా, రిటైర్డ్‌మెంట్ అయిన కార్మికులు బదులు వేరేవారిని తీసుకుంటున్నారన్నారు. ఈ నియామకాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ నాయకులకు అనుకూలంగా ఉంటూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులపై రాజకీయ వత్తిళ్ళు నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని కోరారు. నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ కార్మికులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సిబ్బందికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు గత సమ్మెలో ప్రభుత్వం అంగీకరించిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తోందని హెచ్చరించారు. అనంతరం డీఆర్వో చిన ఓబులేషును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాసర్, కిరణ్, కోటయ్య, ఖాసీంవలి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఎఫ్‌పీవోలు పని చేయాలి

● డీఆర్‌డీఏ పీడీ నారాయణ



మాట్లాడుతున్న పీడీ నారాయణ

ఒంగోలు నగరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు ఉత్పత్తి కేంద్రాలు రైతులకు వెన్నుదన్నుగా పని చేయాలని డీఆర్‌డీఏ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని వెలుగు టీటీడీసీ భవనంలో 12 మండలాలకు చెందిన ఎఫ్‌పీఏ కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, రైతుమిత్రలు, ఎఫ్‌పీవో అకౌంటెంట్లు, బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం అనుబంధరంగాల జీవనోపాధులను పెంపొందించటంలో ఎఫ్‌పీవోలు రైతులకు తగిన సహకారం అందించాలని కోరారు. రైతులు పండించిన పంటల ప్రాసెసింగ్ యూనిట్లు, మునగసాగు, వెదురు సాగు, షేడ్ నెట్ వ్యవసాయం, తేనేటీగల పెంపకం, కొరమీను చేపల పెంపకం వంటి యూనిట్లను రైతులకు 50 శాతం సబ్సిడీతో అందజేయాలని కోరారు. ప్రభుత్వం అందించే ఈ యూనిట్లను సన్న, చిన్నకారు రైతులకు అందజేయాలని ఆయన కోరారు. సమావేశంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్‌కుమార్, ఉద్యానశాఖాధికారి డి.సంధ్యారాణి, ప్రకృతి వ్యవసాయం అధికారి ఝాన్సీరాణి, ఏపీడీ లక్ష్మిరెడ్డి, జీవనోపాధుల డీపీఎం దానం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

● విజేతలకు బహుమతుల ప్రదానం


విద్యార్థులకు బహుమతులను అందజేసిన ప్రిన్స్‌పాల్ సుబ్బారావు, అధ్యాపకులు

సంతనూతలపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మైనంపాడులోని జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు బి.తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు మాట్లాడుతూ 1987 జూలై 11న ప్రపంచ జనాభా 500 కోట్లు దాటిన రోజును ప్రపంచ జనాభా దినోత్సవంగా ప్రకటించారన్నారు. సుస్థిర అభివృద్ధికి, ప్రకృతి వనరులను ప్రపంచ మానవాళి పొదుపుగా ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం పలు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వ్యాసరచనలో సీహెచ్.లక్ష్మి(రావినూతల), సీహెచ్.పవన్, గోపీకృష్ణ(కొండమంజులూరు), సీహెచ్.మోక్షబాబు(కొండపి), పెయింటింగ్‌లో ఎం.వర్ష (రావినూతల), కె.లాస్య(బండ్లమూడి), స్నేహలతారెడ్డి(పిడికిటివారిపల్లి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రథమ బహుమతిగా రూ.1500, ద్వితీయ బహుమతిగా రూ.వెయ్యి, తృతీయ బహుమతిగా రూ.500 నగదును అందజేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: అంతర్జాతీయ జనాభా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మద్దిపాడు ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో డాక్టర్ ఆనందమోహన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక నటరాజ కళాకేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జనాభా పెరుగుదలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో కనపర్తి సుబ్బారావు, దేవరశెట్టి యలమంద, గంట కోటేశ్వరరావు, గంగిశెట్టి నరసింహారావు, నేలటూరి సత్యనారాయణ, కంటి వైద్యులు జయరావు, హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, లలితమ్మ, రజిత, చంద్రమౌళి, ఏఎన్ఎంలు బడితల వెంకటేశ్వర్లు, ఈమని సుబ్బారావు, కటకం వెంకటేశ్వర్లు, దిడ్డి రామారావు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం


సురేష్‌బాబును సత్కరిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

సంతనూతలపాడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఒంగోలు డివిజన్ డీఎల్‌డీవోగా అదనపు బాధ్యతలు స్వీకరించిన మండల ఎంపీడీవో సురేష్‌బాబును పలువురు అభినందించారు. శుక్రవారం సంతనూతలపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ డి.రమణమ్మలు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ షాపులపై అధికారుల దాడులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం, బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లోని పలు మెడికల్ షాపులపై శుక్రవారం ఔషధ నియంత్రణ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి నేతృత్వంలో తనిఖీలు చేయగా కొన్ని దుకాణాలలో ఫార్మాసిస్టులు లేకపోవడం, అమ్మకాలకు బిల్లులు ఇవ్వకపోవడం, అలాగే కొన్ని షాపుల్లో గడువు ముగిసిన మందులు అమ్మడాన్ని అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా ఏడీ జ్యోతి మాట్లాడుతూ ఒంగోలు, మార్కాపురం, బాపట్లలో ఏకకాలంలో తొమ్మిది దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జనరిక్, ఇతర ఫార్ములేషన్‌లతో కూడినవి గుర్తించి సేకరించి ప్రభుత్వ ఔషధ పరీక్ష ప్రయోగశాలకు పంపించినట్లు చెప్పారు. అనంతరం వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో భాగంగా నిబంధనలు పాటించని దుకాణాలకు నోటీసులు జారీ చేసినట్లు ఆమె చెప్పారు.

భూసేకరణ క్లయిమ్స్‌ను త్వరగా పరిష్కరించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు(రూరల్), జూలై11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాజెక్ట్‌లకు సంబంధించి భూసేకరణ క్లయిమ్స్‌ను త్వరితగతిన పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి పలు శాఖల అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారులు, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ తదితర ప్రాజెక్ట్‌లకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అవార్డులను పాస్ చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఇందుకోసం రెవెన్యూ, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ


పరిశీలిస్తున్న క్లూస్ టీం, ఎస్సై నాగమల్లేశ్వరరావు

టంగుటూరు (కొండపి), జూలై11 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో నాలుగు సవర్ల బంగారం చోరీ చేసిన ఘటన టంగుటూరులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. టంగుటూరులోని పురంసెంటర్‌లో నివాసం ఉండే బడుగు దీనదాసు తన కుమార్తె నిమ్మకూరు వద్ద స్కూల్‌లో చదువుకుంటుండగా, అక్కడికి తన భార్యతో కలిసి బుధవారం వెళ్లాడు. ఇంటికి తాళం వేసి వెళ్లడంతో గమనించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని నాలుగు సవర్ల బంగారాన్ని చోరీ చేశారు. దీనదాసు గురువారం రాత్రి ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు క్లూస్ టీం ఘటనా స్థలానికి వచ్చి ఆధారాలు సేకరించింది.

20న రాజ్యాంగంపై వక్తృత్వ పోటీలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రంగారావు, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు అన్నారు. స్థానిక ఎంసీఏభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు ఈనెల 20నుంచి 26వతేదీ వరకు ఒంగోలులోని ఎంసీఏ భవన్‌లో భారత రాజ్యాంగం కనీస అవగాహన అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువతకు వేర్వేరు విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. జూనియర్ విభాగంలో మొదటి బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతి రూ.4వేలు, యువత విభాగంలో ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.8వేలు, తృతీయ బహుమతి రూ.7వేలతో పాటు మరో పది మందికి కాన్సొలేషన్ బహుమతులు, సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. అనంతరం వారు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, రిటైర్డ్ హెచ్ఎం డి.వెంకటేశ్వర్లు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, గడ్డం మురహరిరావు, హరిప్రసాద్, లెక్చరర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఓటుహక్కు కల్పించాలి


శిక్షణ పొందిన బీఎల్‌వోలతో అధికారులు


ఒంగోలు(రూరల్), జూలై11(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు దాటిన యువతీ, యువకులకు ఓటు హక్కును కల్పించాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న కోరారు. ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో శుక్రవారం ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 4వబ్యాచ్‌కు చెందిన బీఎల్‌వోలకు ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇంజినీరింగ్ కళాశాలలో, డిగ్రీ కళాశాలలో 18 సంవత్సరాలు దాటిన విద్యార్థులు ఉంటారని, అందువల్ల వారికి ఓటుహక్కు కల్పించాలని చెప్పారు. వయస్సు నిర్ధారణ కోసం టెన్త్ క్లాస్ సర్టిఫికెట్, ఇతర ఆధారాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ మధుసూదనరావు, రూరల్ తహసీల్దార్ నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు

డ్రోన్ కెమెరాను అందజేసిన శ్రీప్రతిభ అధినేత

ఒంగోలు క్రైం, జూలై11(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధన, ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్‌శాఖకు ఉపయోగపడే డ్రోన్ కెమెరాను శ్రీప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు అందజేశారు. శుక్రవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో ఈ డ్రోన్ కెమెరాను అందజేసిన అనంతరం ఎస్పీ మాట్లాడుదూ శ్రీప్రతిభ సంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. ప్రజాసేవలో విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీప్రతిభ విద్యాసంస్థల వైస్‌చైర్మన్ నల్లూరి సీతారామంజనేయులు, సీఈవో జయప్రకాష్‌నారాయణ, తాలుకా సీఐ విజయకృష్ణ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి సారూ..!

● ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఆవేదన


కార్యాలయ ఆవరణలో పనుల్లో నిమగ్నమైన ఉద్యోగులు

ఒంగోలు(రూరల్), జూలై 11(ఆంధ్రజ్యోతి): ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో మౌలికవసతులు కల్పించాలని కార్యాలయ ఉద్యోగులు కోరుతున్నారు. గతంలో ఒంగోలు నగరం, ఒంగోలు మండలంలోని గ్రామాలకు ఒకే తహసీల్దార్ కార్యాలయం ఉండేది. అయితే గతప్రభుత్వ హయాంలో అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలుగా విడగొట్టారు. దీంతో ఇప్పుడు రెండు కార్యాలయాలు పనిచేస్తున్నాయి. అయితే కొత్తగా ఏర్పడిన రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి ప్రత్యేకమైన విద్యుత్ కనెక్షన్ లేదు. ప్రస్తుతం పాత తహసీల్దార్ కార్యాలయ విద్యుత్‌నే వాడుకుంటున్నారు. ఇంటర్నెట్ సేవలు కూడా అదే విధమైన పరిస్థితి. మరీ ముఖ్యంగా రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి నీటి వసతి, మరుగుదొడ్లు లేకపోవటంతో కార్యాలయ ఉద్యోగులు ఇబ్బందిపడిపోతున్నారు. కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. రీసర్వేకు సంబంధించిన పనులు చేసుకోవటానికి కూడా ప్రత్యేక గది లేకపోవడంతో కార్యాలయ వరండాలోనే విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో మౌలిక వసతులు కల్పించాలని సిబ్బంది కోరుతున్నారు.

అవీ..ఇవీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో లక్ష్మీనారాయణ

చట్టాన్ని అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు

పెద్దారవీడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): చట్టాన్ని అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఏవో లక్ష్మీ నారాయణ హెచ్చరించారు. మండలంలోని కుంటలో మూడు విత్తనాల దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయాలను నిబంధనలకు లోబడిచేయాలన్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని విత్తనాలను అధిక ధరలకు అమ్మరాదని, రైతులు కొనుగోలు చేసి విత్తనాలకు సంబంధించిన రసీదులను తప్పక ఇవ్వాలని అన్నారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు, కంపెనీ అనుమతి పత్రాలను పరిశీలించారు. గోడౌన్‌లో ఉన్న విత్తనాల ప్యాకెట్లను, స్టాక్ బుక్‌లో ఉన్న వివరాలను పరిశీలించారు. రైతులు తక్కువ ధరకు వస్తాయని రాత్రివేళల్లో జీపులలో అమ్మేవారి నుంచి విత్తనాలు కొనకూడదన్నారు. నాలుగు విత్తన నమూనాలను పరీక్షల నిమిత్తం తీసి పంపారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణాధికారి ఎం.సునీల్ నాయక్ ఉన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న మహిళలు

వైభవంగా సాయినాథునికి రథోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జై సాయినాథ.. జై జై సాయినాథ.. అంటూ సాయి నామస్మరణల మధ్య మార్కాపురంలో సాయినాథునికి శుక్రవారం వైభవంగా రథోత్సవం నిర్వహించారు. గురుపౌర్ణమి వేడుకలలో భాగంగా ఆఖరి రోజు నెహ్రూ బజార్‌లోని సాయిబాబా మందిరంలోని సాయినాథునికి రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సాయినాథుని చిత్రపటం ఉంచి పూజలు చేశారు. మేళతాళాలు, భక్తి గీతాలు, కోలాటాల విన్యాసాలతో పట్టణ వీధులలో సాయినాథుని రథోత్సవం సాగింది. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, కార్యదర్శి గోపాలుని హరిహరరావు, కోశాధికారి నాగరాజు, కమిటీ సభ్యులు, మహిళా సంఘం, యువజన సేవా సంఘం, సాయి భక్తులు పాల్గొన్నారు.



బాదినేనిపల్లిలో సందడి చేస్తున్న పీర్లు

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

కొమరోలు, జూలై11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాదినేనిపల్లి, నల్లగుంట్ల, యర్రపల్లి గ్రామాల్లోని ప్రజలు మొహర్రం వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బాదినేనిపల్లి గ్రామంలోని శ్రీ రెడఖాశింస్వామి పీర్ల మహోత్సవాలు గురువారం నుంచి ఆదివారం వరకు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడిలను అందంగా డిస్కోలైట్లతో అలంకరించారు. శుక్రవారం ఉదయం, సాయంత్రం పీర్లను ముందుగా గుండం చుట్టు సందడిచేశారు. ఈసందడిని తిలకించేందుకు మండలంలోని ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి భారీ బాణసంచా, పాటకచేరి కారుక్రమాలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని మనోజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు కామూరి రమణారెడ్డి ఏర్పాటుచేస్తున్నారు.



వార్డులో సమస్యల గురించి
ప్రజలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ రమణబాబు

వార్డులో కమిషనర్ పర్యటన

గిద్దలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మున్సిపాలిటీలోని 2వ వార్డులో గల పలు వీధుల్లో మున్సిపల్ కమిషనర్ రమణబాబు సిబ్బందితో కలిసి పర్యటించారు. ప్రజలను కలుసుకుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నరసింహస్వామి దేవాలయం వీధి, రాజానగర్, తదితర వీధుల్లో పర్యటించారు. నీటి సమస్య, పారిశుధ్య సమస్యలను ప్రజలు అధికారులకు వివరించారు. మరమ్మతుకు గురైన రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. కొత్త నిర్మాణాల ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బి.చంద్రశేఖర్‌యాదవ్, రూరల్ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య కమిషనర్ వెంట వీధుల్లో పర్యటించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

పొదిలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ముల్లా మదార్‌వలి కోరారు. జిల్లాలో దివ్యాంగుల స్వయం సహాయక సంఘాల గ్రూపులలో పలురకాల నకిలీ గ్రూపులు ఉన్నాయని, వాటిని విచారించి నిజమైన దివ్యాంగులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘాల నాయకులు షేక్ కాలేషా, ఎం.సులోచనరాణి, కృష్ణ తదితరులు ఉన్నారు.

ఖరీఫ్ పైర్లు వాడుముఖం

వర్షాధారంపై ఆధారపడి
4,500 ఎకరాల విస్తీర్ణంలో పత్తి సాగు
45 రోజులుగా కురవని వాన
వేసవిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలు
వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు



ఎర్రగొండపాలెం మండలం వై కొత్తపల్లిలో
వర్షం లేక ఏపుగా పెరగని పత్తి మొక్కలు

ఎర్రగొండపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 30 రోజులు గడుస్తున్నా నేటికీ కనీస వర్షపాతం నమోదు కాలేదు.దీంతో ఖరీఫ్‌లో మెట్ట పైర్లు సాగుచేసుకునే రైతులకు దిక్కుతోచని పరిస్థితులు ఏర్పడ్డాయి. మరో వైపు ఎండలు విపరీతంగా ఉండటంతోపాటు ఉష్ణోగ్రతలు కూడా అధికంగా ఉంటున్నాయి.

ఎర్రగొండపాలెం మండలంలో 4,500 ఎకరాల విస్తీర్ణంలో పత్తి, 100 ఎకరాల విస్తీర్ణంలో పత్తి, మొక్కజొన్న పైర్లు, 20 ఎకరాల విస్తీర్ణంలో అరటి మొక్కలు నాటారు. వర్షాలు సమృద్ధిగా కురవక పోవడంతో బోర్లలో వచ్చేనీరు అడుగంటి పోయింది. వేసవిలో సాగుచేసిన పత్తి పైరు ఆశాజనకంగా ఉన్నప్పటికీ నీటి తడులు లేక పూత పిందె ఏర్పడే అవకాశం లేదనిరైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తేనే మెట్టపంటలు అయిన కంది, ఆముదాలు, జొన్న, పెసర. సొద్ద పైర్లు సాగు చేసే అవకాశం ఉంది. 2025 జూన్ నెల 1 వతేదీ నుంచి జూలై 11 వతేదీ వరకు ఎర్రగొండపాలెం మండలంలో సాధారణ వర్షపాతం 108.7 మీ.మీ కాగా 75.7 మీ మీ వర్షపాతం నమోదుకాగా 30.4 మీమీ తక్కువ వర్షపాతం నమోదు అయ్యింది. పుల్లలచెరువు మండలంలో సాధారణ వర్షపాతం 106 మీ మీ కాగా, జూన్, జూలై నెలలో 74.8 మీ.మీ వర్షపాతం నమోదు అయ్యింది, సాధారణం కంటే 29.4 మీ మీ వర్షపాతం తక్కువగా నమోదు అయ్యింది. త్రిపురాంతకం మండలంలో సాధారణ వర్షపాతం 107 మీ మీ కాగా జూన్, జూలై నెలలో 51.8 వర్షపాతం నమోదు అయ్యింది, సాధారణ కంటే 51.6 మీ మీ వర్షపాతం నమోదు అయ్యింది. దోర్నాల మండలంలో సాధారణ వర్షపాతం 91.8 మీమీ కాగా 81.6 మీ.మీ వర్షపాతం నమోదు కాగా, 11.1 వర్షపాతం తగ్గింది. పెద్దారవీడు మండలంలో సాధారణ వర్షపాతం 89.8 మీ మీ కాగా 75.1 వర్షపాతం కురిసింది, సాధారణ వర్షపాతం కంటే 16 .04 మీ మీ తక్కువ వర్ష పాతం కురిసింది.

ఐదు మండలాల్లో 2025 జూన్ నెల 1 వతేదీ నుంచి జూలై 11 వతేదీ వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో ఎర్రగొండపాలెం సబ్ డివిజన్‌లో సాగునీరు, తాగునీటి సమస్య తలెత్తి, ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు ప్రశ్నార్థకమే అన్నట్లుగా వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం ఎండలు కాస్తుండటంతో గరిష్ఠ ఉష్ణోగ్రత 33 డిగ్రీల సెల్సియస్ కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 27 డిగ్రీలు నమోదు అవుతోంది.. వర్షాలు కురవకపోతే ఖరీఫ్ సాగు ప్రశ్నార్థంగా మారే పరిస్థితులు కనబడుతున్నాయి. ఎర్రగొండపాలెం మండల రైతులు నిత్యం ఆకాశంలో వర్షించని మేఘాలను చూసి రైతులు, నిరాశ చెందుతున్నారు.

బీఎల్‌వోలు బాధ్యతగా ఓటర్ల జాబితా తయారు చేయాలి

● తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు బాధ్యతగా ఓటర్ల జాబితాను తయారుచేయాలని తహసీల్దార్ చిరంజీవి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఎల్‌వోలకు మూడు రోజుల నుంచి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ బీఎల్‌వో మీ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సమగ్రంగా తెలుసుకుని నమోదు చేయాలని కోరారు. మరణించిన ఓటర్లను జాబితాలో రాకుండా చూసుకోవాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా పనిచేయాలని కోరారు. మూడు బ్యాచ్‌లు గా మార్కాపురం మండలంలోని బీఎల్‌వోలను విభజించి మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ ప్రభావతి, మున్సిపల్ కమిషనర్ నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్‌వో శిక్షకులు వెంకటేశ్వర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తిచేసుకున్న బీఎల్‌వోకు
ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

తప్పొప్పులను సరిచేయాలి

పెద్దదోర్నాల :ఓటర్ల జాబితాలో తప్పొప్పులను సరిచేయాలని ఆర్‌వో సత్యనారాయణ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పోలింగ్ బూత్ స్థాయి అధికారులకు శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. తహసీల్దారు సీహెచ్ అశోక్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తరగతుల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ ఓటరు జాబితాలో మృతి చెందిన, ఒకే ఓటరు పేరు ఒకటి కన్నా ఎక్కువ ఉన్నా, ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారిని గుర్తించి తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు బీవీ భాస్కర్ రెడ్డి, సీనియర్ సహాయకులు శివ ప్రసాద్ వెంకట కృష్ణారెడ్డి, రీసర్వే డీటీ సాలమ్మ, డీటీ మల్లికార్జున నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచాలి

మార్కాపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచాలని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఎయిర్‌టెల్ కంపెనీ రిటైలర్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీఐ సుబ్బారావు మాట్లాడుతూ సిమ్ కొనుగోలు కోసం వచ్చేవారి నుంచి సేకరించే ఆధార్ కార్డులను భద్రంగా ఉంచాలన్నారు. వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ దుర్వినియోగం చేయరాదన్నారు. సైబర్ క్రైమ్ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారులకు దానిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై సైదుబాబు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు అన్నారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని కమలా స్కూల్‌లో శుక్రవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పలు రకాల ఆన్‌లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల నిషేద చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావు, స్కూల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పక్షాన అలుపెరగని పోరాటాలు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పక్షాన నిలబడి అలుపెరగని పోరాటాలు చేస్తున్న ఏకైక యూనియన్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అని ఆ యూనియన్ జోనల్ సహాయ కార్యదర్శి సోమయాజుల సుబ్బశాస్త్రి అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న మహిళల ఉచిత ప్రయాణంపై సిబ్బంది కొరతగా ఉన్నందున వెంటనే 10వేల మంది డ్రైవర్లు, కండక్టర్ల నియామకం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్ నాయుడు, జనార్దన్, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, రహమత్, అప్సర్, నాని తదితరులు పాల్గొన్నారు.



ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న నాయకులు

పొదిలిలో ఆవిర్భావ దినోత్సవం

పొదిలి : ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని పొదిలి ఆర్టీసీ డిపో ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మెయింటినెన్స్ కమిటీ మెంబర్ కె. కొండలరావు పాల్గొని మాట్లాడారు. అనేక ఉద్యమాలు చేసి యూనియన్ అభివృద్ధికి తోడ్పాటును అందించిన ప్రతి ఒక్క కార్మికునికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జెండా ఆవిష్కరించి కేక్‌కట్ చేసి కార్మికులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో రీజినల్ బాధ్యులు వీఏఎస్ రెడ్డి, ఏ. దివాకర్, డీసీ కాలేబు, ఏడీసీ ముల్లా షరీఫ్, పద్మా, రమాదేవి, డిపో కార్యదర్శి ఓబులేసు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేవీ రావు, ఎస్‌కె భాష, జిలాని, సుబ్బారావు, గ్యారేజి సిబ్బంది, ఆర్టీసీ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

తర్లుపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తహసీల్దార్ కె.కిషోర్ కుమార్ అన్నారు. మండలంలోని మీర్జాపేటలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవీఆర్ పాసు పుస్తకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని, వెంటనే కౌలు కార్డులు మంజూరు చేయాలని అన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఈక్రాప్ కూడా చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా రైతులకు పలు రెవెన్యూ సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీరెడ్డి, వీఆర్‌వో వలి, మీర్జపేట సర్పంచ్ వీరయ్య, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా వ్యవహరించాలి

గిద్దలూరు : ఈక్రాప్ నమోదు విషయంలో ప్రభుత్వ విధి విధానాల ప్రకారం పారదర్శకంగా వ్యవహరించాలని తహసీల్దార్ ఎం.అంజనేయరెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఈక్రాప్ డిజిటల్ సర్వేపై రెవెన్యూ అధికారులకు, వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ వ్యవసాయేతర, ప్రభుత్వ భూములకు ఈక్రాప్ నమోదు చేయవద్దని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పంటలు వేయని బీడు భూములను వేరుగా నమోదు చేయాలనిపేర్కొన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గిద్దలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లోని విహార్ క్లీనిక్‌లో ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత ఆర్థో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నంద్యాలకు ఎందిన నెరవాటి మల్టీస్పెషాలిటి ఆసుపత్రికి చెందిన ఎముకలు, కీళ్ల వ్యాధి వైద్యనిపుణులు డాక్టర్ కె.సుమన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 3వేల విలువ గల ఎముకల పటుత్వ సాంద్రత పరీక్షలు ఉచితంగానే చేస్తామని, మందులను ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన

మార్కాపురం వన్‌టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని పీఎల్‌పీ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ పిన్నిక లక్ష్మీప్రసాద్ అన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారుల సూచనల మేరకు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సేఫ్టీ క్లినిక్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఇళ్లల్లో ఉన్న గ్యాస్ స్టౌవ్ పనితీరు, గ్యాస్ పైప్ వినియోగపు ఆఖరితేదీ గమనించాలన్నారు. సిలిండర్, స్టౌవ్ వద్ద నుంచి వాసన వస్తే వెంటనే డిస్టిబ్యూటర్‌కు ఫోన్ చేయాలన్నారు. రాత్రిపూట రెగ్యులేటర్‌ను ఆపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర కుమార్, ఫిజికల్ డైరెక్టర్ పిన్నిక జాహ్నవి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్టస్థాయి ఎడ్లపోటీలు

కొమరోలు, జూలై11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాదినేనిపల్లి గ్రామంలోని శ్రీ రెడఖాశంస్వామి పీర్ల మహోత్సవాల సందర్భంగా శనివారం రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలను ఉదయం ప్రారంభించనున్నారు. ఆసక్తి ఉన్న ఎడ్లజత యజమానులు 6301482395, 8688641253, 6302748219 నెంబర్లులో సంప్రదించాలని తెలిపారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ

గిద్దలూరు టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సంజీవరాయునిపేట ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో డెంగ్యూ, మలేరియా, మెదడువాపు, చికున్‌గున్యా వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కె.కమలాదేవి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఐ.రమేష్, సూపర్‌వైజర్లు పి.రమేష్,నాగవేణి, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెగా పీటీఎం రిజిస్టర్ తప్పకుండా నిర్వహించండి

రాచర్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో ఉపాధ్యాయులు మెగా పీటీఎం రిజిస్టర్‌ను తప్పకుండా నిర్వహించాలని మండల ఎంఈవో వీ. గిరిధర్ శర్మ అన్నారు. ఎడవల్లి రాచర్ల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అనుములవీడు, పాలకవీడు, సోమిదేవిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు.



మల్లవరంలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న సీఈవో చిరంజీవి

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● సీఈవో చిరంజీవి

పొదిలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఈవో చిరంజీవి అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లవరం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని, అందుకు అనుకూలంగా ప్రతి గ్రామ పరిధిలో ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వాతావరణ మార్పుల వలన పలురకాల జబ్బులు ప్రబలే అవకాశం ఉందని, పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. అంతేకాకుండా గ్రామాల్లో ఎక్కడ నీటినిల్వలు, ఇంటి పరిసరాల్లో ఎరువు దిబ్బలు లేకుండా ఉండే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు, గ్రామ పారిశుధ్య కార్మికులు ఉన్నారు.



మాజీ సర్పంచ్ భౌతికకాయాన్ని పరిశీలించి
కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

విద్యుదాఘాతంతో మాజీ సర్పంచ్ మృతి

రాచర్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒద్దులవాగుపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ అన్నపురెడ్డి భూపాల్ రెడ్డి (62) విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతిచెందాడు. ఉదయం 5గంటల ప్రాంతంలో పొలానికి నీళ్ల పెట్టుకునేందుకు పొలం వద్దకు వెళ్లి స్టార్టర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందారు. 5గంటలకు పొలానికి వెళ్లిన భర్త 6గంటలైనా రాకపోవడంతో భార్య లక్ష్మీదేవి పొలం వద్దకు వెళ్లి చూడగా భర్త విగతజీవిగా పొలంలో పడి ఉన్నాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు చనిపోయిన భూపాల్ రెడ్డి మృతదేహాన్ని గృహానికి చేర్చారు. మృతుడు భూపాల్‌కు భార్య లక్ష్మీదేవీతోపాటు ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న రాచర్ల ఎస్సై పి. కోటేశ్వరరావు సంఘటనా స్థలనాకి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భూపాల్ రెడ్డి మృతివార్త తెలుసుకున్న గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి, గిద్దలూరు టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ నాయకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి, భూపాల్ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



గ్రానైట్ రాయికింద చిక్కుకున్న కార్మికుడు
(ఇన్‌సెట్లో) సుధమ కుష్వాహ్ (ఫైల్)

గ్రానైట్ రాయి కింద పడి యువకుడి మృతి

పొదిలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏలూరు గ్రామ సమీపంలో గ్రానైట్ పాలిషింగ్ యూనిట్‌లో కటింగ్ రాయికింద పడి సుధమకుష్వాహ్ (30) యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజులాగానే గ్రానైట్ రాయిని కటింగ్ చేస్తున్నామని, ప్రమాదవశాత్తు రాయిపడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సుధమకుష్వాహ్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.



ట్రాక్ పక్కన మృతిచెంది ఉన్న గొర్రెలు

గొర్రెలను కాపాడబోయి..

● రైలు ఢీకొని కాపరి మృతి , 10 జీవాలు మృత్యువాత

గిద్దలూరు టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలను మేపుకుంటూ రైలు వస్తున్న సమయంలో వాటిని కాపాడబోయి వ్యక్తి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు పట్టణ శివారులోని యడవల్లి- సత్యవోలు మధ్యలో రంగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొత్తకోట రాజాకృష్ణ (33) అనే గొర్రెల కాపరి తన గొర్రెలను తీసుకుని ట్రాక్ పక్క ప్రాంతంలో మేపుకుంటున్నాడు. రైలు వచ్చే సమయంలో గొర్రెలు బెదిరి ట్రాక్ పైకి పరుగెత్తాయి. ఆ గొర్రెలను కాపాడేందుకు రాజాకృష్ణ పరుగెత్తగా రైలు ఢీకొని మృతిచెందాడు. ఆ ప్రాంతంలో ఉన్న 10 గొర్రెలు కూడా రైలు ప్రమాదానికి గురై చనిపోయాయి. రాజాకృష్ణకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఏకలవ్యలో ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెద్ద దోర్నాల, జూలై 11(ఆంధ్రజ్యోతి):స్థానిక ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో అతిథి ఉపాధ్యాయుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భరద్వాజ ఉత్తర్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్ విధానంలో బోధించుటకు పీజీటీ కెమిస్ట్రీ-1, పీజీటీ బయాలజీ-1, పీజీటీ- జాగ్రఫీ/పొలిటికల్ సైన్స్-1, పీఈటీ ఎడ్యుకేషన్ (పీఈటీ-పురుషులు)-1పోస్టులకు గానూ అర్హత కలిగిన అభ్యర్థులు 21 సంవత్సరాల నుంచి 60 వయసున్న వారు ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి పదవీ విరమణ పొందిన వారు 60 నుంచి 65 ఏళ్ల వయస్సు కలిగిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం ప్రిన్సిపాల్ 9416094165 నెంబరును సంప్రదించాలని కోరారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

దొనకొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆశాడ బహుళ పాడ్యమి శుక్రవారంను పురస్కరించుకొని స్థానిక ఆనంద ఆశ్రమం వద్ద వేంచేసిన శ్రీ పోలేరమ్మ తల్లికి చీర, సారె వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

తానా హెల్త్ సర్వీసు కోఆర్డినేటర్‌గా మాధురి



సీఎస్‌పురం (పామూరు), జూలై 11 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని తానా హెల్త్ సర్వీసు కోఆర్డినేటర్‌గా సీఎస్‌పురం మండలం పెద్దగోగులపల్లి గ్రామానికి చెందిన ఏలూరి మాధురి ఎన్నికయ్యారు. ఆమె అమెరికాలో సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డారు. 2027 వరకు ఈ బాధ్యతలు నిర్వహిస్తారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్త్ సర్వీస్ కోఆర్డినేటర్‌గా తానా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

17న నారాయణస్వామి ఆరాధన

సీఎస్‌పురం(పామూరు), జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో నెల 17న స్వామివారి ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈవో శీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఆరోజు రాత్రి గామోత్సవం జరుగుతుందని తెలిపారు.

ముమ్మరంగా కాలువల మరమ్మతులు

- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- చిట్టడవులను తలపించిన సాగర్ కట్టలు
- కూటమి పాలనలో రూ.1.08 కోట్లు విడుదల
- పూర్తికానున్న పనులు



ఒంగోలు బ్రాంచ్ కాలువపై మరమ్మతులకు ముందు దట్టంగా పెరిగిన చిల్లచెట్లు



చిల్లచెట్లు తొలగించిన తర్వాత ఒంగోలు బ్రాంచ్ కాలువ కట్ట

దర్శి, జూలై 11(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువ మరమ్మతులు ముమ్మరంగా జరుగుతున్నాయి. బ్రాంచ్ కాలువలు, మేజర్లు, మైనర్లపై పెరిగిన చిల్లచెట్లు తొలగించి శుభ్రం చేస్తున్నారు. తెగిన కట్టలను బలోపేతం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో సాగర్ కాలువల మరమ్మతుల గురించి పట్టించుకోకపోవటంతో అధ్వానంగా మారిన విషయం తెలిసిందే. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలువల దుస్థితి గుర్తించి ఈ ఏడాది మరమ్మతులకు నిధులు విడుదల చేసింది. దీంతో దర్శి ప్రాంతంలోని అన్నికాలువల మరమ్మతు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

దర్శి ఎన్ఎస్‌పీ డివిజన్ పరిధిలోని సాగర్ ప్రధాన కాలువ, దర్శి బ్రాంచ్ కాలువ, పమిడిపాడు బ్రాంచ్ కాలువలతో పాటు మేజర్లు, మైనర్ల మరమ్మతు పనులను రూ.1.08 కోట్లతో చేస్తున్నారు. ఈ పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. చీమకుర్తి డివిజన్ పరిధిలోని దర్శి-2 సబ్ డివిజన్‌లో రూ.60 లక్షలతో సాగర్ కాలువ మరమ్మతులు చేస్తున్నారు. ఇక్కడ ఒంగోలు బ్రాంచ్ కాలువతో పాటు నిప్పట్లపాడు మేజరు, ఇతర మేజర్లు, మైనర్లలకు మరమ్మతులు చేస్తున్నారు. ఒంగోలు బ్రాంచ్ కాలువ కట్టలపై చిల్లచెట్లు అడవిలా పెరిగాయి. ఎట్టకేలకు నిధులు విడుదల కావటంతో కొద్దిరోజులుగా చిల్లచెట్లు తొలగింపు కార్యక్రమం శరవేగంతో జరుగుతుంది. కాలువ కట్లపై చిల్లచెట్లను తొలగించి శుభ్రం చేసిన తర్వాత ఎంతో పరిశుభ్రంగా కనిపిస్తుండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ డ్యామ్‌కు పుష్కలంగా నీరు చేరుతుండటంతో వచ్చే నెలలో సాగునీరు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈనెలాఖరు లోపు కాలువలకు మరమ్మతులు పూర్తి చేయటం లక్ష్యంగా అధికారులు పనులు నిర్వహిస్తున్నారు.

సాగర్ కాలువలకు మరమ్మతులు చేయటం హర్షణీయం

- కె.వెలిగొండా రెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, దర్శి



సాగర్ కాలువలకు మరమ్మతులు చేయటం ఎంతో ఆనందంగా ఉంది. డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఈఏడాది కూటమి ప్రభుత్వం మరమ్మతులకు నిధులు విడుదల చేసింది. కాలువలపై దట్టంగా పెరిగిన చిల్లచెట్లు తొలగించి శుభ్రం చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో కాలువల గురించి పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కాలువల పనులకు మరమ్మతులు చేసి అభివృద్ధి చేస్తుంది.

బడికెళ్లాలంటే ప్రయాసే!

- బస్సు కోసం పడిగాపులు
- కిక్కిరిసిన ప్రయాణికులతో ఫుట్‌బోర్డుపై ప్రయాణం
- ఏరూపంలో ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



ఫుట్‌బోర్డుపై బస్సులో వెళ్తున్న విద్యార్థులు



కనిగిరిలోని పాతూరు వద్ద బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు

కనిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యారంగం అభివృద్ధితోపాటు విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం వివిధరకాల సౌకర్యాలు కల్పిస్తుంది. పట్టణం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లాలంటే ఉదయం స్కూలు సమయానికి, సాయంత్రం స్కూలు వదిలే సమయానికి విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు రవాణా కల్పించడంలో కనిగిరి ఆర్టీసీ పూర్తిగా విఫలమైంది. మండలంలోని తుమ్మకుంట, కాశీపురం, నడింపల్లి గ్రామాలనుంచి దాదాపు 60 మంది ప్రతిరోజూ కనిగిరి ప్రభుత్వ బాలికల హైస్కూల్‌కు వివిధ తరగతులు చదువుకునేందుకు వస్తుంటారు. వీరు ప్రతిరోజూ స్కూలుకు వెళ్ళివచ్చే క్రమంలో బస్సులో గమ్యస్థానాలు చేరేందుకు పడరాని పాట్లు పడుతున్నారు.

హెచ్‌ఎంపాడు మండలంలోని గుడిపాటిపల్లి గ్రామం నుంచి వచ్చే బస్సు కోసం తుమ్మకుంట, నడిపల్లి, కాశీపురం నుంచి వచ్చే విద్యార్థులు పడిగాపులు కాయాల్సి వస్తుంది. బస్సు రద్దీగా వస్తుండటంతో విధిలేని పరిస్థితుల్లో ఫుట్‌బోర్డుపై నిలిబడి ప్రయాణిస్తుంటారు. సాయంత్రం నాలుగు గంటలకు స్కూల్ వదిలిన తర్వాత గార్లపేట రోడ్డు నుంచి నడుచుకుంటూ ఒంగోలు బస్టాండు సమీపంలోని పాతూరు దర్గా వద్దకు వచ్చి గంటపాటు నిలబడి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. తీరా బస్సు విద్యార్థుల నిలబడి ఉండే ప్రదేశానికి వచ్చేసరికి పూర్తిగా నిండిపోయి వస్తుంది. దీంతో అక్కడ నిలబడి ఉండే 60 మంది విద్యార్థులు కిక్కిరిసిన బస్సులో ఊపిరాడక అవస్థలు పడుతున్నారు. మరికొంతమంది ఫుట్‌బోర్డుపై వ్రేలా డుతూ ప్రయాణిస్తుంటారు. ఒక్కో సమయంలో విద్యార్థులు బస్సులో వెళ్లలేక మరో బస్సు కోసం రాత్రి 7గంటల వరకు కనిగిరిలోనే ఉండిపోతున్నారు. సకాలంలో ఇళ్లకు రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యాశాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు చర్చించుకుని ప్రత్యేక బస్సు ఏర్పాటుచేసి ఇబ్బందులు తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

దర్శి ఏఎంసీ చైర్మన్ పదవిపై ఉత్కంఠ

దర్శి, జూలై 11(ఆంధ్రజ్యోతి): దర్శి ఏఎంసీ చైర్మన్ ఎంపిక విషయంలో ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ మార్పు జరుగుతుందని గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతుంది. దీంతో అసలు ఏది వాస్తవమో అర్థంకాక ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం దర్శి ఏఎంసీ చైర్మన్ పదవి ఓసీ మహిళకు కేటాయించటంతో అభ్యర్థిని ఖరారు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో చర్చించి దర్శి పట్టణానికి చెందిన దారం నాగవేణి పేరును ప్రతిపాదించి పంపారు. అధిష్టానం కూడా ఆ పేరును ఆమోదించి ఖరారు చేసింది. ప్రభుత్వపరంగా ఉత్తర్వులు అందాల్సి ఉంది.

ఈనేపథ్యంలో రెండు రోజుల క్రితం దర్శి ఏఎంసీతో పాటు మరికొన్ని ఏఎంసీల రిజర్వేషన్లు మార్పు చేసినట్లు వార్తలు వచ్చాయి. అందులోభాగంగా దర్శిని ఎస్సీలకు రిజర్వు చేసినట్లుగా వార్తలు రావటంతో అయోమయం నెలకొంది. ఈవిషయంపై మార్కెటింగ్ శాఖ అధికారులను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కొద్దిరోజుల క్రితం దారం నాగవేణిని చైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాది స్తూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నా రు. ఉత్తర్వులు అందాల్సి ఉందన్నారు. రిజర్వేషన్ల మా ర్పు గురించి అడగ్గా ఆవిషయంపై ఎలాంటి ఉత్తర్వులు అందలేదన్నారు.

దారం నాగవేణి పేరు ఖరారవుతుంది..

దర్శి ఏఎంసీ చైర్మన్‌గా దారం నాగవేణి పేరు ఖరారవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్లల్లో మార్పు జరిగినట్లుగా వస్తున్న వార్తలపై ఆమె స్పందించారు. కంప్యూటర్ ఆపరేటర్ చేసిన తప్పిదంవల్ల గందరగోళం నెలకొందన్నారు. కొన్ని ప్రచార మాధ్యమాల్లో మాడపాకుల నారాయణమ్మ పేరు ఖరారైనట్లుగా వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. అధికారులకు పంపిన ప్రతిపాదనల మేరకు దారం నాగవేణి పేరు ఖరారవుతుందని ఆమె స్పష్టం చేశారు.

పార్టీలకతీతంగా మండలాభివృద్ధికి పాటుపడాలి

- ఎంపీపీ సుంకర సునీత



మాట్లాడుతున్న ఎంపీపీ సునీత, పక్కన జడ్పీటీసీ రత్నరాజు, ఎంపీడీవో సునీత

ముండ్లమూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా కలసి పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ సుంకర సునీత అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభం కాగానే టీడీపీ ఎంపీటీసీ సభ్యులు చింతపల్లి వెంకటేశ్వరరావు, పాలపర్తి సుబ్బారావు, తేలుకుట్ల బ్రహ్మం గత మండల సమావేశంలో తీర్మానించిన పనులను ఎందుకు ఆమోదించ లేదని ఎంపీడీవో శ్రీదేవిని ప్రశ్నించారు. ఇలా అయితే సమావేశాలకు మేము హాజరుకావడం ఎందుకని అన్నారు. ఎంపీపీ జోక్యం చేసుకొని పంతాలకు వెళ్లవద్దని, పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. వ్యవసాయ అధికారి ఏ.తిరుమల రావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద మండలంలో 11వేల కుటుంబాలను ఎంపిక చేశామన్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉంటే ఈనెల 13 లోగా పేర్లు నమోదు చేయించుకోవా లన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏ.హనుమాన్‌బాబు మాట్లాడుతూ మండలంలోని 42 గ్రామాలకు ఎస్‌పీపీ నీరు సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. సుంకరవారిపాలెం, కొమ్మవరంకు మాత్రమే ప్రస్తుతం నీరు అందించలేకపోతున్నామన్నారు. ఆ రెండు గ్రామాలకు కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం రైస్ కార్డులు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ప్రక్రియ వేగవంతం చేశామన్నారు.

సమావేశంలో వెలుగు, విద్యుత్ శాఖ, ఇరిగేషన్, పశు సంవర్ధక శాఖ, రోడ్లు, భవనాలు, ఆర్టీసీ, ఎన్ఎస్‌పీ శాఖల అధికారులు సమావేశానికి రాకపోవటంతో ఎంపీపీ సునీత అసహనం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి కూడా అధికారులు రాకపోతే సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం ఎవరు చెపుతారన్నారు. వారికి షోకాజ్ నోటీసులు పంపాలని ఎంపీడీవో శ్రీదేవికి తెలిపారు.

కాగా, సమావేశానికి భార్యలకు బదులు భర్తలు హాజరయ్యారు. అంతటితో ఆగకుండా అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. వేదిక మీద ఉన్న అధికారులెవ్వరూ వారిని సభ్యులు కాదు కదా?, మీరెందుకు ప్రశ్నలు అడుగుతున్నారనే ఆలోచన లేకుండా సమాధానాలు చెప్పటం విశేషం.

సమావేశంలో జడ్పీటీసీ టి.రత్నరాజు, డిప్యూటీ ఎంపీడీవో ఆర్.జనార్దన్, ఎంఈవో - 2 కె.వెంకటేశ్వర్లు, మారెళ్ళ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, వైస్‌ఎంపీపీ వేముల పద్మ, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన పెంచుకోవాలి

- ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు ఓటు నమోదు ప్రక్రియపై మరింత అవగాహన పెంచుకోవాలని ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల నిర్వహణ, ఓటు నమోదు, జాబితా తయారీ, తదితర ఎన్నికల ప్రక్రియపై కనిగిరి మండల పరిధిలోని పోలింగ్ బూత్‌ల బీఎల్‌వోలకు జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశానుసారం ప్రతి అధికారి ఎన్నికల నియమావళిపై పూర్తి స్థాయిలో తెలిసి ఉండాలన్నారు. నియోజకవర్గంలోని బీఎల్‌వోలు బూత్ ప్రదేశంతో పాటు ఆయా బూత్‌లో ఓటర్ల సంఖ్య వంటి వాటిని క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే యువతను ప్రోత్సహించాలన్నారు. ఓటు నమోదుచేసే ప్రక్రియలో యువతీ యువకులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. వారికి అర్థ మయ్యేవిధంగా ఓటు నమోదువల్ల జరిగే ప్రయోజనా లను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సహా య అధికారి, తహసీల్దార్ రవిశంకర్, ఏఎస్‌వో పీవీ రమణారెడ్డి, డి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం బీఎల్‌వోల సమావేశం జరిగింది. సమావేశానికి దర్శి నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.జాన్సన్ హాజరై మాట్లాడారు. ఓటు అనేది వజ్రాయుధంతో సమానమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, పి.రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, నాయకులు

అన్నివర్గాలకు ప్రభుత్వ పథకాలు

దర్శి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో సీఎం చంద్రబాబును తమను ఆదుకుంటున్న పెద్ద కొడుకుగా అభిమానిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. అన్నారు. పట్టణంలోని 3వ వార్డులో శుక్రవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అమలుచేస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి అవసరమైన పథకాలు అమలుచేయటం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, దారం సుబ్బారావు, కౌన్సిలర్ ఇత్తడి సునీత దినకర్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: పార్టీలకు అతీతంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తుండటంతో లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని తిరగలదిన్నె గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మల్లెబోయిన బాలబ్రహ్మయ్య, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, సూర్యప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ సీఎస్‌పురం మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కోవిలంపాడులో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎస్‌సీ మాలకొండయ్య, అమడసాని బాలకేశవరెడ్డి, షేక్ రజ్జబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా రైతులకు ఎంతో ప్రయోజనకరం

దొనకొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): పంటల బీమా రైతులకు ఎంతో ప్రయోజనకరమని మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఆరవల్లిపాడు, తెల్లబాడు గ్రామాల్లో పంటల బీమాపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది పంటకు ఎకరాకు రెండు శాతం రైతు వాటాగా రూ.430, మినుములు ఎకరాకు ఒక శాతం రైతు వాటాగా రూ.205, ఎండు మిర్చి ఎకరాకు ఐదుశాతం రైతు వాటాగా రూ.4500 ఈనెల 31లోగా చెల్లించాలన్నారు. పత్తి పంటకు ఎకరాకు ఐదు శాతం రైతు వాటాగా రూ. 2100, వరి పంటకు రెండు శాతం రైతు వాటాగా రూ.860 ఈనెల 15లోగా చెల్లించాలన్నారు. ఈమేర పంటలకు బీమా చెల్లించి రైతుల శ్రేయస్సు నిమిత్తం ప్రభుత్వం కల్పించిన ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్‌గా నాగేంద్రం



తాళ్లూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): దర్శి మార్కెట్ కమిటీ వైస్‌చైర్‌పర్సన్ పదవిని తాళ్లూరు మండలం, లక్కవరం వాసి బొడ్డు నాగేంద్రంను వరించింది. దర్శి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను నియమిస్తూ వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులోభాగంగా మండలంలోని లక్కవరం గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు బొడ్డు హనుమారెడ్డి సతీమణి నాగేంద్రంను చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, దోసకాయలపాడు సీనియర్ టీడీపీ నాయకుడు నల్లపాటి సత్యనారాయణ, మల్కాపురం మాజీ సర్పంచ్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు షేక్ ఖాశీంసైదాను డైరెక్టర్లుగా నియ మించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు మండలంలోని పది విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రామకృష్ణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో 33/11 కేవీ విద్యుత్ తీగల మరమ్మతులతో పాటు తొమ్మిది విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులతో సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పామూరు: పామూరు, బొట్లగూడూరులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల్లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ జిలాని బాషా ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

పామూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా ఐటీడీపీ కోఆర్డినేటర్ పత్తుమస్తాన్ సమకూర్చిన దుప్పట్లు, బియ్యాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా స్థానిక పెద్ద మసీదులో శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్ రఫీ, షేక్ ఖాజారహంతుల్లా, కౌలూరి ఖాజారహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీఆర్‌సీ కార్డుల మంజూరు విషయంలో పురోగతి తక్కువగా ఉందన్నారు. రెండు శాఖలు ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకొని కార్డులు ప్రక్రియను ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు, ఏఈవో శ్రీకీర్తి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మకు ఆషాఢం సారె

కనిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా కనిగిరి దొరువు వద్ద ఉన్న కనక దుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం రాత్రి మహిళలు ఆషాఢం చీరె, సారెను అందజేశారు. స్థానిక రామాలయం వీధిలోని అంజనేయస్వామి దేవాలయం నుంచి మహిళా భక్తులు 108 మంది చీరె, సారెను పసుపు, కుంకుమలతో ఊరేగింపుగా అమ్మవారి కోవెలకు తీసుకెళ్ళారు. ఈ వేడుకల్లో వాసవి మహిళా బృందం, ఏపీ ఆర్యవైశ్య మహాసభ మహిళా బృందం పాల్గొన్నారు.

వైద్యం అందక అల్లాడుతున్నాం

కనిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం పాలైనా మాగోడు పట్టించుకునే వైద్యులు లేరని గురువాజీపేట గ్రామస్థులు పీహెచ్‌సీ డాక్టర్ సృజన తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈమేరకు టీడీపీ గ్రామనేత చెంచిరెడ్డిని కలసి తమ గోడు వెళ్ళబోసుకున్నారు. దీంతో గ్రామస్థులతో కలసి చెంచిరెడ్డి శుక్రవారం డాక్టర్ సృజనను కలిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవర్తన మార్చుకోకపోతేపై అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ క్రమంలో డాక్టర్ సృజన వారితో వాగ్వివాదానికి దిగారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి డాక్టర్ సృజన నిర్లక్ష్య వైఖరిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బాపట్లలో భారీ వర్షం

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పుతో పాటు భారీవర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా వేడిగాలులతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో చల్లపడ్డారు. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు భారీవర్షం కారణంగా వాతావరణం చల్లబడటంతో సంతోషం వ్యక్తం చేశారు. గంటకుపైగా కురిసిన వర్షంతో లోతట్టుప్రాంతాలలోని రోడ్లపై నీరు నిలిచింది. వరుణుడిపై అధారపడి సాగు ప్రారంభించిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తీరప్రాంత గ్రామాలలో వెదసాగు ప్రారంభించారు.

సర్‌చార్జిలో తేడాలు



- రూ.60 కోట్లకు రూ.37 కోట్లే జమ
- పొంతన లేకుండా రిజిస్ట్రేషన్, జడ్పీ లెక్కలు
- సమాచార లోపంతోనే తేడాలంటోన్న రిజిస్ట్రార్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన సర్‌చార్జి చెల్లిం పుల్లో భారీ తేడాలు కనిపిస్తున్నాయి. చెల్లింపు లకు సంబంధించి రిజిస్ట్రేషన్, జడ్పీ అధికారుల లెక్కలకు పొంతన ఉండటం లేదు. 2022-2023 నుంచి 2024-2025 వరకు రూ.60 కోట్ల వరకు సర్‌చార్జి రూపేణా జడ్పీకి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని రిజిస్ట్రేషన్ల శాఖ చెల్లిం చాలి. గత ప్రభుత్వ హయాంలో జడ్పీ అధికారు లు పలుమార్లు రిజిస్ట్రేషన్ శాఖకు లేఖలు రాసి నా పెద్దగా స్పందన లేదు. చాలాకాలంగా పెం డింగ్‌లో ఉన్న సర్‌చార్జి చెల్లింపులపై చర్చించేం దుకు గురువారం జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, సీఈవో జ్యోతిబసు మూడు జిల్లాల రిజిస్ట్రార్లతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో అధికారుల మధ్య లెక్కల్లో వ్యత్యాసాలను గుర్తిం చారు. సర్‌చార్జి రూపేణా గడచిన నాలుగేళ్లలో జడ్పీకి రూ.60 కోట్లు వరకు రావాల్సి ఉంది. అయితే రూ.37 కోట్లు మాత్రమే జమ అయినట్లు జడ్పీ అధికారులు చెప్తున్నారు. మిగిలిన రూ.23 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారన్న అన్న దానిపై రిజిస్ట్రేషన్ అధికారులు స్పష్టత ఇవ్వలేదని జడ్పీ వర్గాలు చెబుతున్నాయి. చెల్లింపుల విషయంలో వ్యత్యాసం కనపడుతున్నందున మరో వారంలో పూర్తి సమాచారంతో వస్తామని రిజిస్ట్రార్లు జడ్పీ అధికారులకు చెప్పినట్లు తెలుస్తుంది.

ఏమయ్యాయి.. ఎటుపోయాయి..

గుంటూరు జిల్లా నుంచి 2022-2023, 2024- 2025 జూన్ వరకు సర్‌చార్జి రూ.23 కోట్ల వరకు రావాల్సి ఉంది. అయితే మొత్తం చెల్లించేశామని రిజిస్ట్రేషన్ అధికారులు చెప్తుండగా రూ.17.28 కోట్లు మాత్రమే జమైనట్లు జడ్పీ అధికారులు తే ల్చారు. అయితే మిగిలిన రూ.5.72 కోట్లు ఏమ య్యాయి.. ఎటుపోయాయో అంతుపట్టడంలేదు. పల్నాడు జిల్లా నుంచి రూ.25 కోట్లకు రూ.13.9 కోట్లు మాత్రమే జమ అయినట్లు చెబుతున్నారు. రూ.15.11 కోట్లు జమ అయినట్లు పల్నాడు జిల్లా రిజిస్ట్రార్ చెబుతున్నారు. లెక్కల్లో ఇంత పెద్ద మొత్తంలో తేడాలు గమనించిన అధికారులు సర్ చార్జి సొమ్ము ఎక్కడకి పోయిందో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

బాపట్లలో ఇచ్చింది ఎక్కువ..

గుంటూరు, పల్నాడు జిల్లా అధికారులు తక్కువ ఇచ్చి ఎక్కువ ఇచ్చినట్లు చెబుతుంటే బాపట్ల జిల్లాలో మాత్రం ఎక్కువ ఇచ్చి తక్కువ ఇచ్చినట్లు చెబుతున్నారు. బాపట్ల నుంచి జిల్లా పరిషత్‌కు రూ.12 కోట్లు రావాల్సి ఉండగా, రూ.7.74 కోట్లు జమ చేశారు. కానీ బాపట్ల రిజిస్ట్రార్ రూ.5.86 కోట్లు మాత్రమే ఇచ్చినట్లు చెబుతున్నారు. జడ్పీకి సర్‌చార్జి చెల్లింపుల్లో నెలకొన్న గందరగోళం అంతా సమాచార లోపం వల్లేనని గుంటూరు రిజిస్ట్రార్ శైలజ తెలిపారు.

నల్లమడకు..నిధులు

- నిధుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం
- మూడు జిల్లాల్లో 1.80 లక్షల ఎకరాల ఆయకట్టుకు మేలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నల్లమడవాగు ఆధునికీకరణకు పట్టిన గ్రహణం ఎట్టకేలకు వీడింది. తొలిదశ పనుల్లో భాగంగా రూ.180.60 కోట్లు విడుదలకు తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదముద్ర పడింది. దీంతో ఏళ్లుగా రైతులు ఎదురు చూస్తున్న నల్లమడ ఆధునికీకరణ పనులకు మోక్షం లభించినట్లైంది. 2017లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వం నల్లమడవాగు ఆధునికీకరణ పనులపై దృష్టి పెట్టింది. రూ.180 కోట్లు నిధుల విడుదలతో అప్పట్లో భూసేకరణపై అధికారులు డీపీఆర్ రూపొందించారు. ఇక పనులు పట్టాలెక్కడమే తరువాయి అనుకునే దశలో ప్రభుత్వం మారి వైసీపీ గద్దెనెక్కింది. దీంతో పనులకు గ్రహణం పట్టింది. అప్పటి నుంచి రైతులు నల్లమడ వాగు ఆధునికీకరణపై ఆందోళన చేస్తున్నారు. కానీ గత ప్రభుత్వం ఐదేళ్లు దీని గురించి పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి గద్దెనెక్కగానే పనులపై కదిలిక వచ్చింది. జనవరి

ఆధునికీకరణకు రూ.180.60 కోట్లు



ణపై కసరత్తు చేశారు. భూసేకరణపై నీటిపారుదలశాఖ అధికారులు రెండు నెలల క్రితం సమగ్ర నివేదికను ప్రభుత్వా నికి సమర్పించారు. ఈ క్రమంలో తాజాగా దం తెలపడంతో పనులపై అధికారు లు దృష్టి సారించారు. గత ప్రభుత్వం వహించిన నిర్లక్ష్యం కారణంగా వ్యయం దాదాపు రూ.325 కోట్లకు చేరిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం విడుదల చేసే రూ.180.60 కోట్లు భూసేకరణకే సరిపోతాయని, పనులకు అదనంగా మరో రూ.145 కోట్లు ఖర్చు తప్పదనేది ఇరిగేషన్ అధికారుల అభిప్రాయంగా ఉంది. నల్లమడ ఆధునికీకరణతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని దాదాపు 1.80 లక్షల ఎకరాల ఆయకట్టు కు మేలు జరగనున్నది. దాదాపు 173 కి.మీటర్ల మేర ప్రవహించి బాపట్ల మండలం సూర్యలంక సమీపంలోని పొగరు వద్ద సముద్రంలో కలుస్తోంది. ఈ వాగు ప్రస్తుతం గరిష్ఠంగా 23 వేల క్యూసెక్కుల వరకు ప్రవాహ సామర్థ్యాన్ని తట్టుకుంటోంది. అదే ఆధునికీకరణ పనులు పూర్తయితే సామర్థ్యం దాదాపు 45 వేల క్యూసెక్కుల వరకు పెరగనుందని అధికారులు లెక్కలు వేస్తున్నారు.

భూసేకరణే కీలకం..

నల్లమడ వాగు ఆధునికీకరణలో భూసేకరణే కీలకం. ప్రస్తుతం విడుదల చేసే నిధుల్లో 70 శాతం దీనికే ఖర్చయ్యే అవకాశం ఉంది. గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని నాలుగు మండలాల పరిధిలో భూ సేకరణ చేపట్టాలని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు అందాయి. బాపట్ల జిల్లాలో బాపట్ల, కర్లపాలెం మండలాలు, గుంటూరు జిల్లాలో పెదనందిపాడు, కాకుమాను మండలాల పరిధిలో పనులు సాగనున్నాయి. ఈ క్రమంలో నష్టపరిహారం మదింపులో రెవెన్యూ యంత్రాంగం అంచనాలు రూపొందిస్తోంది. వరద పోటెత్తిన సమయాల్లో మూడు జిల్లాల పరిధిలోని రైతుల్ని నల్లమడ వాగు వణికిస్తూనే ఉంది. కరకట్టలు బలహీనంగా ఉండడం, వాగులు పొంగి గండ్లు పడి పంటచేలను ముంచెత్తిన సమయాల్లో ఆధునికీకరణ డిమాండ్ తెరమీదకు వస్తూనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఎట్టకేలకు రైతుల కడగండ్లు తీర్చడానికి ప్రభుత్వం నిధులు మంజూరుతో తొలి అడుగు పడింది. ప్రభుత్వం నిధుల విడుదలతో నల్లమడ వాగు ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపుతున్న చేపల పెంపకం దారులు

చేపల కోసం చెరువు ఖాళీ

- వర్షాలు లేక బెట్టకు వచ్చిన వాతావరణం
- సాగునీటిని వృథాగా వదలడంపై రైతుల ఆందోళన

బల్లికురవ. జూలై 11 (ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితుల్లో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి. అయితే చేపల కోసంగా చెరువులో ఉన్న నీటిని బయటకు వదలడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేపలు పట్టుకునేందుకు చెరువులో ఉన్న నీటిని వృథా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. చేపల పెంపకం లీజు సమయంలో నీటిని వదలకుండా చేపలు పట్టుకోవాలన్న నిబంధన ఉన్నా దానిని పట్టించుకోవడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. బల్లికురవ మండలం అంబడిపూడి సాగునీటి చెరువు కింద అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, నక్కబొక్కలపాడు గ్రామాల్లోని పంట భూములు ఆధారపడి ఉన్నాయి. ఈ చెరువులో చేపల పెంపకానికి గత ఏడాది ఓ కాంట్రాక్టర్ లీజ్‌కు తీసుకున్నారు. ప్రస్తుతం చెరువులోని చేపలు పట్టుకు నేందుకు సంబంధిత లీజుదారుడు సిద్ధమయ్యాడు. దీంతో చెరువులో ఉన్న నీటిని నాలుగు రోజుల నుంచి వాగులకు వదులుతు న్నాడు. ఒక వైపు వాతావరణం బెట్ట పెట్టి వర్షాలు లేక పంటలు ఎండు ముఖం పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో చెరువులో ఉన్న నీటిని వది లేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువును ప్రస్తుతం ఖాళీ చేస్తున్నారని, మళ్లీ చెరువును నింపుకోవాలంటే ఎంత సమయం పడుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మాత్రం చెరువు వైపు కన్నెత్తి చూడ లేదని రైతులు తెలిపారు. చెరువులో నీరు ఉంటే గ్రామాలలో గ్రౌండ్ వాటర్ కూడా బాగుంటుందని అలాంటిది చుక్క నీరు లేకుండా మోటార్లు ఏర్పా టు చేసి చెరువును ఖాళీ చేస్తున్నారని రైతులు అంటున్నారు.

రూ.10.22 కోట్లతో 37 గ్రామాలకు తాగునీరు

నీటి సరఫరాకు ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్: ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలంలోని 19 గ్రామపంచాయతీల పరిధిలో 37 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు జలజీవన్‌మిషన్ ద్వారా రూ.10.22 కోట్లు వెచ్చించి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ధరివాదకొత్తపాలెం వెస్ట్‌శ్యాంప్ డ్రెయిన్ పక్కనే మరుప్రోలువారిపాలెం సామూహిక రక్షిత మంచి నీటి పథకం ఎస్‌ఎస్ ట్యాంక్ వద్ద శుక్రవారం జల్‌జీవన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి శిలఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికి కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 57 కిలోమీటర్ల పొడవున పైపులైన్లు ఏర్పాటు చేసి 6,318 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చి తాగునీటిని అందిస్తామన్నారు.మరుప్రోలువారిపాలెం పథకం ద్వారా ఇప్పటి వరకు 25 గ్రామాల్లో నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇకపై తీరప్రాంత గ్రామాలకు తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ఎం.అనంతరాజు, ఏఈ షేక్.మంజూరుబాషా, మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, పట్టణ, మండలపార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, సీనియర్ నాయకులు ఆంద్రేయ, జి.గిరిజారాణి, మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లంనరోజని, కార్యదర్శి ఝాన్సీరాణి పాల్గొన్నారు.



శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

జేసీ నియామకంలో జాప్యం

- ప్రఖర్‌జైన్ రెండు నెలల క్రితం బదిలీ
- భూ సంబంధిత అంశాలపై కదలని ఫైళ్లు
- ఇన్‌చార్జి జేసీ బాధ్యతల్లో కలెక్టరు వెంకటమురళి
- జిల్లా ఆవిర్భావం నుంచి వేధిస్తోన్న సిబ్బంది కొరత

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పరిపాలనలో కీలకమైన జాయింట్ కలెక్టర్ పోస్టు జిల్లాలో రెండు నెలలపైగా ఖాళీగా ఉంది. ఇన్‌చార్జి జేసీగా కలెక్టరే వ్యవహరిస్తున్నారు. జిల్లా ఆవిర్భావం నుంచి ఆయా విభాగాల్లో సిబ్బంది కొరత వేధిస్తూనే ఉంది. కీలక శాఖలకు అధిపతులు సైతం ఎఫ్‌ఏసీగా విధులు నిర్వహించక తప్పని పరిస్థితి మూడేళ్లుగా జిల్లాలో ఉంది. ఈ నేపథ్యంలో అత్యంత కీలకమైన జేసీ పోస్టు కూడా రెండు నెలల నుంచి భర్తీకి నోచుకోలేదు. ఇది పరిపాలనపై ప్రభావం చూపడంతోపాటు కీలకమైన విభాగాల్లో ఫైళ్లు కొండలా పేరుకుపోతున్నాయి. జేసీగా పనిచేస్తున్న ప్రఖర్‌జైన్‌ను ఆర్టీజీఎస్ సీఈవోగా ప్రభుత్వం బదిలీ చేసి రెండు నెలలు దాటింది. అప్పటి నుంచి జేసీ పోస్టు భర్తీపై ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి కదలిక లేదు. ఓ వైపు ప్రభుత్వం రెవెన్యూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో అడుగులేస్తోంది. రీ సర్వే అంకంతో పాటు నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్‌నే ప్రభుత్వం రంగంలోకి దింపింది. ఇలాంటి తరుణంలో జేసీ పోస్టు భర్తీపై ప్రభుత్వం దృష్టిపెట్టకపోవడంతో కొన్ని ఫైళ్ల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన విజన్ ప్రణాళికలపై కూడా ఆ ప్రభావం పడుతోంది. రెవెన్యూతో లింక్ అయి ఉన్న ఈ-క్రాప్ చిక్కులతో బర్లీ పొగాకు కొనుగోళ్లలో వారం రోజులు అయోమయం నెలకొంది. అదే జేసీ పోస్టు నియామకం చేపట్టి ఉంటే మార్క్‌ఫెడ్ విభాగం మొత్తాన్ని మానిటర్ చేయడంతో పాటు రెవెన్యూ చిక్కులకు ఇంకా త్వరగా పరిష్కారం లభించేదనే అభిప్రాయం ఉంది. పని ఒత్తిడి మొత్తం కలెక్టర్ వెంకటమురళిపైనే పడడంతో అన్నింటిని సమన్వయం చేసుకోవడం ఆయనకు తలకుమించిన భారంగా మారింది. ప్రభుత్వ ప్రాథమ్యాలు రోజురోజుకూ పెరిగిపో తుండడంతో జేసీ నియామకం అత్యవసరంగా తయారైంది. అక్రమ లే అవుట్లపై చర్యల విషయంలో కదలిక వచ్చిన నేపథ్యంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బావుడా) వైస్ చైర్మన్ పదవి ఖాళీగా ఉండడం కూడా బావుడా కార్యకలాపాలపై ప్రభావం చూపుతోంది. రెన్యువబుల్ ఎనర్జీ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్(ఆర్‌ఈఎంజెడ్) అద్దంకి నియోజకవర్గంలో ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి భూ సేకరణ అంకం త్వరలోనే మొదలుకానుంది. మైనింగ్ లీజులపై నూతన విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. సూర్యలంక అభివృద్ధి పనులకు టెండర్లు, త్వరలోనే నల్లమడ వాగు ఆధునికీకరణ కోసం భూ సేకరణ ఘట్టం కూడా తెరమీదకు రానుంది. ఇన్ని కీలక అంశాలపై కసరత్తు జరుగుతున్న సమయంలో జేసీ పోస్టు భర్తీపై ప్రభుత్వం దృష్టిపెట్టాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



పర్చూరులో..రూ.2 కోట్లకుపైగా టోకరా

- తక్కువ ధరకు శిల్క్‌శారీస్ పేరుతో రంగప్రవేశం
- అధిక వడ్డీ ఆశ చూపి నిలువునా ముంచిన ఘనుడు

పర్చూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు నాణ్యమైన శిల్క్‌చీరలను అందిస్తానని రంగప్రవేశం చేసి ప్రజల్లో నమ్మకం కల్గిన తర్వాత అధిక వడ్డీ ఆశ చూపి రూ.2 కోట్లకు పైగా మోసగించిన ఘరానా మోసగాడి ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జిల్లాకు చెందిన వ్యక్తిగా చెప్పుకొంటూ ఏడాది క్రితం ఓ వ్యక్తి పర్చూరులో ఇల్లు అద్దెకు తీసుకుని నాణ్యమైన శిల్క్ చీరలను తక్కువ ధరకు ఇస్తున్నానంటూ ప్రచారం చేసుకున్నాడు. క్రమక్రమంగా ఇంకొల్లు, చెరుకూరు, పర్చూరు, దగ్గుబాడు తదితర ప్రాంతాలకు వ్యాపారం విస్తరించాడు. అనంతరం చీరల వ్యాపారంతో పాటు వడ్డీ వ్యాపారానికి తెరలేపాడు. రూ.10 వేలు ఇస్తే నెలకు రూ.12 వేల ఇస్తానని ఆశ చూపాడు. దాదాపు ఏడాది పాటు తీసుకున్న వారందరికీ వడ్డీ సహా సక్రమంగా చెల్లింపులు చేశాడు. దీంతో నిరుపేదల నుంచి ధనవంతుల వరకు వడ్డీలకు ఆశపెడి పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టారు. కొందరైతే బంగారు వస్తువులను సైతం తాకట్టు పెట్టి సదరు మోసగాడికి నగదు అప్పజెప్పారు. ఇలా రెండు నెలల నుంచి రూ.2కోట్లకు పైగా సేకరించిన వ్యాపారి ముఖం చాటేశాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. శిల్క్ చీరల వ్యాపారితో సన్నిహితంగా మెలిగిన వ్యక్తుల ద్వారా మోసగాడి జాడ కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఏమి చేయాలో అర్థం కాక బాదితులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. మోసగాడిది గోదావరి జిల్లాలోని ఓ గ్రామంగా చెబుతున్నారు. అయితే బాపట్ల జిల్లా వాసిగా ఆధార్ కార్డు సృష్టించుకుని ఇక్కడ వ్యాపారం చేసినట్లు బాధితులు తెలిపారు. నకిలీ బంగారం బ్యాంకులో తనఖా పెట్టి రుణం తీసుకున్న ఘటనలో కూడా ఇతడి పాత్ర ఉందని విశ్వసనీయ సమాచారం. ఇటీవల కొందరు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకు పోయినట్లు తెలిసింది.





చీరాల.. పీఠం ఎవరిదో

- 16న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక
- భారీగా ఆశావహులు.. ఏకాభిప్రాయంపై ఎమ్మెల్యే కసరత్తు

(బాపట్ల, చీరాల - ఆంధ్రజ్యోతి)

అవిశ్వాసం నోటీసు మొదలు ఓటింగ్ జరిగి చైర్మన్ పదవి నుంచి జంజనం శ్రీనివాసరావును గద్దె దింపే వరకు గతంలో అనేక మలుపులు తిరిగిన చీరాల మున్సిపాలిటీ అంశం ఎట్టకేలకు తుది అంకానికి చేరింది. అనేక మలుపుల మధ్య మే 14న చైర్మన్ పదవితో పాటు రెండు వైస్ చైర్మన్‌ల స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నెల 16న చైర్మన్ ఎన్నికకు ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాజకీయ సమీకరణాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఆశావాహులు భారీగా ఉన్నా ఏకాభిప్రాయంతోనే చైర్మన్ అభ్యర్థి పేరును ప్రకటించాలనేది ఎమ్మెల్యే కొండయ్య ఆలోచనగా ఉంది. ఇందుకు సంబంధించి ఆయన శుక్రవారం పలువురు కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించి, తన ప్రతిపాదనను వారి ముందుంచినట్లు సమాచారం.

కొనసాగుతున్న ఉత్కంఠ

చైర్మన్‌పై అవిశ్వాసం అనేక మలుపులు తీసుకోగా ప్రస్తుతం చైర్మన్ ఎంపిక ఏ రీతిన జరగనుందో అనే ఉత్కంఠ అటు రాజకీయ వర్గాల్లో ఇటు ప్రజల్లో నెలకొంది. జంజనంపై అవిశ్వాసం మొదలుకుని భారీగా ఖర్చు చేసిన తనకే చైర్మన్ పీఠం కట్టబెట్టాలనేది ఓ కౌన్సిలర్ వాదన. ఎన్నికలకు ముందే టీడీపీలోకి వచ్చి విధేయతతో పనిచేశామని, ఇప్పుడు పదవి ఆశిస్తున్న సదరు కౌన్సిలర్ అధికారం వచ్చాక టీడీపీలోకి వచ్చిన అంశాన్ని మరో కౌన్సిలర్ గుర్తు చేస్తున్నారు. దీంతో చైర్మన్ ఎంపిక అంశం రసకందాయంలో పడింది.

రాజకీయ సమీకరణాలు ఇలా..

గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ 21, స్వతంత్రులు 11, టీడీపీ 1 వార్డు గెలుచుకున్నాయి. స్వతంత్రులుగా గెలిచిన 11 మంది లో ఆరుగురు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆ గూటికి చేరారు. దీంతో వైసీపీ బలం 27కు చేరగా, ఐదుగురు మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గంగా, ఒకరు టీడీపీ వైపు ఉన్నారు. అయితే సార్వత్రిక ఎన్నికలకు ఆరు నెలల ముందు, ఫలితాలు వచ్చాక వైసీపీ కౌన్సిలర్లు పోటీపడి టీడీపీ బాట పట్టారు. దీంతో టీడీపీ బలం 21కు చేరింది. ప్రస్తుతం వైసీపీలో ఏడుగురు ఉన్నారు. ఐదుగురు ఆమంచి వర్గంగా కొనసాగుతున్నారు.



అరవపల్లి సమీపంలో మెయిన్ కెనాల్ పటిష్ఠత కోసం వేసిన ఇసుక బస్తాలు జారిపోయిన దృశ్యం

పటిష్ఠత.. పైపైనే

- నాసిరకంగా కాల్వ కట్టల మరమ్మతులు
- మెయిన్ కెనాల్‌కు నీరు విడుదలతో కుంగిన బాదులు
- రూ.3.50 కోట్లతో చేపట్టిన పనులపై రైతులు అనుమానం

రేపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో మెయిన్ కెనాల్ మరమ్మతులకు ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో మెయిన్ కెనాల్, సైడ్ చానల్స్ డ్రెయిన్లలో పూడికతీశారు. కోతకు గురైన అరవపల్లి మెయిన్ కెనాల్ కాల్వ కట్ట పటిష్ఠతకు సిమెంట్ బస్తాలు వేసి బాదులు పాతి మట్టిని నింపారు. శుక్రవారం మెయిన్‌కెనాల్‌కు నీరు విడుదలతో బాదులు నీటిలో ఒరిగిపోగా, ఇసుకబస్తాలు నీటిలో కలిసిపోయాయి. దీంతో ఎక్కడకక్కడ కట్టలు తెంచుకున్నాయి. వీటిని చూసిన వారు పనులు ఎంత పటిష్ఠంగా చేశారో అర్థమవుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో కాల్వల అభివృద్ధి చేసిన దాఖలా లేదని ఈ ఏడాది నిధులు మంజూరు చేస్తే పనులన్నీ నాసిరకంగానే చేశారని మండిపడుతున్నారు.



వైభవంగా శాకాంబరి వేడుకలు



కూరగాయల అలంకారంలో అమ్మవారు

గిద్దలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం శాకాంబరి వేడుకలు వైభవంగా జరిగాయి. అమ్మవారి మూలవిరాట్‌ను, ఉత్సవ విగ్రహాన్ని, ఆలయం మొత్తాన్ని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు శాకాంబరి వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగ సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొమరోలులో...

కొమరోలు, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శక్రవారం శాకాంబరీ దేవి అలంకరణలో ప్రజలకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పలురకాల కూరగాయలు, పండ్లతో అందంగా అలంకరించారు. సాయంత్రం ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్‌ఎస్సైగా తిరుపతి స్వామికి ఉద్యోగోన్నతి

ఒంగోలు క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : ఆర్మ్‌డ్ రిజర్వుడు విభాగంలో ఏఆర్ఎస్సైగా పనిచేస్తున్న వి.తిరుపతిస్వామికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజీ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు తిరుపతిస్వామి మర్యాద పూర్వకంగా శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి పూల బొకే అందజేశారు.

బైకు ఢీకొని వృద్ధుడి మృతి



వెంకటేశ్వర్లు

కలిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కలిగిరి-సంగం మార్గంలో వెలగపాడు గ్రామ సమీపంలో బైకు ఢీకొనడంతో వెంకటేశ్వర్లు(75) మృతి చెందాడు. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా దర్శి సమీపంలోని కుడిచేడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు వెలగపాడు వద్ద ఉన్న ఓ వెంచర్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి వెంచర్‌లో నుంచి వెలుపలకు వచ్చి రోడ్డు మార్జిన్‌లో నడుచుకొంటూ వెళుతుండగా పాతనాపురం నుంచి కలిగిరి వైపు వస్తున్న బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడుని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడని మృతుడి బంధువులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంద కృష్ణమాదిగ సన్మాన సభను జయప్రదం చేద్దాం

అద్దంకిటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి సీఎస్ఆర్ కల్యాణ మండపంలో శనివారం ఎస్సీ, ఎస్టీ, గజిటెడ్ ఉద్యోగులు రాష్ట్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగకు సన్మాన సభ జరుగుతుందని ఎంఈఎఫ్ అద్దంకి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అనపర్తి రమేష్‌బాబు, గంగవరపు సిద్దు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున నియోజకవర్గ పరిధిలోని ఎంఆర్‌పీఎస్, మాదిగ ఉద్యోగులు అందరూ పాల్గొని సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇంకొల్లు, జూలై 11,(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం శ్రీ వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని హైస్కూల్ చైర్మన్ వలేటి కృష్ణయ్య తెలిపారు. ఈ ఉన్నత పాఠశాల 1956లో స్థాపించగా ఇప్పటికి 70 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అప్పటి నుంచి ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, ఎండోమెంట్ కమిషనర్ రామచంద్రమోహన్, మాజీ ఎమ్మెల్సీ ఎస్.లక్ష్మణరావు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

గ్రామాలలో వీధికుక్కల స్వైరవిహారం

మార్టూరు, జూలై11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో వీధికుక్కలబెడద అధికమయ్యిందని ప్రజానీకం వాపోతున్నారు. వీధులలో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు వీధులలో నడచివెళ్లాలంటే భయపడుతున్నారు. ఇక ద్విచక్రవాహనదారులు వెళుతుంటే కొన్ని వీధులలో కుక్కలు వెంటబడుతున్నాయని ద్విచక్రవాహనదారులు భయపడుతున్నారు. నాలుగురోజుల క్రితం మండలంలోని కోలలపూడి గ్రామంలో ఒకే రోజు 11 మంది పిచ్చికుక్క కాటుకు గురయ్యారు. అంతేగాకుండా ద్రోణాదుల, నాగరాజుపల్లి గ్రామాలలో కుక్కల దాడికి గాయపడినవారున్నారు.మార్టూరులో నేతాజీ నగర్, రామ్‌నగర్ కూడలి వద్ద రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. వలపర్ల గ్రామంలో మాంసం దుకాణాలు వద్ద కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డుపై వెళ్లే ద్విక్రవాహనదారుల వెంట బడుతున్నాయి. గతంలో గ్రామ పంచాయతీ వారు గ్రామంలో కుక్కల బెడద ను తొలగించడానికి చర్యలు చేపట్టేవారు. అయితే ప్రస్తుతం కుక్కలను గ్రామం నుండి పంపించడానికి, వాటి నిర్మూలనకు పంచాయతీ వారు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. దానికి తోడు జాతీయ రహదారి కావడంతో రాత్రి సమయంలో కొంత మంది వాహనాలలో కుక్కలను తీసుకువచ్చి, ఈ ప్రాంతంలో కుక్కలను వదిలివెళుతుండటంతో, మరింతగా గ్రామాలలో కుక్కలు సంచరిస్తున్నాయి. మరి ఈ నేపథ్యంలో కుక్కల సైన్యాన్ని గ్రామాల నుండి పారద్రోలడానికి పంచాయతీల ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవలసినఅవసరం ఉందని గ్రామస్తులు బావిస్తున్నారు.



మార్టూరులో వీధులలో వీధికుక్కల సంచారం

ప్రజలు బుద్ధి చెప్పినా మారని వైసీపీ నేతలు

- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి
- ఆత్మీయ సమావేశం పేరుతో నాయకుల అబద్ధాలాడటం సిగ్గుచేటని విమర్శ

టంగుటూరు (కొండపి), జూలై11 (ఆంధ్రజ్యోతి): ఆత్మీయ సమావేశం పేరుతో శుక్రవారం కొండపిలో వైసీపీ కార్యకర్తల సమావేశంలో నాయకులు మాట్లాడిన అసత్యాలపై రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తూర్పు నాయుడుపాలెంలోని తన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ నాయకుల అవాకులు, చెవాకులపై స్వామి నిప్పులు చెరిగారు. ప్రజలు 11 సీట్లిచ్చి బుద్ధి చెప్పినా వారికి బుద్ధి రాలేదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరగని సంక్షేమం, అభివృద్ధిని ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చేసి చూపిందని స్వామి తెలిపారు. తల్లికి వందనం పథకంలో చదువుకునే పిల్లలు ఎందరున్నా వారందరికీ డబ్బులు తల్లుల ఖాతాలో వేసినా సిగ్గు లేకుండా వైసీపీ నాయకులు తాము ఇచ్చినంత మందికి కూటమి ప్రభుత్వం ఇవ్వలేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2029 తర్వాత వైసీపీ రాష్ట్రంలో కనుమరుగవుతుందని స్వామి అన్నారు. మూడు నియోజకవర్గాలు మారిన మాజీ మంత్రి సురేష్ గతంలో ఒకసారి చొక్కా విప్పుకుని, తర్వాత ప్రజలతో చొక్కా విప్పించుకున్నాడని స్వామి విమర్శించారు. ఓటమి పాలైన సురేష్ పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నాడని స్వామి మండి పడ్డారు. జగన్ మోహన్‌రెడ్డిని మించిన నటుడు ఎవరూ లేరని, కొడికత్తి, బాబాయి గొడ్డలి లాంటి పనులు చేసి బాగా నటించాడని విమర్శించారు. వైసీపీ పాలనలో మహిళలపై జరిగినన్ని అఘాయిత్యాలు ఏరాష్ట్రంలో జరగలేదని, దళితులపై దాడులు జరుగుతుంటే సురేష్ నోరు మెదపలేదు ఎందుకు? అని స్వామి పేర్కొన్నారు. రప్పారప్పా అంటూ పిచ్చి మాటలు మాట్లాడితే వైసీపీ రాజకీయాలకి, రౌడీ మూకలకి కొండపి నియోజకవర్గంలో స్థానం లేదన్నారు. వైసీపీ రాబోయే రోజుల్లో అధికారంలోకి రావడం కల్ల మాత్రమేనని, ఎన్ని పగటి కలలు కన్నా మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వమేనని స్వామి పేర్కొన్నారు.



మంత్రి స్వామి

లంచమిస్తేనే రిజిస్ట్రేషన్

- లేకుంటే కొర్రీల కొరడా
- ఎనీవేర్‌తో ఎక్కడివైనా చేసేస్తారు..
- గిద్దలూరులో గత మంగళవారమే రెక్కీ

గిద్దలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌రావు అక్రమాలకు అంతులేకుండా పోతోంది. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ జీవోను అడ్డం పెట్టుకుని మార్కాపురానికి చెందిన ఒక స్థలం రిజిస్ట్రేషన్‌ను ఇటీవలే గిద్దలూరులో చేసి రూ.10లక్షలకుపైగా లంచం తీసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సక్రమమైన రిజిస్ట్రేషన్ అయితే మార్కాపురంలోనే జరిగేది కదా అని, ఇంత పెద్ద మొత్తం లంచం ఇచ్చారంటే ఆ రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలంలో ఏదో ఒక లొసుగు ఉండి ఉంటుందని ఏసీబీ అధికారులు తాజాగా చేసిన తనిఖీలో గుర్తించినట్లు తెలిసింది. పట్టణంలోని పలు స్థలాలు, బిల్డింగ్‌ల రిజిస్ట్రేషన్‌లో కూడా భారీ ఎత్తున డబ్బు గుంజినట్లు తెలిసింది. గిద్దలూరు పట్టణంలోని దాదాపు అన్ని ప్రాంతాలలో పాత ఇళ్ళు, స్థలాలకు రిజిస్ట్రేషన్లు ఉన్నప్పటికీ అప్పట్లో సర్వే నెంబరు వేసేవారు కాదు. ప్రస్తుతం సర్వే నెంబరు లేనిది రిజిస్ట్రేషన్ జరగడం లేదు. దానికితోడు చాలా మందికి వారి స్థలాలు, ఇళ్ల సొంతమే అయినప్పటికీ డాక్యుమెంట్లు ఉండవు. వీటిని అడ్డం పెట్టుకుని వీఆర్వోలతో పొజిషన్ సర్టిఫికేట్లు తీసుకుని లక్షలు ఇస్తే తప్ప రిజిస్ట్రేషన్లు జరుపని పరిస్థితి కనిపిస్తోంది.

ఇష్టారీతిన బరితెగింపు

ఎవరైనా లంచం తీసుకునేటపుడు గుట్టుచప్పుడు కాకుండా, మూడో కంటికి తెలియకుండా వీలుంటే మధ్యవర్తి సహాయంతో ప్రభుత్వ కార్యాలయంలో కాకుండా బయట ఎక్కడో తీసుకుంటారు. కానీ ఈ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ క్రిష్ణమోహన్‌రావు మాత్రం డాక్యుమెంట్ రైటర్లు వద్దు, మధ్యవర్తి వద్దు, నేరుగా మీరే రండి, లంచం మాట్లాడుకోండి, ఇచ్చిపోండి అంటూ కార్యాలయంలో బహిరంగంగానే చెబుతుంటారు. కార్యాలయం వెనకకు వెళ్లి అక్కడ ఉన్న చెట్టు వద్ద మూత్రవిసర్జన చేసి సిగరేట్ కాలుస్తూ అక్కడే లంచాలు అందరూ చూస్తుండగానే తీసుకుని జేబులో పెట్టుకుని వెళుతుండడం విశేషం. లక్షలాది రూపాయల లంచాలకు ఆ చెట్టే సాక్ష్యంగా ఉన్నట్లు గుసగుసలు ఆడుకుంటున్నారు. ఇంకా బరితెగించిన విషయమేమంటే ఎవరైనా లంచాలను డబ్బు రూపంలోనే తీసుకుంటారు. కానీ ఈయన మాత్రం బ్యాంక్ అకౌంట్‌లో వేసినా, ఫోన్‌పే చేసినా ఒకే అని చెప్పడం ఏసీబీ అధికారులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఏసీబీ రైడ్‌లో క్రిష్ణమోహన్‌రావు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన నేపథ్యంలో అతని బ్యాంక్ అకౌంట్, ఫోన్‌పేలను పరిశీలించగా అందులో ఉన్న ఎంట్రీలు చూసి నివ్వెర పోయినట్లు తెలిసింది. ఐదారు మంది డాక్యుమెంట్ రైటర్ల నుంచి లంచాలు నగదు రూపంలో కాకుండా ఎక్కువ భాగం ఫోన్‌పేల ద్వారా, అకౌంట్ ద్వారా సబ్ రిజిస్ట్రార్ వేసుకున్నట్లు గుర్తించి ఏసీబీ అధికారులే నోరెల్లబెట్టారు. గిద్దలూరులో పని చేసిన ఈ 8 నెలల కాలంలో ఇలా ఫోన్‌పేల ద్వారా జరిపిన ఎంట్రీలు సుమారు 60 పేజీలు ఉన్నాయంటే ఎంత బరితెగింపో ఇట్టే అర్థమవుతుంది. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే అదే రోజు సాయంత్రం 5 గంటలలోగా లంచం డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ డాక్యుమెంట్ రైటర్లపై ఒత్తిడి తెచ్చి డబ్బు తీసుకునే వాడని తెలిసింది. పార్టీ అకౌంట్‌లో వేశారు, డ్రా చేసి మరుసటి రోజు ఇస్తామంటే కూడా అవసరం లేదు, నా అకౌంట్‌లోకి కొట్టండి అంటూ సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వెళ్ళేలోగా లంచం సొమ్ము తీసుకునే వెళ్ళేవాడని తెలుస్తోంది.

మ్యారేజ్ సర్టిఫికెట్‌కు రూ.5వేలు

ప్రస్తుత రోజుల్లో మారిన నిబంధనల ప్రకారం మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి అయింది. మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం వస్తే ధనిక, పేద తేడా లేకుండా 5వేల రూపాయలు లంచం ఇస్తే తప్ప సర్టిఫికెట్ జారీ చేయని పరిస్థితి నెలకొంది. పాత రోజుల్లో మ్యారేజ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్‌కు వెయ్యి రూపాయల లంచం తీసుకునేవారు. కానీ ఈయన మాత్రం పెళ్లిళ్లకు లక్షలు ఖర్చు పెడతారు, లక్షలు కట్నంగా ఇచ్చుకుంటారు, మాకు 5వేలు ఇవ్వరా అంటూ ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇదేమని ప్రశ్నిస్తే తల్లి, తండ్రి, అత్త, మామ, పూజారులు, సాక్షులు అందరిని తీసుకురా అప్పుడు చూద్దామంటూ చెబుతుండడంతో చేసేది ఏమీ లేక అడిగినంత ఇస్తున్నట్లు తెలిసింది.



గిద్దలూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మంగళవారమే రెక్కి

తల్లి ఆస్తిని తన పేరు మీద గిఫ్ట్‌డీడ్ చేసుకునేందుకు కార్పెంటర్‌గా పని చేస్తున్న ఖాదర్ బాషా సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించారు. రూ.50వేలు లంచం డిమాండ్ చేయగా రూ.35వేలకు బేరం కుదిరింది. తన ఆస్తిని తనకు రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇంత మొత్తం లంచం ఇవ్వడం ఇష్టంలేని ఖాదర్ బాషా ఏసీబీ అధికారులను సంప్రదించాడు. అన్ని ఆధారాలు సేకరించుకుని నిజమే అని నిర్ధారణ చేసుకున్న ఏసీబీ అధికారులు గత మంగళవారమే గిద్దలూరు చేరుకున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయం తెలిసి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ క్రిష్ణమోహన్‌రావు మంగళవారం ఆఫీసుకు కూడా రాకుండా సెలవుపై వెళ్లిపోయారు. దాంతో చేసేదేమీ లేక ఏసీబీ అధికారులు వెళ్లిపోయినట్లు తెలిసింది. తిరిగి గురువారం డ్యూటీలో జాయిన్ కాగా హుటాహుటిన కర్నూలు, ఒంగోలు నుంచి ఏసీబీ అధికారులు గిద్దలూరు చేరుకుని వల పన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం గమనార్హం.

గంగమ్మ తల్లి కొలుపులు ప్రారంభం

చినగంజాం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసిన గంగమ్మ తల్లి కొలుపుల పూజలు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి యంపరాల హైమారావు అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తదనంతరం గంగమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలు, కనకతప్పెట్లతో ఊరేగింపుగా మోటుపల్లి సముద్ర తీరానికి తీసుకొని వెళ్లారు. ఆలయ పూజారి, యాదవ పెద్దలు కొండెపు వెంకటేశ్వర్లు, నక్కల పెదముత్తయ్యల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, సముద్ర స్నానం కార్యక్రమం నిర్వహించారు. అక్కడ నుండి ఊరేగింపుగా గ్రామంలోని శివాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన పూజా మందిరానికి చేర్చి పూజలు జరిపారు. శనివారం రాత్రి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం జరుపుతున్నట్లు తెలిపారు.

ఆటోని ఢీ కొట్టిన గేదె

చినగంజాం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : ఆటోని గేదె ఢీ కొట్టడంతో ఆటోడ్రైవర్‌కు గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. ఈ ఘటన కడవకుదురు గ్రామ పంచాయతీ పరిధిలోని పాతపాడు గ్రామ సమీపంలోని ఆర్అండ్‌బీ రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కడవకుదురు గ్రామానికి చెందిన తమ్మన వెంకటసుబ్బారావు తన ఆటోలో పదిమంది మహిళా భజన బృందం సభ్యులతో మన్నంవారిపాలెం గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో భజన చేసేందుకు బయలుదేరారు. గ్రామం నుండి బయలుదేరి మున్నంవారిపాలెం గ్రామం వెళ్తుండగా పాతపాడు గ్రామం వద్ద ఆర్ అండ్‌బీ రహదారిపై గేదె ఎదురుగా వచ్చి ఆటోని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో యాజమాని, డ్రైవర్ అయిన వెంకటసుబ్బారావుకు గాయమైంది. క్షతగాత్రుని చికిత్స నిమిత్తం స్థానిక వైద్యశాలకు తరలించారు. ఆటోలో ఉన్న మహిళలకు ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఘటనా స్థలాన్ని చినగంజాం పోలీసులు పరిశీలించారు.

హెపటైటీస్‌పై అవగాహన కలిగిఉండాలి

నాగులుప్పలపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హెపటైటీస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెల్ప్ స్వచ్ఛంధ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ.సాగర్ సూచించారు. శుక్రవారం బి.నిడమానూరు గ్రామంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో హైరిస్క్ వ్యక్తులను గుర్తించి వారికి హెపటైటీస్ బి, సి నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. వ్యాధిపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజరు కోటేశ్వరరావు, ఎస్ఎం రాధమ్మ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మేదరమెట్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీలలో రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. లింగసమానత్వం, గౌరవం అనే అంశంపై జరిగిన వ్యాసరచన, మాదకద్రవ్యాల వినియోగం-నివారణ అనే అంశంపై జరిగిన పెయింటింగ్ పోటీలలో పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న చీరాల లక్ష్మి, మేడిద వర్షలు ప్రథమ స్థానం సాధించారు. వీరికి మైనంపాడు జిల్లా డైట్ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బహుతులను కళాశాల ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు చేతుల మీదుగా అందుకున్నారు. తల్లికివందనం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో పిల్లల చదువులో తల్లిపాత్ర అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలలో 9వ తరగతి విద్యార్థి గొట్టిపాటి శశంక్ తృతీయ స్థానం సాధించారు. పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం రాఘవరెడ్డి, పాఠశాల కమిటి చైర్మన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.



ప్రశంసపత్రాలతో విద్యార్థులు

కుటుంబ నియంత్రణ, బాల్య వివాహాలపై అవగాహన

స్వర్ణ/పర్చూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో కుంటుంబ నియంత్రణ, బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ శాలిని బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యసిబ్బంది మానవహారం

సులభ్‌కాంప్లెక్స్ ఏర్పాటుకు భూమి పూజ

ఇంకొల్లు, జూలై 11,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థూపం కూడలి సమీపంలో సులభ కాంప్లెక్స్ ఏర్పాటుకు రోటరీ 3150 జిల్లా గవర్నర్ ఎస్.వీ.రామ్‌ప్రసాద్ శుక్రవారం భూమి పూజ చేశారు. ప్రజల సౌకర్యార్థం నిర్మించనున్న సులభ్‌కాంప్లెక్సు పనులు త్వరలో ప్రారంభించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి రాఘవరెడ్డి, క్లబ్ సభ్యులు,పంచాయితీ సెక్రటరీ అడ్డగడ్డ వెంకటేశ్వర్లు,హుసేన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

అవీఇవీ

మద్దిపాడు ఏఎంసీ చైర్మన్‌గా రాజేశ్వరి

- 20మంది కమిటీతో ప్రభుత్వం ఉత్తర్వులు

చీమకుర్తి, జూలై11(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు వ్యవసాయ కమిటీ చైర్మన్‌గా చీమకుర్తికి చెందిన ప్రముఖ టీడీపీ నాయకుడు సతీమణి మన్నం రాజేశ్వరిని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వరి, ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్‌కి ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా 20మంది సభ్యులతో కూడిన ఎంపిక జాబితాను ఉన్నతాధికారుల విడుదల చేశారు. వీరందరూ త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా రాజేశ్వరి ఎంపిక పట్ల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ప్రసాద్, రాజేశ్వరి

ఫ్యాక్షన్ గ్రామంపై ప్రత్యేక నిఘా : ఎస్సై

- రాజకీయ పార్టీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఒక వ్యక్తిపై బైండోవర్

బల్లికురవ. జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరంపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు కూడా సహకరించాలని ఎస్ఐ వై.నాగరాజు కోరారు. వేమవరంలో గత ఏనిమిదేళ్ల నుండి పికెట్ నిర్వహిస్తున్నారు. పోలీస్ పికెట్‌ను ఎస్ఐ తనిఖీ చేశారు. ఈ సందర్భం గా అయన మాట్లాడుతు కొత్త వ్యక్తులు ఎవరైన గ్రామంలోనికి వచ్చిన వారి వివరాలను సేకరించాలని సిబ్బందికి సూచించారు. వేమవరం గ్రామంలో మూడావత్ హరికృష్ణనాయక్ అనే వ్యక్తి రాజకీయ పార్టీకి చెందిన ఫ్లెక్సిని ఏర్పాటు చేయడంతో ముందస్తు జాగ్రత్తగా ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఆయనపై తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. గ్రామాలలో గోడవలు సృష్టించేందుకు ఎవరైన చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.



పికెట్‌ను పరిశీలిస్తున్న ఎస్సై

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యద్దనపూడి,(మార్టూరు)జూలై11(ఆంధ్రజ్యోతి):ద్విచక్రవాహనంపడిపోవడంతో,బైక్ పైన ఉన్న పెట్రోలు క్యాన్ నుండి మంటలు చెలరేగి , తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చేబ్రోలు సుబ్బారావు (48) శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ టి.రత్న కుమారి తెలిపారు. ఎస్సై కథనం మేరకు యద్దనపూడి మండలంలోని సూరవరపుపల్లి గ్రామానికి చెందిన సుబ్బారావు ఈ నెల 3న ద్విచక్రవాహనంపై జాతీయరహదారి పక్కన ఉన్న భారత్‌పెట్రోలు బంకులో 4 లీటర్లు పెట్రోలును ఒక క్యాన్‌లో తీసుకొని ఇంటికి వస్తున్నారు. ఈ సమయంలో మార్గమధ్యలో ద్విచక్రవాహనం పడిపోయింది. దీంతో పెట్రోలు క్యాన్ నుంచి పెట్రోలు రోడ్డుపై పడ్డాయి. తరువాత మంటలు వ్యాపించాయి. దీంతో సుబ్బారావుకు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను బంధువులు చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సుబ్బారావుకు భార్య కుమారుడు ఉన్నారు.

15 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

అద్దంకిటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): గ్రామాలల్లో ఈ నెల 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న మోదేపల్లి, జార్లపాలెం, విప్పర్లవారిపాలెం గ్రామాలలో, 16న పేరాయపాలెం, వేలమూరిపాడు, వెంకటాపురం, 17న కొంగపాడు, కలవకూరు, ధర్మవరం, 18న మణికేశ్వరం, చక్రాయపాలెం, శంఖవరప్పాడు గ్రామాలల్లో క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 22న బొమ్మనంపాడు, శింగరకొండపాలెం, కోటికలపూడి, 23న మైలవరం, గోపాలపురం, కుంకుపాడు, 24న ఉప్పలపాడు, నాగులపాడు, తిమ్మయపాలెం, 25న వెంపరాల, గోవాడ, రామాయపాలెం గ్రామాలల్లో జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు.

ఈ నెల 17 నుంచి పీ4 గ్రామసభలు

మండలంలోని గ్రామాలల్లో ఈ నెల 17వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు పీ4 గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సింగయ్య తెలిపారు. 21వ తేదీ నుంచి ఆగస్టు 6 వరకు నీడ్ టెస్ట్ సర్వే, గ్రామ సభలలో గుర్తించిన కొత్త కుటుంబాల సర్వే ఆ గస్టు 7 నుండి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

రేపటి నుంచి నిరవధిక సమ్మె



నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

అద్దంకిటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని ఈ నెల 13వ తేదీ నుండి జరిగే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం స్థానిక బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదాం, సీఐటీయూ నాయకులు తోట వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జాన్, సామ్యూల్, కోశాధికారి మారుతి, జాషువా, మార్కు తదితరులు పాల్గొన్నారు.

రాజుగారిపాలెంలో ఫ్లెక్సీ రగడ

మార్టూరు, జూలై11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుగారిపాలెం గ్రామంలో టీడీపీకి చెందిన ఫ్లెక్సీని వైసీపీకి చెందిన వ్యక్తి చించడంపై రెండు రోజులు నుంచి గ్రామంలో చర్చనీయాంశమయ్యింది. బుధవారం రాత్రి గ్రామంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అందుకు సంబందించి ఏలూరికి స్వాగతం పలుకుతూ గ్రామ నాయకులు చింతలపూడి శ్రీనివాసరావు పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రధానవీధుల ప్రక్కన ఫ్లెక్సీలను ఏర్పాటుచేయించారు. ఈ ఫ్లెక్సీలలో ఎమ్మెల్యే ఏలూరి తోపాటు గ్రామంలోని పార్టీకి చెందిన ప్రధాన నాయకుల ఫొటోలతో పాటు శ్రీనివాసరావు కూడా తన ఫొటోను వేయించగా బుధవారం మధ్యాహ్నం సమయంలో గ్రామంలోని వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధి తమ్ముడు ఫ్లెక్సీలో చింతలపూడి శ్రీనివాసరావు ఫొటోను చించివేశారు. అయినప్పటికీ, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగించారు. తర్వాత ఈ విషయంపై గ్రామంలో టీడీపీ, వైసీపీలకు చెందిన వ్యక్తుల మధ్య చర్చనీయాంశమైంది. తర్వాత శ్రీనివాసరావు ఈ విషయమై మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎం.శేషగిరిరావు రెండు పార్టీలకు చెందిన నాయకులతో మాట్లాతున్నట్లు తెలిసింది.

అవీ..ఇవీ..

ప్రాంతీయ వైద్యశాలలో సిబ్బంది నిర్లక్ష్యం

- ఆయమ్మలకు పనిచెప్పి కాలక్షేపం చేస్తున్న వైద్యులు
- కాన్పుల వార్డులో ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం



మహిళ చేతి క్యానులా తొలగిస్తున్న హాస్పిటల్ ఆయమ్మ

చీరాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రాంతీయ వైద్యశాలలోని బాలింతల వార్డులో ఆయమ్మలే వైద్యసేవలు అందిస్తున్నారు. సాధారణంగా నర్సులు వీరికి వైద్యసహాయకులుగా ఉండాలి. చేతి నరానికి క్యానులా ఏర్పాటు ఇతర డ్రసింగ్ పనులు నర్సులే చేయాలి. అయితే వారు ఆ పని నుంచి తప్పుకొని ఆయమ్మలతో పనిచేయిస్తున్నారు. సాధారణంగా ఒకవ్యక్తి అనారోగ్యంతో ఉన్నప్పుడు అతనికి తగు జాగ్రత్తలతో వైద్యం అందించడం చాలా అవసరం. ఇక బాలింతలకైతే మరి ముఖ్యంగా అత్యంత జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ఏమాత్రం సమస్య ఏర్పడినా తల్లీబిడ్డ ఇద్దరికి సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి బాలింతల వార్డుల్లో సుశిక్షితులైన నర్సులే వైద్యం అందించాలి. అయితే ఇక్కడ మాత్రం ఆయమ్మలతో వారు వైద్యం అందిస్తూ వీరు కాలక్షేపం చేస్తున్నారు. ఈక్రమంలో వైద్యాధికారులు చర్యలు చేపట్టకుంటే సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు.

బాధ్యతాయుతంగా బోధన ఉండాలి

- ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో గంగాధర్ సూచన



రాతపుస్తకాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో గంగాధర్

చినగంజాం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా బోధనపై దృష్టి సారించాలని చీరాల డిప్యూటీ డీఈవో డి.గంగాధర్ అన్నారు. మండలంలోని చినగంజాం, పెదపల్లెపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. చినగంజాం జడ్పీ పాఠశాలలో తరగతి గదులను, విద్యార్థుల రాత పుస్తకాలను, పెదపల్లెపాలెం జడ్పీ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా రాయడం, చదవడంపై ఆసక్తి కలిగేలా చేయాలని సూచించారు. వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం 4గంటల నుండి 5 గంటల వరక ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. తరగతి గదిలో చదవులో వెనుక బడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచి, శుచిగా ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అజయ్‌బాబు, చినగంజాం, పెదపల్లెపాలెం జడ్పీ పాఠశాలల హెచ్ఎంలు కే.శ్రీనివాసరెడ్డి, ఎల్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి



బీఎల్‌వోల శిక్షణలో మాట్లాడుతున్న విజయజ్యోతి

బల్లికురవ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారిణి విజయజ్యోతి కుమారి పేర్కొన్నారు. శనివారం బల్లికురవలో అన్ని గ్రామాల బూత్ లెవల్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలపై వారికి అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఎవరైన నిష్పక్షపాతంగా వ్యవహరిం చాలని ఎక్కడ వివాదాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కొత్త ఓట్ల చేర్పులపై పలు సూచనలు చేశారు. ఎలా దరఖాస్తులు తీసుకోవాలని దరఖాస్తు దారులకు రశీదు ఎలా ఇవ్వాలి అన్న దానిపై వివరించారు. ఈ శిక్షణలో తహసీల్దార్ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



సీసీ రోడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

యద్దనపూడి,(మార్టూరు)జూలై11 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న గ్రామాలను అభివృద్ధి చేయడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో శుక్రవారం రాత్రి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఏలూరిని స్వాగతించి, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులను అందించారు. తరువాత గ్రామంలో ఎస్సీ కాలనీలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఏలూరి ప్రారంభించారు. అనంతరం ఆయన గ్రామ పార్టీ నాయకులతో కలిసి వీధులలో నడుస్తూ, రోడ్డు పక్కన చిరువ్యాపారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని, రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబాన్ని అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అంతేగాకుండా ఎస్సీ కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, వాటికి సంబంధించిన కరపత్రాలను మహిళలకు పంచిపెట్టారు. వారి ఇళ్లలో బడికి వెళుతున్న పిల్లలు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారందరికీ తల్లికివందనం డబ్బులు చేరాయా..? అని వారితో ఆప్యాయంగా మాట్లాడారు. అనంతవరం గ్రామంలో ప్రజల సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానన్నారు. గ్రామంలో తాగునీరు సక్రమంగా అందుతున్నదా..? అంతర్గత రోడ్లు, సైడుకాల్వలు తీరు ఏ విధంగా ఉందని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంగా ఉన్న వారికి సీఎంరిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యానికి అవసరమైన సాయాన్ని అందజేస్తామన్నారు. ప్రజల ప్రభుత్వం, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమని రాష్ట్రాన్ని అన్నివిదాలా దివాలా తీయించిన జగన్ ప్రభుత్వ పాలనను మరచిపోయి, ప్రజలు సుఖశాంతులతో జీవనం సాగించాలన్నదే సీఎం ఆకాంక్ష అన్నారు. ప్రజలందరి సహకారంతో, రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ, ప్రజలుకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. అనంతవరం గామానికి అన్ని రకాలుగా అండదండలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నల్లపనేని రంగయ్యచౌదరి, గ్రామ నాయకులు గుదే తారకరామారావు, కొరటాల వంశీకృష్ణ, పోపూరి హనుమంతరావు, పోపూరి సాంబశివరావు, పెడవల్లి వెంకటేశ్వర్లు, మానుకొండ రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతమైన చీరాలే లక్ష్యం : ఎమ్మెల్యే కొండయ్య



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

చీరాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : 'గత పాలకుల మాదిరిగా నియోజకవర్గంలో ఇప్పుడు కక్ష సాధింపులు లేవు, భూములు, ఇతర స్థలాలు ఆక్రమణలు లేవు, ప్రశాంతమైన చీరాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం' అని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు శృంగారపేటలో, మండల పరిధిలోని బుర్లవారిపాలెంలో నిర్వహించారు. వార్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. దీంతో ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వర కు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరడంలో ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ యువనాయకులు గౌరిఅమరనాథ్ మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, మెప్మా కొండయ్య, పెద్దఎత్తున టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఏబీసీపై కొత్త వంతెనతో ప్రమాదాలకు చెక్

- రూ. 2 కోట్ల నిధులు మంజూరు
- మంత్రి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న స్థానికులు



ఏబీసీపై ప్రమాదకరంగా ఉన్న వంతెన



వంతెన వెంబడి ఏర్పాటు చేస్తున్న డైవర్షన్

బల్లికురవ. జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాల క్రితం అద్దంకి బ్రాంచ్ కాలువ వల్లాపల్లి లాకుల వద్ద ఏర్పాటు చేసిన వంతెన కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరింది. ఈ కాలువలో పడి ఇప్పటికే పలువురు ప్రాణాలను కోల్పోయారు. వంతెన పరిస్థితిని చూసిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ టీడీపీ అధికారంలోకి రాగనే శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో కొత్త హైలెవల్ వంతెన ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి రూ. 2 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో నూతన వంతెన నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ముందుగా పాతవంతెన పక్కనే రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తమూల ద్వారా డైవర్షన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పర్యాయం రెండు వాహనాలు ఒకేసారి వెళ్లేలాగా బ్రిడ్జిని ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఎంతో కాలం నుంచి ఉన్న సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేసిన మంత్రి రవికుమార్‌కు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు. బల్లికురవ వైపు నుండి అద్దంకి వైపు నిత్యం వందలాది గ్రానైట్ ముడిరాయి లారీలు ఏబీసీ కాలువపై ఉన్న వంతెన ద్వారా రాకపోకలు సాగిస్తుంటాయని రాయి లారీలు వెళ్లే సమయంలో వంతెన కూలి పోతుందన్న ఆందోళన ప్రజల్లో ఉంది. నూతన హైలెవల్ వంతెన త్వరిత గతిన పూర్తి చేస్తే రాకపోకలకు ఇబ్బందులు ఉండదని ప్రజలు పేర్కొంటున్నారు. సాగర్ నీరు పంటలకు విడుదల అయ్యే సమయానికి వంతెన పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దివ్యాంగులకు దాతల సాయం మరువలేనిది



బియ్యం పంపిణీ చేస్తున్న దాతలు, టీడీపీ నాయకులు

చినగంజాం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దివ్యాంగులకు దాతలు అందిస్తున్న సాయం మరువలేనిదని టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, ఏపీఎం గద్దె పెదసుబ్బారావులు అన్నారు. స్థానిక వెలుగు కార్యాయంలో మండల దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షురాలు విశ్రాంతమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల సమాఖ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మండలంలోని దివ్యాంగుల అభివృద్ధి కోసం వెలుగు సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని వీరయ్య అన్నారు. దివ్యాంగుల సమావేశం అనంతరం రాజుబంగారుపాలెం జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు ఆర్ఎస్‌వీ.పోతురాజు, అక్కయ్యపాలెం జడ్పీ పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు గాదె శ్రీనివాసరెడ్డిలు తమ సొంత నిధులతో 25 మంది దివ్యాంగులకు పది కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 15 మందికి వినికిడి యంత్రాలు, ఇద్దరు దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు పంపిణీ చేసినట్లు ఏపీఎం తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు కావూరి శారద, టీడీపీ నాయకులు పర్వతరెడ్డి పార్థసారిధి, చినగంజాం గ్రంథపాలకులు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు, మండల దివ్యాంగుల సమాఖ్య కార్యదర్శి వడ్లమూడి వేణు, సభ్యులు కే.సురేష్‌బాబు, చిట్టిబాబు, సీసీలు రంగస్వామి, శ్రీలక్ష్మి, మాధవి, మండల పరిధిలోని దివ్యాంగులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం



16వ వార్డులో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

అద్దంకి, జూలై11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని మాజీ ఎంపీపీ మన్నెం ఏడుకొండలు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం అద్దంకి పట్టణంలోని 16 వ వార్డులో స్థానిక టీడీపీ నేతలు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నేతలు య ర్రాకుల రామాంజనేయులు, కోటిలింగాచారి, అద్దంకి నరేష్, భైరపునేని మోహనరావు, కామినేని శీనావలి, మహలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఎదుగుదలకు ప్రభుత్వ తోడ్పాటు



దివ్యాంగ బాలబాలికలకు ఉపకరణాలు అందజేస్తున్న అధికారులు

పంగులూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగులైన బాలబాలికల ఎదుగుదలకు పలు విధాలుగా తగిన తోడ్పాటును అందిస్తోందని ఎంఈవో జి.వీరాంజనేయులు అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులోని భవితకేంద్రంలోని దివ్యాంగ బాలబాలికలకు ప్రభుత్వం సర్వశిక్షా అభియాన్ ద్వారా సమకూర్చిన ఉపకరణాలను శుక్రవారం స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు వారికి అందజేశారు. వీల్‌చైర్స్, బ్యాటరీచైర్స్‌తో పాటు బాలబాలికలకు అవసరమైన పదిరకాల ఉపకరణాలు అందించనున్నట్లు స్పెషల్ ఎడ్యుకేటర్ డి.భాస్కరమూర్తి తెలిపారు. దివ్యాంగ బాలబాలికల ఎదుగుదలకు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ లాంటి కార్యక్రమాలతో పాటు వారికి అవసరమైన ప్రత్యేక విద్యా కార్యక్రమాలు భవితకేంద్రం ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీలు యోహాన్, అరుణ, హెచ్ఎంలు సోమేపల్లి శ్రీనివాసరావు, కంకణాల శ్రీనివాసరావు, గుర్రం లక్ష్మీప్రసాద్. బాచిన లలితకుమారి, కల్పన, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

15న డయల్ యువర్ డీఎం

అద్దంకి,జూలై11(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఈ నెల 15న 11 గంటల నుండి 12 గంటల మధ్య నిర్వహించనున్నట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. అద్దంకి ప్రాంత ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు 9959225697 నంబరుకు తెలియజేయాలన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న సేవాసమితి సభ్యులు

అద్దంకి, జూలై 11(ఆంధ్ర జ్యోతి): శింగరకొండ కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం కష్టజీవుల సేవాసంఘం వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. అడుసుమల్లి వెంకటేశ్వర్లు, అరుణ దంపతులు తమ కుమార్తె పద్మతేజ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాకతీయ సేవాసమితి సభ్యులు సందిరెడ్డి శ్రీనివాసరావు, మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, నరశింహరావు, నర్రా గోపాలరావు, బొడెంపూడి రామ్మోహనరావు, కమ్మ శ్రీనివాసరావు, వృద్ధాశ్రమం నిర్వాహకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి, జూలై11(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో కొత్తగా విద్యుత్ టవర్ లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని డీఈఈ దామోదరం తెలిపారు. పట్టణంలోని సంజీవ నగర్, వియన్‌యస్ థియేటర్, ఆర్టీసీ బస్టాండ్, రామాటాకీస్ బజారు, పాత బస్టాండ్, ఎస్‌బిఐ రోడ్డు, పోలీస్ స్టేషన్ రోడ్డు, బంగ్లా రోడ్డు, కళామదిర్ సెంటర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

- చినగంజాం : మండల పరిధిలోని చినగంజాం, కొత్తపాలెం, పెదగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈఈ పి.గణనారామణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చినగంజాం, కొత్తపాలెం, పెదగంజాం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెవెన్యూ సమస్యలను గ్రామాలలోనే పరిష్కరించాలి



రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ. జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలోనే ప్రజల రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని, అధికారులు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపాలని తహసీల్దార్ రవినాయక్ కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో అన్ని గ్రామాల రెవెన్యూ సిబ్బందిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నీటిపన్నులు, భూముల రీసర్వే పనులు, కౌలు రైతు కార్డులు, నివేశన స్థలాలు వంటి సమస్యలు ఎక్కడ ఉన్న వెంటనే పరిష్కరించాలన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ తహసీల్దార్లు రవిబాబు, ప్రహర్ష, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను సందర్శించిన ఉన్నతాధికారులు

కారంచేడు/పర్చూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కారంచేడులో ముంచుకొస్తున్న నీటిఎద్దడిపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలోని జయప్రకాష్ నారాయణ్, లైబ్రరీ చెరువుతోపాటు, మాలచెరువును కూడా సందర్శించి నీటి నిల్వలను పరిశీలించారు. జయప్రకాష్ నారాయణ్ చెరువు పూర్తిగా అడుగంటంతో నీటి సరఫరా నిలిపివేసిన విషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకుపోయారు. ప్రజల అవసరాలకు సరిపడా నీటిని సరఫరా చేసే సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు లేనందున కొన్నేళ్ల నుంచి మూడు రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నట్లు పంచాయితీ అధికారులు ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రస్తుతం విడుదల చేసిన కొమ్మమూరు కాలువ నీటితో చెరువును నింపేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయితీ అధికారి స్థానిక కార్యదర్శిని ఆదేశించినట్లు సమాచారం.

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలి

- ఎంపీపీ మేకా అనంద కుమారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

పర్చూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికా రులు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీపీ మేకా అనందకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఆర్సీ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ మండల అభివృద్ధికి అధికారులు తోడ్పాటునందించాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ ఏవో భాస్కర్‌రావు మాట్లాడుతూ పొగాకు కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల వద్ద ఉన్న చివరి ఆకువరకు కొనుగోలు చేస్తామన్నారు. త్వరలో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నగదును రైతుల ఖాతాలో జమ చేస్తుందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు వేలాడుతుండటంతోపాటు, స్తంభాలు వరిగి ప్రమాదంగా మారాయని ఈసందర్భంగా పలువురు సభ దృష్టికి తీసుకు వచ్చారు. సమస్యను గుర్తించామని పరిష్కారానికి కృషి చేస్తామని ఎఈ రమేష్ తెలిపారు. ఎంఈవో వెంకట్రామయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి పిల్లవానికి అమ్మకు వందనం నగదు తల్లిదండ్రుల ఖాతాలో ప్రభుత్వం జమచేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



'పోగు'బంధం తెంచుకుని..

నూలును పోగు, పోగు పెనవేసి దుస్తులు నేసి మన సంస్కృతికి, సంస్కారానికి నిలువుటద్దంగా నిలిచే చేనేత కార్మికులు పేగుల ఆకలి తీర్చేందుకు ఆ 'పోగు' బంధాన్ని వదులుకుంటున్నారు. మగ్గాలే జీవితంగా.. వస్త్రాలే సర్వస్వంగా తరతరాల నుంచి జీవిస్తున్న వారు, బతుకు బండిని లాగేందుకు వేరే దారి వెతుక్కుంటున్నారు. కుల వృత్తిని నమ్ముకుని గౌరవంగా బతికిన నేతన్నలు కన్నబిడ్డలను సాకేందుకు కూలీలుగా మారుతున్నారు. ఎన్నేళ్లు నేసినా ఎదుగు బొదుగు లేక, మనసు చంపుకుని మగ్గం గుంటలు వదిలి వలస పోతున్నారు. నానాటికి పెరుగుతున్న ధరల తాకిడిని తట్టుకోలేక, అలాగని మరో పని చేయలేక కొందరు నేత వృత్తిలోనే నలిగిపోతున్నారు.

8 లో..


ఉదయగిరిలో దారుణ హత్య

ఆస్తి వివాదాలే కారణం

- వివరాలు 8లో..


సంగం ఐటీఐ.. లగడపాటి రామా నాయుడు ఐటీఐగా పేరు మార్పు

- వివరాలు 8లో..



శాకంబరి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు





రెవెన్యూ వ్యవస్థ

దేశానికే తలమానికం!

జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్ ● ఉత్సాహంగా రెవెన్యూ క్రీడల ప్రారంభం

నెల్లూరు (హరనాథపురం), జూలై 11 : దేశానికి రెవెన్యూ వ్యవస్థ తలమానికమని జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఏసీ స్టేడియంలో ఏపీఆర్ఎస్ఏ ఆధ్వర్యంలో రెవెన్యూ క్రీడోత్సవాలను కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికి తలసరి ఆదాయాన్ని చేకూర్చే శాఖ రెవెన్యూ అంటూ ఆ శాఖ గొప్పదనాన్ని వివరించారు. అంతేగాక ప్రజలకు దగ్గరగా పనిచేసేది రెవెన్యూ ఉద్యోగులేనని, వారి కోసం ప్రత్యేకంగా క్రీడోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో న్యాయశాఖలోని ఉద్యోగుల కోసం కూడా క్రీడలను నిర్వహించేందుకు ఆలోచన చేస్తామని చెప్పారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రెవెన్యూ క్రీడలను ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకుని, తమ జీవితంలో ఒక భాగంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్, కలెక్టర్ ఆనంద్

● వాలీబాల్ ఆడిన కలెక్టర్, జేసీ

రెవెన్యూ క్రీడలలో భాగంగా కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్‌లు వాలీబాల్ పోటీలను ప్రారంభించి కాసేపు సరదాగా ఆడారు. ఈ కార్యక్రమాల్లో కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో హుస్సేన్ సాహెబ్, కలెక్టరేట్ ఏఓ విజయకుమార్, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పరుగు పందెం పోటీలను వారు ప్రారంభించారు. లెమన్‌స్పూన్, టగ్‌వార్, చెస్, క్యారంబోర్డు, త్రోబాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడాంశాలపై రెవెన్యూ ఉద్యోగులకు పోటీలు జరిగాయి.



వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్..

శాకంబరిగా రాజరాజేశ్వరి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం శాకంబరి అలంకరణ జరిగింది. మూలవర్లు, ఉత్సవమూర్తులు, ప్రాకార దేవతలు, గర్భాలయం, అనివెట్టి మండపాన్ని కూరగాయలు, పండ్లతో అలంకరించారు. అనివెట్టి మండపంలో రాజరాజేశ్వరి అమ్మవారికి కాళికాదేవి అలంకారం భక్తులకు కనువిందు చేసింది. కలేపండ్లు, చుక్కుడు గింజలు, బెంగళూరు మిర్చితో రూపొందించిన ఈ అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రకాల పండ్లు, కూరగాయలను తొలచి మలిచిన రూపాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సామూహిక లలితా సహస్ర నామ పారాయణం జరిగింది. రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ 18 సంవత్సరాలుగా ఏటా ఆషాడ మాసంలో కొలపర్తి వెంకట రమేష్‌కుమార్, సువర్ణలక్ష్మి దంపతులు ఈ అలంకరణ చేయిస్తున్నారు. ఈ ఏడాది అలంకారాన్ని రూరల్ ఎమ్మెల్యే సతీమణి కోటంరెడ్డి సుజితమ్మ ప్రారంభించారు. ఈవో జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

● వాసవీదేవికి గోరింట శోభ

నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 350 కిలోల గోరింటాకుతో విశేష అలంకారం జరిగింది. సామూహిక లలితా సహస్రనామ పారాయణం, అన్నదానం జరిగాయి. సాయంత్రం విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని దర్శించుకున్న మహిళా భక్తుల చేతులకు ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఉచితంగా గోరింటాకు డిజైన్లు వేయించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు, గౌరవ సలహాదారు ఎంపీ అంజనేయులు తదితరులు పర్యవేక్షించారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు



ఎరువుల గోదాములో తనిఖీ చేస్తున్న ఏఓ జహీర్

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కలిగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'యూరియా ఏదయ్యా' అనే శీర్షికన ఓ కథనం ప్రచురితమైంది. దీంతో వ్యవసాయ అధికారులు కలిగిరి మండలంలోని

- మిగతా 7వ పేజీలో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

17న బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ 8



నగరంలోని ఆర్టీసీ కార్గోలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గుడ్లూరు మద్యం.. గుట్టు తేలుద్దాం!

జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ అధికారుల విస్తృత తనిఖీలు
ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో ఆరా

నెల్లూరు (క్రైం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం.. ఈ పేరు వింటే చాలు మందుబాబుల్లో వణుకు మొదలవుతుంది. గతంలో ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు పంపిణీ చేసిన అక్రమ మద్యం తాగి పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలో ఈ నెల 5వ తేదీన గుడ్లూరు ప్రాంతంలో నకిలీ మద్యం తయారు చేసే ఓ ముఠాను ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి స్పిరిట్‌ను తీసుకు వచ్చి మద్యం తయారు చేసి సీసాల్లో నింపి తక్కువ ధరకే బెల్ట్‌షాపులకు విక్రయిస్తున్నారు. అయితే, ఈ నకిలీ మద్యం గుడ్లూరు ప్రాంతానికే పరిమితం అయ్యిందా!? లేదా జిల్లావ్యాప్తంగా వ్యాపించిందా!? అనే కోణంలో ఎక్సైజ్ పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు.

● గుడ్లూరులో నకిలీ మద్యం

మండల కేంద్రమైన గుడ్లూరు గ్రంథాలయం వీధిలో ఉంటున్న ఉప్పలపాటి వీరాంజనేయులురాజుతోపాటు మరికొందరు నకిలీ మద్యం తయారు చేసి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని బెల్ట్‌షాపులకు తరలిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై విచారిస్తుండగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సూత్రధారి అయిన వీరాంజనేయులురాజు నెల్లూరులో కూరగాయల దుకాణం

- మిగతా 7వ పేజీలో

రేషన్ మాఫియాకు చెక్ పడేనా!?

జిల్లాలో ప్రతినెలా 2 వేల టన్నుల బియ్యం పక్కదారి

- గుడిపల్లిపాడు కేంద్రంగా మాఫియా అక్రమాలు
- రీసైక్లింగ్ చేసి మార్కెట్లోకి విడుదల
- రూ.15లకు కొనడం.. రూ.60కి అమ్మడం
- రాష్ట్ర ప్రభుత్వానికి నిఘా వర్గాల నివేదిక
- పౌరసరఫరాల శాఖ అధికారులతో మంత్రి నాదెండ్ల సమీక్ష
- బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు
- పోర్టు ప్రాంతంలో 24 గంటల చెక్‌పోస్టు ఏర్పాటు?

నెల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం పక్కదారి పట్టడం.. ఇదేమీ కొత్త విషయం కాదు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ వ్యవహారం నడుస్తున్నా అడపాదడపా అధికారులు పట్టుకొని పెనాల్టీలు విధించి వదిలేయడం తప్ప కఠినచర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇదే అలుసుగా అక్రమార్కులు మాఫియాగా ఏర్పడి బియ్యాన్ని బొక్కేస్తున్నారు. పేదల బియ్యాన్ని మళ్లీ రీసైక్లింగ్ చేసి ప్రజల్లోకి తీసుకొస్తూ రూ.కోట్లు సంపాదించుకుంటున్నారు. కృష్ణా, గోదావరి జిల్లాల్లో రేషన్ బియ్యాన్ని విదేశాలకు అక్రమంగా ఎగుమతి చేస్తుండగా, నెల్లూరు జిల్లాలో మాత్రం రీసైక్లింగ్ చేస్తూ ప్రజలను దోచుకుతింటున్నారు. నెల్లూరు శివార్లలోని గుడిపల్లిపాడు కేంద్రంగా ఈ రేషన్ మాఫియా శాసిస్తుండగా, కావలి, కందుకూరు ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తోంది.

● నిఘా వర్గాల ద్వారా సమాచారం

రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ఎక్కువ పక్కదారి పడుతున్న జిల్లాల్లో పరిస్థితిని నిఘా వర్గాల నుంచి సమాచారం తెప్పించుకుంది. ఆ జాబితాలో నెల్లూరు కూడా ఉండడం గమనార్హం. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. అమరావతిలోని సచివాలయంలో నెల్లూరు, విశాఖ, కాకినాడ జిల్లాల పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేషన్ బియ్యం అక్రమ రవాణాను నిలువరించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ 6ఏ కేసులు నమోదు చేసి పెనాల్టీలు విధించి వదిలేస్తుండగా, ఇకపై ఆ పద్ధతికి స్వస్తి చెప్పాలని సూచించారు. 6ఏతోపాటు పీడీ యాక్టు, బీఎన్ఎస్ చట్టాల కింద కూడా కేసులు నమోదు చేసి అక్రమార్కుల ఆట కట్టించాలని మంత్రి ఆదేశాలిచ్చారు. అంతేగాక పోర్టు ప్రాంతంలో 24 గంటల చెక్‌పోస్టును పెట్టాలని ఆదేశించడం గమనార్హం. ఈ ఆదేశాలతోనైనా రేషన్ మాఫియాకు అధికారులు చెక్ పెడతారా? అన్నది చూడాలి.

● ఇక్కడ రూ.15.. అక్కడ 60

జిల్లాలో ఏడు లక్షల రేషన్ కార్డులు ఉండగా, సుమారు 20 లక్షల మంది బియ్యాన్ని తీసుకుంటున్నారు. ప్రతీ నెలా సుమారు 10 వేల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం కిలో రూపాయికే అందిస్తోంది. ప్రతీ నెలా సరాసరి 87 శాతం మంది రేషన్ బియ్యాన్ని తీసుకుంటున్నట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. అయితే రేషన్ తీసుకుంటున్న వారిలో సగం మంది వరకూ ఆ బియ్యాన్ని తినడం లేదు. ఇంతకుముందు ఇంటి దగ్గరకు వచ్చే వ్యక్తులకు బియ్యాన్ని అమ్మేసేవారు. అయితే ఇప్పుడు రేషన్ తీసుకున్న చోటనే బేరం జరుగుతోంది. రేషన్ పంపిణీ చేసే వ్యక్తులే 'మీకు బియ్యం కావాలా..? డబ్బులు కావాలా..?' అని అడుగుతున్నారు. డబ్బులు కావాలని చెబితే కిలోకు రూ.15 చొప్పున ఇచ్చేసి కొనేస్తున్నారు. ఇప్పుడు కొత్తగా కార్డుదారులను షాపు వరకు రానీయకుండా నేరుగా ఇళ్లకే వెళ్లి వేలిముద్రలు వేయించుకుంటుండడం గమనార్హం.



నెల్లూరులోని కుమ్మరివీధిలో రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు (ఫైల్)

● అందరికీ వాటాలే..!

ప్రతిషాపులో ప్రతీ నెలా ఏ స్థాయిలో బియ్యం కొనుగోలు జరుగుతోందో స్పష్టత ఉంటుంది కాబట్టి ఆ స్థాయి మొత్తం బియ్యం బస్తాలను నేరుగా రేషన్ మాఫియాకు చేరవేస్తున్నారు. ప్రతీ నెలా సుమారు 2 వేల టన్నుల రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు అంచనా. ప్రధానంగా గుడిపల్లిపాడు కేంద్రంగా ఈ మాఫియా దందా నడుపుతోంది. రేషన్ బియ్యం మొత్తాన్ని అక్కడకు చేరవేసి, అక్కడున్న మిల్లుల్లో రీసైక్లింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ బియ్యాన్ని మార్కెట్లో పేరున్న బ్రాండ్ల పేరుతో బస్తాల్లో నింపి (కిలో రూ.60 చొప్పున) విక్రయిస్తున్నారు. ఇలా మాఫియా ఒక్కో కేజీకి రూ.40 వరకూ మిగుల్చుకుంటోంది. ఇందులో రూ.10లు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, అధికారులకు పంపకాలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	212
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 540

పారిశుధ్యం నిర్వహణలో కావలికి 12వ స్థానం

కావలి, జూలై 11(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై నిర్వహణపై రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో కావలి మున్సిపాల్టీ రాష్ట్రంలో 12వ స్థానం దక్కించుకుంది. రాష్ట్రంలో 77 మున్సిపాల్టీలలో రాష్ట్రప్రభుత్వం చేట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో కావలి 12వ స్థానంలో నిలిచిందని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అందించిన సహాయ సహకారాలు, ప్రజలు సహకారంతో పట్టణంలో పారిశుధ్య మెరుగుదలకు విభిన్న కార్యక్రమాలు చేపట్టడం ద్వారా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందగలిగిందన్నారు.

376 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 450 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 376 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-56, ఆర్‌ఆర్-4, సీఆర్-11, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 74 బేళ్లు తిరస్కరించా. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.212.03గా నమోదైంది.

న్యూస్ బాక్స్

ప్రపంచ జనాభా దినోత్సవం

కందుకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు నరేంద్ర మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, లభ్యమవుతున్న వనరుల మధ్య సమతుల్యతపై ప్రజల్లో అవగాహన కల్పించటం లక్ష్యంగా ప్రతిఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకురాలు లక్ష్మి, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ రాజగోపాలబాబు, ప్రశాంతి, కె. కరుణకుమార్ పాల్గొన్నారు.

వైద్యాధికారి పర్యటన

బిట్రగుంట, జూలై 11(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీ, ఏబీకండ్రిక పంచాయతీని జిల్లా ఫ్లోరోసిస్ వైద్యాధికారి సీహెచ్.సాయిదివ్య శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. గ్రామంలో ప్రజలు తాగుతున్న నీటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం. ఆశావర్కరు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కందుకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం ఈఈఈ, సివిల్ విభాగాల్లో మిగిలిపోయిన సీట్లును భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9505504201, 9985152442ను సంప్రదించాలని కోరారు.

నోట్‌బుక్స్ పంపిణీ

కందుకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు వైకాంట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా శుక్రవారం నోట్‌బుక్స్, డ్రాయింగ్ బుక్స్, పలకలు పంపిణీ చేశారు. బెంగళూరు కేంద్రంగా నడుస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధిగా ఉన్న మదనగోపాలపురం పాఠశాల హెచ్‌ఎం రామయ్య ద్వారా వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కళ్లగుంట మోహనరావు, సంస్థ ప్రతినిధులు వనజ, బాలభాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

వలేటివారిపాలెం, జూలై 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న బీమా సౌకర్యాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని జమీన్‌ఉప్పలపాడులో శుక్రవారం పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై, పీఎంజేడీవై బీమా సదుపాయాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఆ కార్యక్రమంలో మేనేజర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ బీమా సదుపాయం వలన తక్కువ ఖర్చుతో రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు బీమా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌అఫీసర్ రవికుమార్, రైతులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం, రూరల్ మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని 2వ పట్టణ ఏఈ వసంతరావు, రూరల్ ఏఈ శ్రీనివాసులురెడ్డిలు వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్ల వెంబడి ఉంటున్న చెట్ల కొమ్మలు కొట్టే కార్యక్రమం ఉన్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే విద్యుత్ సిబ్బంది కూడా ఎవరూ సెలవు పెట్టకూడదన్నారు.

● **కలిగిరి** : మండలంలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

● **అల్లూరు** : అల్లూరు, నార్తుమోపూరు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ మస్తాన్ షరీఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అల్లూరు, నార్తుమోపూరు, బీరంగుంట, నార్తుఆములూరు, బట్రకాగొల్లు, గ్రద్దగుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

● **బిట్రగుంట** : బోగోలు మండలంలోని 4 విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మలను తొలగించేందు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు ఏఈ జడరాయ ఓ ప్రకటనలో తెలిపారు. చెంచులక్ష్మీపురం, జక్కేపల్లిగూడూరు, ముంగమూరు, వడ్డిపాలెంలో సబ్‌స్టేషన్లలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదాలు సహకరించాలని తెలిపారు.

రహదారుల సొగసు

చూడతరమా?

» అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు
» కల్వర్టుల వద్ద కోసుకుపోయిన మట్టి
» రోడ్లను కమ్మేస్తున్న ముళ్ల చెట్లు
» అడుగడుగున గుంతలతో నరకయతన
» ప్రయాణికులు, వాహనచోదకులకు తప్పని తిప్పలు



రాళ్లపాడు ప్రాజెక్టు వంతెనపై గుంతలుపడి అధ్వానంగా మారిన రోడ్డు

గ్రామీణ ప్రాంతాలకు రహదారుల సౌకర్యం మెరుగ్గా ఉంటే ఆ గ్రామాలు అభివృద్ధి చెందుతున్నట్లే లెక్క. కానీ ఆ రహదారులు అడుగడుగున పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. రోడ్డు మార్జిన్లు అధ్వానంగా ఉన్నాయి. కల్వర్టుల వద్ద కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. రోడ్లకు ఇరువైపుల ఏపుగా పెరిగి రోడ్డును కమ్మేస్తున్న ముళ్ల చెట్లు ఇబ్బందిగా మారాయి. వంతెనల రక్షణ గోడలు ప్రమాద భరితంగా మారి రహదారుల సొగసు చూడతరమా? అన్న విధంగా దర్శనమిస్తున్నాయి. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. లింగసముద్రం మండలంలోని పలు రహదారులు ఇదే పరిస్థితిలో ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహనచోదకులకు తిప్పలు తప్పడం లేదు.

\- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి)

లింగసముద్రం మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని మొగిచెర్ల వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. సుమారు నాలుగైదేళ్ల క్రితం కందుకూరు ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ రోడ్డుపై ఒక లేయరు తారు రోడ్డు నిర్మించారు. ఆ సమయంలో ఇక్కడ కల్వర్టు వద్ద రోడ్డుపై గుంత ఏర్పడింది. అయినప్పటికీ అధికారులు ఈ గుంత మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో అప్పటి నుంచి వర్షం కురిసిన ప్రతిసారి ఈ రోడ్డుపై ఉన్న గుంత కాస్తా పెద్దదిగా మారుతోంది. ఈ క్రమంలో కొందరు వాహనదారులు ప్రమాదాలు జరగకుండా ఈ గుంత వద్ద ఓ పెద్ద బండరాయిని ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజులకు ఆ బండ కూడా ఆ గుంతలోనే పడిపోయింది. మళ్లీ ఈ గుంత వద్ద ముళ్లకంప వేసి ప్రమాద సూచికంగా ఓ గుడ్డ ఏర్పాటు చేశారు. కానీ ఈ గుంత కూడా పెద్దది కావడంతో కల్వర్టు కింద ఉన్న మట్టి కూడా భారీగా కోతకు గురై ఈ రోడ్డు కాస్తా కల్వర్టు దిమ్మెలపై వేలాడుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డుపై ప్రతి రోజూ కందుకూరు, కావలి ప్రాంతాల నుంచి బస్సులు, ఇతర వాహనాలు మొగిలిచెర్ల, పామూరు వెళుతుంటాయి. అలాగే ప్రతి శని, ఆదివారాల్లో వాహనదారులు మాల కొండ, మొగిలిచెర్లలోని దేవాలయాలకు భారీగా వెళుతుంటారు.



మట్టి మొత్తం కోసుకొని పోవడంతో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



అధ్వానంగా లింగసముద్రం పాత చెరువు కట్ట రోడ్డు

● అధ్వానంగా రాళ్లపాడు ప్రాజెక్టు రోడ్డు

రాళ్లపాడు ప్రాజెక్టు వంతెన రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఏళ్ల తరబడి ఈ రోడ్డుపై గుంతలుపడి దారుణంగా ఉండడం, వర్షాలు కురిసిన ప్రతిసారీ రోడ్డుపై ఉన్న ఈ గుంతలు పెద్దవి అవుతున్నాయి. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది ప్రతినిత్యం విధుల నిర్వహణకు ఈ రోడ్డు మీదుగానే ప్రాజెక్టు వద్దకు ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే ఇక్కడ జరిగే సభలు, సమావేశాలకు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా అప్పుడప్పుడు వస్తుంటారు. అదేవిధంగా ఈ రోడ్డు మీదుగా కొండాపురం, కలిగిరి, నెల్లూరు, చెన్నైకు, అలాగే శాయిపేట, పెదపవని మీదుగా కావలి, నెల్లూరుకు వాహనాలు తిరుగుతుం టాయి. ఈ రోడ్డుపైనే ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మాలకొండ, దత్తాత్రేయస్వామి ఆలయాలకు వెళ్లాలి. ఇంతటి ప్రాముఖ్యతున్న ఈ ప్రాజెక్టు వంతెన రోడ్డును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

● దుస్థితిలో పాత చెరువు కట్ట రోడ్డు

లింగసముద్రంలోని పాత చెరువు కట్ట రోడ్డు ఏళ్లతరబడి అభివృద్ధికి నోచుకోక అడుగుకో గుంత ఏర్పడి దుస్థితికి చేరింది. ముఖ్యంగా వర్షాలు కురిసిన ప్రతిసారి ఈ గుంతల్లో నీరు నిలిచి గుంతలు పెద్దవై అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం, మాలకొండరాయునిపాలెం, విశ్వనాథపురం, వీఆర్ కోట తదితర గ్రామాల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు, నిత్యావసర సరుకులకు ప్రతినిత్యం లింగసముద్రం రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాక వ్యవసాయ పనులకు తిమ్మారెడ్డిపాలెం, లింగసముద్రం గ్రామాల ప్రజలు ఈ రోడ్డును ఉపయోగిస్తారు. ఈ రోడ్డు అభివృద్ధిపై చర్యలు తీసుకునే నాథుడు కరవయ్యాడని స్థానికులు విమర్శిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు

● 'సుపరిపాలన తొలి అడుగ'లో ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే చంద్రబాబునాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఉప్పుచెరువు కాలనీలో రాజరాజేశ్వరి గుడివద్ద నుంచి శుక్రవారం సాయంత్రం ప్రారంభించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, పువ్వాడి కోటయ్య, భవనాసి వెంకటేశ్వర్లు, వేముల పణీంద్ర, కందల వెంకటరావు, సుబ్బ రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన పురుషోత్తం, అమృతమ్మలు

సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అందుకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచు మల్లికార్జున, పాలేటి రవి, హరిబాబు, మంచాల మాలకొండ్రాయుడు, నవీన్, భరత్‌కుమార్, కామినేని అశోక్, మేకల అశోక్, కామినేని శ్రీదేవి, చొప్పర రాఘవులుపాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

వలేటివారిపాలెం మండలం కాకర్లపాలెంకు చెందిన వైసీపీ నాయకులు బెజవాడ పురుషోత్తం, అమృతమ్మలు శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. కందుకూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లబోతుల అంకయ్య, బోడ రమణయ్య, నల్లబోతుల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలుర హాస్టల్ తనిఖీ

పట్టణంలోని ఓవీ రోడ్డులో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌ను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను, గదులను పరిశీలించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న భోజనం నాణ్యత, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని, భోజనం నాణ్యత మెనూ అమలులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించబోమని సిబ్బందికి సూచించారు.

● **వలేటివారిపాలెం** : మండలంలోని అయ్యవారిపల్లె, చుండి గ్రామాల్లో శుక్రవారం

గురుకులానికి నగదు వితరణ

బిట్రగుంట, జూలై 11(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల అవసరార్థం కోవూరుపల్లి వైద్యుడు రామకృష్ణ రూ.20 వేల శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం పాఠశాల్లో జరిగిన మెగా సమావేశానికి అతిథిగా వెళ్లిన తనకు విద్యార్థినుల క్రమశిక్షణకు నచ్చిందన్నారు. అయితే గురుకుల పాఠశాల్లో భోజనం తయారీకి వంటగ్యాసు సమస్య ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకుని తన సొంత నిధుల నుంచి ఆర్థిక సహాయం అందచేసినట్లు తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చి విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులకు ఇబ్బంది కలుగ కూడదని తన వంతు సహాయం అందచేశానన్నారు.

వైభవంగా సాయిబాబా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో సాయినాథుడు

కలిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయినాథుడికి కలిగిరి పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. విశేషపుష్పాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రజలు స్వామివారికి కాయకర్పూరం సమర్పించి ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వెంట చిన్నారులు ప్రదర్శించిన కోలాటం అందరిని అలరించింది.

● **బిట్రగుంట:** బోగోలు రాజావీధిలో కొలువై ఉన్న షిరిడీ సాయినాథుడుకి గురుపౌర్ణమి సందర్భగా గురువారం అర్ధరాత్రి ప్రత్యేక పూల అలంకరణలో గ్రామోత్సవం వైభవంగా జరిగింది.



పురవీధుల్లో ఊరేగుంతున్న షిరిడీ సాయినాథుడు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

కావలి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకునేందుకు పోరాటాలకు ఆశా వర్కర్లు సిద్ధంగా ఉండాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణమ్మ పిలుపునిచ్చారు. సీఐటీయూ అనుబంధ సంస్థ ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ కావలి పట్టణ మూడవ మహాసభ శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వసుంధర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ఆశావర్కర్ల యూనియన్ ఏర్పడి 20ఏళ్లు పూర్తి అయిందని, అప్పటి నుంచి వారి సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నామన్నారు. పాలకులు వారికి తక్కువ జీతాలు ఇచ్చి ఎక్కువ పనులు చేయించుకుంటున్నారన్నారు. కనీస వేతనాలు కూడా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పీ.పెంచలయ్య, వసుంధరదేవి, ఎస్.గాయిత్రీలు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పీ.పెంచలయ్య, అధ్యక్షురాలిగా ఎస్.గాయిత్రీ, ప్రధాన కార్యదర్శిగా టీ.వసుందరాదేవి, సహాయకార్యదర్శిగా గిరీశమ్మ, పలువురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

వర్మికంపోస్టు ఎరువు విక్రయం

ఉలవపాడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఉలవపాడు పంచాయతీ ఆధ్వర్యంలో చెత్త నుంచి తయారు చేసిన వర్మికంపోస్టు ఎరువును శుక్రవారం మామిడి రైతుకు విక్రయించారు. చెత్త నుంచి సంపద తయాతీ కేంద్రంలో రెండు నెలలపాటు చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ చేసి 1000 కిలోలు సహసిద్ధమైన సేంద్రియ ఎరువును తయారు చేసినట్లు కందుకూరు డీఎల్‌పీవో కృష్ణమోహన్ తెలిపారు. ఒక కిలో మోతాదు ఎరువు ధర రూ.8 చొప్పున విక్రయించినట్లు చెప్పారు. గ్రామంలో గృహాలు, కూరగాయలు, పండ్ల షాపుల నుంచి సేకరించిన తడి చెత్తను 6, 7 వారాలు నాడెప్ తొట్టెల్లో కుళ్లపెట్టి అనంతరం ఆరుబయట ఆరపెట్టి వ్యర్థాలను తొలగించి వానపాములు ఉన్న తొట్టెల్లో సుమా రు 50 రోజులు ఉంచడం వలన ఏర్పడిన ఎరువును ఫిల్టర్ చేసి సంచుల్లో భద్రపరుస్తున్నామని వివరించారు. నిరంతరం ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి వీరయ్య తెలిపారు. సేంద్రియ ఎరువు మామిడి చెట్లకు చేసే మేలు తెలిసి కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చానని రైతు శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు నాగలక్ష్మి, ఎంపీడీవో సురేష్, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, సచివాలయం కార్యదర్శులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వర్మికం పోస్టు ఎరువును రైతుకు అందచేస్తున్న సర్పంచు నాగలక్ష్మి, డీఎల్‌పీవో కృష్ణమోహన్

గుట్టు తేలుద్దాం!

(5వ పేజీ తరువాయి)

నడుపుతూ నకిలీ మద్యం వ్యాపారం చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. దీంతో ఆయన్ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. ఈ క్రమంలోనే గుడ్లూరులోని ఆయన ఇంట్లో సోదాలు చేయగా భారీగా ఖాళీ డబ్బాలు, మద్యం సీసాలు దొరికాయి. నకిలీ మద్యం తయారీలో కలిపే 400 లీటర్ల రెక్టిఫైడ్ స్పిరిట్‌ను, సీలింగ్ స్టిక్కర్లు, సీలింగ్ మిషన్, ఖాళీ సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

● జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు

గుడ్లూరు ప్రాంతంలో నకిలీ మద్యం పట్టుబడిన తర్వాత జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేస్తున్నారు. వైన్‌షాపులు, బార్లు, ఆర్టీసీ బస్టాండ్లలోని కార్గో పాయింట్లు, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు సర్వీస్ పాయింట్లు తదితర ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. రికార్డులను పరిశీలించడం, ఏ సరుకు ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్లిందనే కోణంలో ఆరా తీస్తున్నారు.

నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

నకిలీ మద్యం తయారీ, విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాము. గుడ్లూరులో నకిలీ మద్యం పట్టుకున్న తర్వాత జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నాము. ప్రభుత్వ అనుమతులు పొందిన వైన్‌షాపులు, బార్లలో మాత్రమే మద్యం కొనుగోలు చేయాలి. బయట ప్రాంతాల్లో మద్యం కొనుగోలు చేయవద్దు.

\- దయాసాగర్, ఎక్సైజ్ డీసీ

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

ఎరువుల దుకాణాలు గోదాముల్లో తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎస్‌కే జహీర్ మాట్లాడుతూ రైతులు తాము కొన్న ఎరువులకు తప్పనిసరిగా రశీదు అడిగి తీసుకోవాలన్నారు. అదేవిధంగా వ్యాపారులు కూడా ఎమ్మార్పీ కంటే అధిక ధరకు ఎరువులు విక్రయించకూడదని హెచ్చరించారు. సిద్దనకొండూరు పీఏసీఎస్‌లో యూరియా అందుబాటులో ఉందని, కలిగిరి, కుడుములదిన్నెపాడు పీఏసీఎస్‌లలో యూరియా తెప్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్లు, నోట్‌పుస్తకాల పంపిణీ

కందుకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓగూరు ఆదిఆంధ్ర కాలనీ ప్రాథమిక పాఠశాలలో మేక్ ఏ ఛేంజ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్లేట్లు, వాటర్‌బాటిల్స్, నోట్‌పుస్తకాలు, బోధనాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుబ్బారెడ్డి, సొసైటీ సభ్యులు రవ్వా శ్రీనివాసులు, ఇన్నమూరి శ్రీనివాసులు, కొత్త నరేంద్రకుమార్, మనోహర్, నూకతోటి మాలిరావు, హెచ్‌ఎం ఎస్కే. ఆషా, సీఆర్‌పీ శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది దంపతులకు గాయాలు

కావలిరూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని ముసునూరు జాతీయ రహదారిపై పార్వతమ్మ గెస్ట్‌హౌస్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కావలి పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్‌పార్టీ కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి చింతాల వెంకట్రావు దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు, బాధితుడి కథనం మేరకు.. కోర్టు పనుల నిమిత్తం వెంకట్రావు, వైద్య పరీక్షలు కోసం ఆయన భార్య పద్మావతిలు శుక్రవారం కారులో నెల్లూరుకు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని కావలికి వస్తుండగా కొద్ది క్షణాల్లో ఇంటికి చేరుతారనుకొనే తరుణంలో మార్గమధ్యంలో స్థానిక పార్వతమ్మ గెస్ట్‌హౌస్ సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో న్యాయవాది వెంకట్రావుకు తీవ్రగాయాలు కాగా ఆయన భార్య పద్మావతికి స్వల్పగాయాలయ్యాయి. డ్రైవర్ శ్రీకాంత్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కాగా డివైడర్ పైకి చేరిన కారు మధ్యలో ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

విద్యుత్ అదాలత్‌కు 7 అర్జీలు



అర్జీలు ఇస్తున్న వినియోగదారులు

కావలి, జూలై 11(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న విద్యుత్ డీఈ కార్యాలయంలో శుక్రవారం కావలి నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌కు 7 అర్జీలు వచ్చాయి. విద్యుత్ అదాలత్‌కు చైర్మన్‌గా విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థికసభ్యులుగా జీ.మధుకుమార్, స్వతంత్ర సభ్యులుగా విజయకుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వినియోగదారులనుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని చెప్పారు. అయితే అదాలత్‌కు వచ్చిన పలువురు వినియోగదారులు విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వద్దని, లోఓల్టేజీ సమస్య, తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం తదితర సమస్యలను అదాలత్‌దృష్టికి తీసుకెళ్లినా దానిపై స్పందించలేదు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ విజయన్, కావలి కార్యనిర్వాహక ఇంజనీర్ బెనర్జీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, ఏఈలు పాల్గొన్నారు.

విట్స్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

కావలిటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు (ఐసీసీఏఆర్‌ఈ 2025) శుక్రవారం ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సును అనంతపురం జెఎన్‌టీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య శివకుమార్ పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాబోవు రోజుల్లో సమాజానికి ఏఐ ఇతర సాంకేతిక రంగాలతో గల అవసరాలను తెలియజేస్తూ విట్స్ కళాశాల జరుగుతున్న ఈ అంతర్జాతీయ సదస్సు ఆయా రంగాల్లో పరిశోధకులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సదస్సు సమన్వయకర్త డాక్టర్ శృజన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ దేశంలోని వివిధ పేరొందిన కళాశాలల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు రావటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, చైర్మన్ విద్యాధర్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



అనంతసాగరం : సొసైటీ కార్యాలయం ముందు బారులు తీరిన ఆటోలు



సంగం : సొసైటీ వద్ద రైతుల నిరీక్షణ

యూరియా కోసం బారులు

యూరియా కోసం రైతులు పడు తున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అనంతసాగరం వ్యవసాయ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం యూరియా పంపిణీ చేస్తుండగా రైతులు భారీగా అక్కడకు చేరుకొన్నారు. కార్యాలయం ముందు ఆటోలు కూడా బారులు తీరాయి. సబ్సిడీపై యూరియా అందజేస్తుండగా పంపిణీలో ఒత్తిడి పెరిగింది. అవసరమైన రైతులకు ఎరువులు అంద జేస్తామని, ఆందోళన చెందవద్దని ఏవో శైలజాకుమారి తెలిపారు.

● సంగంలో పడిగాపులు

సంగం సొసైటీలో సర్వర్‌లో సరిగా లేక శుక్రవారం ఈ పాస్ ఆగిపోయింది. మళ్లీ కార్యదర్శి వేలిముద్ర వేస్తేగాని ఈ పాస్ ఆన్ కాదు. ఆయన అందుబాటులో లేకపోవ డంతో యూరియా కోసం వచ్చిన రైతులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఒకవైపు యూరియా డిమాండ్ కారణంగా సకాలంలో లభ్యం కావడంలేదు. అధికారులు స్పందించి సర్వర్ పనిచేసేలా చర్యలు తీసుకోవడంతోపాటు అధికారి అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు. - అనంతసాగరం/సంగం, (ఆంధ్రజ్యోతి)

మహాభారతంలో భద్రకాళి పూజ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహాభారతంలో శ్రీకృష్ణరాయబార ఘట్టం అనంతరం కురు పాండవులు మహాభారత యుద్ధానికి సిద్ధమైన వేళ జరిగే విశేషాలతో శుక్రవారం ఉత్సవం జరిగింది. అలుగు నిలుపులు, ఐలావంతుని వధ, భద్రకాళి పూజలు జరిగాయి. ఉదయం హోమాలు, భగవద్గీత పారాయణం, చప్పర ఉత్సవం జరిగాయి. రాత్రి మహాభారత ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రేపు ఇరగాళమ్మకు

శాకంబరి అలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం శాకంబరి అలంకారం జరుగుతుందని ఈవో వి.గిరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అందరూ శాకాంబరి అలంకారంలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు

పెంపొందించాలి : కలెక్టర్

నెల్లూరు(విద్య), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక తరగతుల నుంచే విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు అధికారులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో బడిపిల్లల ప్రావీణ్యత గురించి నిర్వహించిన పరాఖ్ సర్వేక్షన్ సర్వే-2024 ఫలితాలపై విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పిల్లల విద్యా సంబంధ విషయాలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల నాణ్యతా ప్రమాణాలను పెంపొందించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పిల్లల్ని మోడల్ స్కూల్స్‌లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహ పడేలా తయారు చేయాలని తెలిపారు. డీఈఓ బాలాజీరావు మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలోని 108 పాఠశాలల్లో 3, 6, 9 తరగతులకు చెందిన 2,927 మంది విద్యార్థులు, 379 మంది ఉపాధ్యాయులు ఈ సర్వేలో పాల్గొన్నారన్నారు. ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండా పిల్లలు స్వతహాగా ఈ సర్వేలో పాల్గొనేలా నిర్వహించినట్లు చెప్పారు. ప్రాథమిక తరగతుల నుంచి ఉన్నత పాఠశాల తరగతులకు వచ్చిన విద్యార్థుల్లో కొన్ని అంశాల్లో ప్రావీణ్యత తగ్గడం గమనించామన్నారు. దీనిని అధిగమించేందుకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, డిప్యూటీఈఓలు, ఎంఈఓలు, డైట్ అధ్యాపకులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మహాసభ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వెంగళరావు యాదవ్, నాయకులు

17న బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ

● జాతీయ అధ్యక్షుడు వెంగళరావు

నెల్లూరు(హరనాథపురం), జూలై 11 : ఈనెల 17న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ జరుగుతుందని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వెంగళరావు యాదవ్ తెలిపారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీల సమస్యలపై తమ సంఘం రాజీలేని పోరాటం చేస్తోందని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు బొమ్మి నాగకిషోర్ మాట్లాడుతూ బీసీ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహాసభ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెరుమాళ్ల పద్మజా యాదవ్, దేవరాల సుబ్రహ్మణ్యం, ఆవుల నరసింహం, గుంజి మనోహర్, బెల్లంకొండ శీనయ్య, నక్కల నాగరాజు పాల్గొన్నారు.

బాలసదన్‌లో చైర్‌పర్సన్ తనిఖీ

నెల్లూరు(హరనాథపురం), జూలై 11 : నెల్లూరులోని బాలసదన్‌ను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ బీ పద్మావతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదన్‌లోని పిల్లలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదు పెట్టెలను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో మమత తదితరులు పాల్గొన్నారు.



బాలసదన్‌ను తనిఖీ చేసి రికార్డులు చూస్తున్న పద్మావతి

'పోగు'బంధం తెంచుకుని..

● ప్రత్యామ్నాయ వృత్తుల్లోకి చేనేతలు ● గిట్టుబాటు కాని నేతపని

● పెరిగిన ఖర్చులతో కష్టంగా మారిన జీవనం

● మనసు చంపుకుని మగ్గాలకు దూరంగా..

● వందల కుటుంబాలు 'ఉపాధి' కోసం వలస

● ప్రభుత్వ చేయూత కోసం ఎదురు చూపు

నెల్లూరు రూరల్లోని నారాయణరెడ్డిపేట ప్రాంతానికి చెందిన శీనయ్య (పేరు మార్పు) చేనేత కార్మికుడు. ఇంట్లోనే మగ్గం ఉంటుంది. తల్లిదండ్రులు, భార్యతో కలిసి నేత నేసేవాడు. నేత దుస్తులకు గిరాకీ తగ్గి కూలీ సరిపోవడంలేదు. ఎంత మంది నేత నేసినా కుటుంబ అవసరాలు తీరని దుస్థితి నెలకొంది. గత్యంతరం లేక, కుటుంబ పోషణ భారమై నెల్లూరు నగరంలో కూలి పనికి వెళ్తున్నాడు.

ములుముడిలోని మరో కుటుంబానిదీ ఇదే దుస్థితి. ఇంట్లో మగ్గం నేసుకుంటూ ఇద్దరు పిల్లల్ని చదివించాల్సి రావడంతో ఆర్థిక ఇబ్బందులతో అప్పులు పెరిగాయి. దీంతో పిల్లల్ని బడికి పంపి మగ్గం పక్కన పెట్టి భార్య, భర్తలిద్దరు బయట పనులకు వెళ్తున్నారు. నేత పనికి గిరాకీ లేకపోవడం, కూలి ధరలు గణనీయంగా తగ్గిపోవడంతో ఈ పరిస్థితి ఎదురైనట్లు వారు చెప్పుకొచ్చారు.

నెల్లూరు రూరల్. జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం నారాయణరెడ్డిపేటలో సుమారుగా 300 మంది మగ్గాలపై ఆధారపడి జీవిస్తుండగా, మరో 400 కుటుంబాలు ప్రత్యామ్నాయ వృత్తుల్లోకి వెళ్లిపోయాయి. ములుముడి గ్రామంలో ప్రస్తుతం 50 మగ్గాలుండగా మరో 200 కుటుంబాల వారు ఉపాధి కోసం వలస బాటపట్టారు. ఇక సౌత్‌మోపూరులో వందకు పైగా మగ్గాలుండగా 200 కుటుంబాలకు చెందిన నేతన్నలు ఇతర రంగాల్లోకి అడుగుపెట్టారు. మగ్గం ఉన్నప్పటికీ నెల పొడవునా పని లేకపోవడం, చేసిన పనికి తగిన కూలి దక్కకపోవడంతో ఉపాధి కోసం వలసబాటపడుతున్నారు.

బతుకుతెరువు కోసం ఇతర రంగాల్లోకి...

కుటుంబాన్ని పోషించుకునేందుకు, అప్పుల ఊబి నుంచి గట్టెక్కెందుకు చేనేత కార్మికుల కుటుంబాలు వలసబాట పడుతున్నాయి. ఆటో డ్రైవర్లుగా కొందరు జీవిస్తుండగా, కొన్ని కుటుంబాల్లో భార్య, భర్తలిద్దరు బేల్దారి పనులకు వెళ్తున్నారు. యువకులు దుకాణాల్లో యువతులు పాఠశాలలు, కళాశాల్లో పనులకు చేరుతున్నారు. మరికొందరు పెయింటింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్లు, క్యాటరింగ్ వైపు ఉపాధిని వెతుక్కుంటున్నారు. ఇంకొందరు రొయ్యల ఫ్యాక్టరీలు, కృష్ణపట్నం పోర్టులో డైలీ కూలీలుగా పనిచేస్తున్నారు. బయట పనులకు వెళ్లలేని వారు ఇంట్లోనే ఉండి అచ్చులు అతుకుతూ, అల్లుల వద్ద సహాయకులుగా, కండెలు చుడుతూ వచ్చినదాంతో సరిపెట్టుకుంటున్నారు.

ప్రభుత్వ చేయూత కోసం ఎదురు చూపు

గత వైసీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసిందని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వమైనా తమకు అండగా నిలుస్తుం దేమోనని చేనేత కార్మిక కుటుంబాలు ఆశగా ఎదు రు చూస్తున్నాయి. జగన్ పాలనలో ఏడా దికి ఒకసారి డబ్బులిచ్చి చేతులు దులు పుకోవడంతో నేత పరిశ్రమ పూర్తిగా కుదేలైంది. నూలుపై సబ్సిడీలు, నేత కార్మికులకు వృత్తి ప్రోత్సాహకాలు లేవు. దీని వల్ల పరిశ్రమ ఉనికికి ప్రమాదం ఏర్పడింది. ఇప్పటి ప్రభుత్వమైనా తమ కళను గుర్తించి జిల్లాలో నేత బజారు ఏర్పాటు చేస్తే మగ్గాలపై తయారైన వస్త్రాలను అక్కడే అమ్ము కుంటామని చేనేతలు వేడుకుంటున్నారు. నూలుపై సబ్సిడీ ఇవ్వడం వల్ల వ్యాపారులు మళ్లీ మగ్గాలకు పనిస్తారని, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తే ఆర్థికంగా కుదుటపడుతామని కోరుతున్నారు.



నారాయణరెడ్డిపేటలో నిరుపయోగంగా మగ్గం

గిట్టుబాటులేక ఆటో నడుపుకుంటున్నా



ఇంట్లో మగ్గం నేసుకునేందుకు వీలున్నా కూలి గిట్టుబాటులేదు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. దీంతో ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా. మగ్గం నెయ్యాలని ఉంది కానీ కష్టానికి తగిన ఫలితం దక్కడం లేదు.

- పడవల మురళి, సౌత్‌మోపూరు

వేరే పని చూసుకున్నాము



చేనేత పరిశ్రమను నమ్ముకుని ఇప్పటి వరకు జీవనం సాగించాము. పెద్దవాళ్లు బయటకు రాలేని దుస్థితి. ఉపాధి అవకాశాల కోసం మేమంతా బయటకు వచ్చేశాము. వేరే పనులు చేసుకుంటూ ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడుతున్నాము.

- పముజుల శ్రీనివాసులు, ములుముడి

ప్రభుత్వం చేయూతనందిస్తే....



మేమంతా మగ్గాలకు దూరంగా నేత వృత్తిని వదులుకోవాల్సి వచ్చింది. పనిలేదు, ఉన్నా గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం చేనేత పరిశ్రమకు చేయూతనిచ్చి, సబ్సిడీలు, వస్త్రాలు అమ్ముకునేందుకు మార్కెటింగ్, కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తే తిరిగి మగ్గం నేసుకుని వృత్తిని కాపాడుకుంటాము.

- కటికాల వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డిపేట

దారికాచి యువకుడిపై

గుర్తుతెలియని వ్యక్తుల దాడి

లింగ సముద్రం, జూలై 11 (ఆంధ్ర జ్యోతి) : ఓ యువకుడిపై గుర్తు తెలి యని ఇద్దరు యువకులు దారికాచి దాడి చేసిన ఘటన మండలంలోని తిమ్మారెడ్డిపాలెం మోడల్ స్కూల్ సమీపంలోని గండివాగు బ్రిడ్జి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ దాడిలో గంగపాలెం ఎస్సీ కాలనీ (మాదిగపాలెం)కు చెందిన బొమ్మల రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి బంధువుల కథనం మేరకు.. కందుకూరు పొగాకు బోర్డులో పని చేస్తున్న రాజేష్ సాయంత్రం 4 గంటల సమయంలో వెంగళాపురంలో బస్సు దిగి తన ద్విచక్ర వాహనంపై గంగపాలెం వెళ్తుండగా తిమ్మారెడ్డిపాలెంలోని మోడల్ స్కూల్ సమీపంలో గండివాగు బ్రిడ్జి వద ఇద్దరు యువకులు రాజేష్‌ను ఆపి సెల్‌ఫోన్ ఇవ్వమని అడిగారు. అయితే రాజేష్ సెల్‌ఫోన్ ఇవ్వక పోవడంతో వారు రాజేష్‌ను బలంగా నెట్టడంతో మోటారు సైకిల్‌తో సహా కింద పడ్డాడు. దీంతో ఆ ఇద్దరు యువకులు రాజేష్ దాడికి పాల్పడ్డారు. అయితే వారి నుంచి తప్పించుకున్న రాజేష్ బంధువుల సహాయంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

భాగవత సప్తాహం ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 3వ మైలు రామకృష్ణ మిషన్‌లో శుక్రవారం రాత్రి పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో భాగవతంపై ప్రవచనాలు (సప్తాహం) ప్రారంభమయ్యాయి. దీనిని రామకృష్ణ మిషన్ శ్రీహృదానందజీ మహరాజ్ అనుగ్రహ భాషణతో ప్రారంభించారు. అవధాని కోట రాజశేఖర్, ప్రహ్లాద చరిత్రలో మధుర ఘట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పోలవరపు లక్ష్మీనరసింహారావు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, ఎన్.బలరామయ్యనాయుడు, అగస్త్యరాజు సుబ్బారావు, తుర్లపాటి లక్ష్మీనారాయణ, డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య పాల్గొన్నారు.



భాగవత సప్తాహ సభ ప్రారంభోత్సవంలో ప్రముఖులు

వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారిణి శోభారాణి

ఉదయగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు వసతిగృహ సంక్షేమాధికారులు కృషి చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారిణి కె శోభారాణి సూచించారు. శుక్రవారం స్థానిక ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయంలో ఉదయగిరి డివిజన్ పరిధిలోని వసతిగృహాల సంక్షేమాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వసతిగృహంలో వంద మంది విద్యార్థులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 64 వసతి గృహాల్లో మరమ్మతు పనులు జరుగుతున్నాయని, ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం పనులు పూర్తిచేసి విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడంతోపాటు పీహెచ్‌సీ వైద్యాధికారిచే వైద్యశిబిరం నిర్వహించాలన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం వసతి గృహాల్లో అన్ని వసతులు కల్పిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని ఆమె కోరారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో కె రమణారెడ్డి, వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరిలో దారుణ హత్య!

ఉదయగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. కొండాపురం మండలం గరిమెనపెంటకు చెందిన షేక్ మహ్మద్ హమీద్ తన సమీప బంధవులతో కలిసి 2023లో ఉదయగిరి ఆర్టీసీ డిపో సమీపంలో ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాల్ నిర్మించారు. అనంతరం ఫంక్షన్ హాల్ విషయమై వారి మధ్య వివాదాలు చోటుచేసుకుని కోర్టులో కేసు నడుస్తోంది. ఈ తరుణంలో హమీద్ శుక్రవారం రాత్రి స్థానిక యువకులతో కలిసి ఫంక్షన్‌హాల్‌కు తాళం వేసేందుకు వెళ్లాడు. ఇది తెలుసుకున్న వెంగళరావునగర్‌కు చెందిన వారి సమీప బంధువులైన ఉమర్‌అలీ, హనీఫ్‌లు అక్కడకు చేరుకుని హమీద్‌పై కత్తి, రాడ్డుతో విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో హమీద్ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. నిందితులు పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీను లు తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీం వివరాలు సేకరించింది. అలాగే కలిగిరి సీఐ వెంకటనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరారీలో ఉన్న నిం దితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

లగడపాటి రామానాయుడు ఐటీఐగా

సంగం ప్రభుత్వ ఐటీఐ మార్పు

● ప్రభుత్వం జీవో నెం.239 విడుదల

సంగం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐకి ఇక లగడపాటి రామానాయుడు ప్రభుత్వ ఐటీఐగా పేరు మార్చుతూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్‌టి నెంబరు 239 విడుదల చేసింది. సంగం ప్రభుత్వ ఐటీఐ 2013లో మంజూరైంది. దీంతో సంగంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థతికి చేరి ఖాళీగా వదిలేసిన మూడు భవనాలలో తాత్కాలికంగా ఐటీఐని ప్రారంభించారు. నాలుగేళ్ల కిందట సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కొత్త భవనాలు మంజూరు కావడంతో ఐటీఐ నిర్వహిస్తున్న తాత్కాలిక భవనాలను ఖాళీ చేయాల్సి వచ్చింది. దీంతో సంగంలో ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో నాలుగేళ్లుగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో 2023లో హైదరాబాదుకు చెందిన జీఆర్‌ఎన్ కంపెనీ సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించేందుకు ముందుకు రావడంతో జీఆర్‌ఎన్ (గంటా రమణయ్య నాయుడు ప్రభుత్వ ఐటీఐగా జీవో విడుదల చేసింది. కానీ ఆ కంపెనీ ఐటీఐకి కేటాయించిన స్థలంలో జంగిల్ క్లియరెన్స్ చేసినా 18 నెలలుగా భవనాలు నిర్మించలేదు. ఈ నేపథ్యంలో దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో మండలంలోని తరుణవాయి పంచాయతీ అమరవనాయుడు కండ్రికలో ల్యాంకో ఫౌండేషన్ 2.25 ఎకరాల్లో నిర్మించి అసంపూర్తిగా ఉన్న రెండు బ్లాక్‌ల్లో మూడు ఫ్లోర్‌లతో 32 గదులను ఐటీఐకి అప్పగించేందుకు అంగీకరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పరిశీలించిన ప్రభుత్వం అందుకు అంగీకరించి సంగం ప్రభుత్వ ఐటీఐని లగడపాటి రామానాయుడు ప్రభుత్వ ఐటీఐగా మార్చుతూ జీవో ఆర్టీ నెంబరు 239 విడుదల చేసింది. దీంతో సంగం ప్రభుత్వ ఐటీఐకి శాశ్వత భవనాలు ఏర్పడనున్నాయి. దీంతో ఇటు అధ్యాపకులతో పాటు అటు విద్యార్థులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ల్యాంకో ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



సంగం ప్రభుత్వ ఐటీఐకి అప్పగించిన ల్యాంకో ఫౌండేషన్ భవనాలు ఇవే

'ఉపాధి' బిల్లుల విడుదల

హర్షణీయం

● ఎమ్మెల్సీ బీద

నెల్లూరు (వైద్యం), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పెండింగ్ బిల్లుల విడుదలకు ఉత్తర్వులు ఇవ్వటం ఆనందంగా ఉందని ఎమ్మెల్సీ ఉపాధి పథకం హామీ పెండింగ్ నిధుల సాధన కమిటీ సమన్వయకర్త బీద రవిచంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిధులు వచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ ప్రత్యేక కృషి చేశారని తెలిపారు. 2014 - 19 కాలంలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల బిల్లులను వైసీపీ ప్రభుత్వం కక్షిపూరితంగా ఆపివేసిందని ఆరోపించారు. ఆ బిల్లుల కోసం ప్రస్తుత ప్రభుత్వం నిరంతరం కేంద్రంతో సంప్రదించిందని, త్వరలో రూ. 231 కోట్లు విడుదల కానున్నాయని బీద వెల్లడించారు.

'సోమశిల'కు పెరిగిన వరద

అనంతసాగరం జూలై 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం శుక్రవారం పెరిగింది. గురువారం 165 క్యూసెక్కులు ఉండగా మరుసటి రోజుకు 1,131 క్యూసెక్కులుగా నమోదయ్యింది. ప్రస్తుతం డ్యాంలో 28.660 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,650 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కాన్పుల మధ్య అంతరం ఉండాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత

● అధిక జనాభా అనర్థాలపై ప్రదర్శన



జెండా ఊపి ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), జూలై 11 (అంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యం కోసం కాన్పుకి, కాన్పుకి మధ్య అంతరం ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. జనాభా పెరుగుదలతో కలిగే అనర్థాలపై శుక్రవారం నెల్లూరులో అవగాహన ప్రదర్శన జరిగింది. నగరంలోని పొదలకూరు రోడ్డులో ఈ ప్రదర్శనను డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు. జనాభా పెరుగుదల అనర్థాలు, సురక్షిత మాతృత్వం, వివిధ కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ మాతృత్వం కోసం ప్రణాళికాబద్ధంగా నడుచుకోవాలని సూచించారు. దీనిపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని, ప్రతీ గర్భిణికి వైద్య పరీక్షలు... వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించేలా దంపతులను చైతన్యపరచాలన్నారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ జనాభా పెరుగుదలను అదుపు చేయాలన్నారు. గర్భస్థ పిండ నిర్ధారణ చట్టం లింగ నిష్పత్తి సమతుల్యత, ఆడపిల్ల పుట్టుక ఆవశ్యకతపై డెమో కనరత్నం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, డీఎంవో హుస్సేనమ్మ, డిప్యూటీ హెచ్‌ఈవో వెంకటేష్, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.